SOME PAGES IN THE ORIGINAL CONTAIN FLAWS AND OTHER DEFECTS WHICH APPEAR ON THE FILM

సత్యనారాయణ, సుంకర, 1909-1975

ముందడుగు

బెజవాడ, 1945

Record no. 117

Satyanārāyaṇa, Suṅkara, 1909-1975

Mundaḍugu

Bejavāḍa, 1945

Record no. 117

Bibliographic Record Target

సత్యనారాయణ, సుంకర, 1909-1975.
ముందడుగు : నాటకం / సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు. - బెజవాడ : ప్రజాశక్తి కార్యాలయం, 1945.
(6), 72 p. ;16 cm.
Record no. 117

Satyanārāyaṇa, Suṅkara, 1909-1975.
Mundaḍugu : nāṭakaṃ / Suṅkara Satyanārāyaṇa, Vāsireḍdi Bhāskararāvu. - Bejavāḍa : Prajāśakti Kāryālayaṃ, 1945.
(6), 72 p. ;16 cm.
Record no. 117

ముందడుగు

(నాటకం)

రచన:

శంకర సత్యనారాయణ
వాసిరెడ్డి భాస్కరరావు

ప్రజాశక్తి కార్యాలయం
బెజవాడ

ప్రచురణ నెం. 118

మా మనవి.

మన తెనుగుదేశంలో అనేకజమీందారీ ప్రాంతాలున్నాయి. ఆప్రాంతాలలోని ప్రజలకు పూరి గుడిసెల్లో కాపురం. సరిగ్గా పంటలుండవు. చదువుసంధ్య లంటారా, చెప్పేదేముంది! బొత్తుగా శూన్యం. ఈ మన సోదర రైతుల కష్టాలేమిటో, సమస్యలేమిటో, తెలిసికోవడానికి తగినట్లుగా మే మీనాటకం వ్రాశాం. ఇది మా మొదటి ప్రయత్నం.

పరంపరలుగా వచ్చి పైనబడే కష్టాలలో మునిగి తేలుతూ పంటలు పండించి ప్రపంచానికి యింత అన్నంపెట్టే రైతులోకానికి యీ నాటకం యేమాత్రం వుపరికరించినా, మాకృషి ఫలించినట్లే.

మహానటులలో వొకరనిపేరు గడించారు శ్రీ కోడూరు అచ్చయ్యగారు. వీరిది ముదినేపల్లిగ్రామం. రైతుబిడ్డ. నాట్యరంగానికి సంబంధించిన అమూల్యమైన తమ సలహాలిచ్చి మాకెంతో తోడ్పడ్డారు. ఈ నాటకంలోని ధనికరైతు అచ్చయ్య పాత్రను ధరించి మన అచ్చయ్యగారు అత్యద్భుతంగా నటించారు కూడా.

ఇందలి పాటలకు చక్కని స్వరాలుపెట్టి తోడ్పడ్డారు శ్రీ తాతినేని చలపతిరావుగారు. వీరిద్దరికి మా వందనాలు.

ఇట్లు,
రచయితలు.

పన్నెండు అణాలు

ప్రజాశక్తి ప్రెస్
బెజవాడ

పరిచయం

"ఈనాటకం పల్లెటూరి జీవితాన్ని తెలుపుతూ వ్రాయబడింది. జమీందారీ గ్రామాలలో రైతులు పడే బాధలను చిత్రించింది. జమీందారీ యుగపు దురాచారాలను చూపుతుంది. చైతన్యం పొందుతున్న రైతాంగం తమ హక్కులను రక్షించుకోడానికి ప్రయత్నించుతారు. మధ్య వూగిస లాడే పెద్దరైతు క్రమంగా రైతుల వుద్యమంవైపు ఆకర్షించబడతాడు. క్లుప్తంగా చెప్పాలంటే 'ముందడుగు' నాటకంయొక్క యితివృత్తం ఇదే"

నాటకాన్ని రచించినవారు రైతుబిడ్డలు; రైతువుద్యమంలో ఆరి తేరిన ప్రజాసేవకులు. ప్రజావుద్యమంలో వచ్చే సమస్యలను తీసికొని వారీనాటకాన్ని రచించారు. మొదటిసారి 'ముందడుగు' నాటకం తెనాలిలో జరిగిన గుంటూరుజిల్లా రైతుమహాసభ సందర్భంలో ప్రదర్శించబడింది. 40 వేల ప్రజలు చూచి హర్షించారు. ఈనాటకం అచ్చుప్రతులకోసం మా కార్యాలయానికి పదేపదే ఆర్డర్లు వస్తున్నాయి. అందుచే రచయితలు అవు సరమనుకొన్న సవరణలు చేసి ప్రకటనార్థం మాకు యిచ్చారు.

మేము తెలుగు సాహిత్యసేవకులుగా యీ నాటకాన్ని ప్రకటించి ప్రజలకు అందజేస్తున్నాము. నాటకంయొక్క గుణగణాలను నిర్ణయించే హక్కు ప్రజలది. కాబట్టి వారికే ఆవిషయం వదలుతున్నాం.

— సంపాదకవర్గం

స్టేజికి సూచనలు

నాటకాలు వేయడానికి ప్రతివూళ్ళోను నాటకశాలలుండవు. కాబట్టి బహిరంగ ప్రదేశాల్లో వేయవలసివుంటుంది. అందుకు స్టేజి నిర్మాణాన్ని గురించి తెలుసుకోవడం అవసరం.

స్టేజి ఎత్తు 1½ అడుగులుండాలి. బల్లలతోటిగాని, వెదురు వాసా లతోగాని, మట్టితోగాని నిర్మించవచ్చు. వెడల్పు 15 అడుగులు; పొడవు 9 అ; ఎత్తు 7½ అ; సైడు కర్టెనులు ఒక్కొక్కటి 3 అ. వెడల్పు చొ॥న 7½ అ. యెత్తు ఉండాలి. శబ్దం హెచ్చుచేయడానికి నాలుగు కుండలు పందిరిమీద బోర్లించాలి. ముందు ప్రేక్షకులకు అవి కన్పించకూడదు.

తెరలు సీనరీతో అద్దెకుతేవడం కష్టం. తెచ్చినా ప్రతి దృశ్యానికీ సరిపోయే తెరలు లభ్యంగావు. అందుచే ఆ యా దృశ్యాలలోని ప్రధాన భావాలను, రసాలను ద్యోతకం చేసేవిగా మాత్రమే రంగుల తెరలుండాలి.

ఎర్ర తెర — యుద్ధం, క్రోధం, వైరం

తెలుపు — శాంతం

గులాబీ — శృంగారం

పసుపు — కల్యాణం

నలుపు — దుఃఖం, కుట్ర

ప్రదర్శన సన్నాహం

రంగం	పాత్రలు	తెర	వస్తువులు
1	చక్రధర్రావు, నాగేంద్రం వెంకన్న, కోటయ్య, వీరయ్య, పుల్లయ్య, కాసిం, అచ్చయ్య, నారాయణరావు.	నలుపు	సిరిచాప, రాతబల్ల, కలం, సిరాబుడ్డి, దస్త్రం.
2	చక్రధర్రావు, వెంకన్న, రామ్, మోహన్, నాగేంద్రం.	తెలుపు	తివాచీ, 2 బల్లలు, 3 కుర్చీలు, 1 కుషన్ చెయిర్, టేబుల్, సుగంధద్రవ్యాలు, బ్రాందిసీసా. 3 గ్లాసులు, చిత్రాలు, చీట్లపేక, రు. 100 నోటు, సిగరెట్లు, అగ్గిపెట్టె.
3	నారాయణరావు, పుల్లయ్య, కాసిం, శాంతమ్మ, విమల.	నలుపు	రాట్నం, పీట, ఎర్రట్ట పుస్తకం, 2 గ్లాసులు, పాలు, నులకమంచం, దండెం, బొంతపువ్వు, సంచి.
4	విమల, అచ్చయ్య.	తెలుపు	పుస్తకం, బల్ల, క్రోటన్స్, గ్లాసు.
5	చక్రధర్రావు, రామ్, నాగేంద్రం, వెంకన్న, అచ్చయ్య	తెలుపు	2వ సీనులోవలె రు 100 ల నోటు మినహా
6	నాగేంద్రం, శాంతమ్మ, పిల్లి భీముడు, ఇద్దరురౌడీలు, పుల్లయ్య, వీరయ్య, కోటయ్య, కాసిం, నారాయణరావు	నలుపు	కత్తిపీట, కూరగాయలు, లాఠీలు, ఫొటోలు, పుస్తకాలు, రాట్నం, వంటసామగ్రి, దండెం, మంచం.
7	విమల, అచ్చయ్య	తెలుపు	పుస్తకం, టేబులు, కుర్చీలు, బీరువా, అద్దం
8	శాంతమ్మ, నారాయణరావు విమల, పుల్లయ్య	తెలుపు	చిన్నమూట, మిగతావి 3 వ సీనులో వలె పాలు, బొంతపువ్వు తప్ప
9	చక్రధర్రావు, రామ్, మోహన్, వెంకన్న, నాగేంద్రం, అచ్చయ్య	తెలుపు	5 వ సీనులో వలె
10	ఇద్దరు పోలీసులు, శాంతమ్మ, నారాయణరావు, పుల్లయ్య, కోటయ్య, వీరయ్య	నలుపు	సంకెళ్లు
11	శాంతమ్మ, విమల — వీరయ్య, కోటయ్య, కాసిం	ఎరుపు	8వ సీనులో వలె
12	చక్రధర్రావు, నాగేంద్రం, కాసిం, వీరయ్య, కోటయ్య అచ్చయ్య	ఎరుపు	2 వ సీనులోవలె
13	శాంతమ్మ, విమల, అచ్చయ్య, వెంకన్న	తెలుపు	పేపరు, ఉత్తరం, పూలబుట్ట, పుస్తకాలు, టేబులు, కుర్చీలు, అద్దం, దువ్వెన
14	శాంతమ్మ, విమల పుల్లయ్య, నారాయణరావు, కాసిం, వీరయ్య, కోటయ్య.	తెలుపు	మినపపప్పు, చాట, జెండాలు.
15	నారాయణరావు, పుల్లయ్య, వీరయ్య, కాసిం, కోటయ్య నాగేంద్రం, ఇద్దరురౌడీలు అచ్చయ్య, విమల, శాంతమ్మ, డాక్టరు.	నలుపు	నల్ల ముసుగుగుడ్డలు, కత్తి, తాళ్ళు, కర్రలు, మంచం, దిండు, ఔన్సు గ్లాసు, మెడికల్ బేగ్, స్టెతస్కోప్, కుర్చీలు.
16	నారాయణరావు, విమల, అచ్చయ్య, రైతులు.	పసుపు	పేపరు, పుస్తకం, కప్, సాసర్, జెండా టేబులు, కుర్చీలు.

పాత్రలు

నారాయణరావు — కథానాయకుడు, వయస్సు 25 సం॥

ుల్లయ్య
టయ్య
ఎరయ్య
కాసిం } రైతులు

అచ్చయ్య — ధనిక రైతు. వయస్సు యాభై.

చక్రధర్రావు — జమీందారు. వయస్సు ముప్పైఅయిదు.

నాగేంద్రం — తాణేదారు. వయస్సు నలభై అయిదు.

రామ్,
మోహన్ } — జమీందారు స్నేహితులు

వెంకన్న — జమీందారు బంట్రోతు

పిల్లిభీముడు — రౌడీల నాయకుడు

1 వ రౌడీ

2 వ రౌడీ

మ్మ — నారాయణరావు తల్లి. వయస్సు యాభైరెండు

మల — అచ్చయ్య కూతురు. వయస్సు పదహారు

సమయానుకూలంగా డాక్టరు మొదలైన పాత్రలు వుంటాయి.

1

లక్ష్మీపురం - జమీందారు తానా

[ఎత్తయిన అరుగులు - ఒక అరుగుమీద సిరిచాప పరచివుంటుంది. దానిమీద రాతబల్ల - కలం - సిరాబుడ్డి - ప్రక్కన దస్త్రం. నాగేంద్రం లెక్కలు చూచుకుంటూ వుంటాడు.]

నాగేంద్రం : ఎవడురా అక్కడ ?

(వెంకన్న ప్రవేశించి దణ్ణంబెట్టి నుంచుంటాడు)

నాగేం : ఇప్పుడుదాకా యెక్కడ జచ్చావురా ?

వెంకన్న : (సరిగ్గా వినపడక) అంతా వత్తన్నారండీ!

నాగేం : అరే చెవిటివెధవా, ఇప్పటిదాకా యేంచేస్తున్నావురా ?

వెంక : ఓ అరెక్కడ కదుల్తురండీ, పాలుదీసివత్తా అని ఒకాయన, సద్దిదాగి వత్తా అని ఒకాయన, వత్తాపదమని ఒకాయన. తలకోమాట. నన్నేం సావమంటారా? తిరిగీ తిరిగి నాదుంపతెగితేనూ.

నాగేం : చూడరా వస్తున్నారేమో

(కోటయ్యా, వీరయ్యలు ప్రవేశించి నాగేంద్రానికి దణ్ణం బెడతారు)

నాగేం : ఏమయ్యా, మీరు సష్టుగా తినీ తేపి అచ్చాపచ్చా తీర్చుకొని తయారవడం, నేనేమో మీకోసం యెదురుజూస్తూ పన్నెండు ఘంటలదాకా పడి వుండటమూనా ? ఎప్పుడనగా కబురంపించాను ఎప్పుడు వచ్చారు?

కోటయ్య : లేదుబాబూ, ఎంకన్నొచ్చి చెప్పగానే కలిగిన మారాజుకాడికెల్లి కడుపూ కాళ్లూ పట్టుకొని డబ్బుదెచ్చేవరకీయాళయిందండీ.

వీరయ్య : ఎంకన్నొచ్చి పిలవగానే దున్నేదున్నే అరక అదరాబాదరా వూడదీసి, తమ దర్శనానికి రానేవచ్చాగా బాబూ.

వెంకన్న : వచ్చారులేవయ్యా మాతొందరగా, తిరిగీ తిరిగి కాళ్లడిపోతేను. కట్టండయ్యా సిత్తు. కట్టండి. ఎండెక్కుతావుంది పోవాలి.

నాగేం : కద్దావటరా కడతారూ? ఏ రైతుసంఘానికో ఏ సభకో చందాలివ్వాలి కయితే డబ్బు కనపడుతుందిగాని శిత్తు కట్టాలిసొచ్చేవరికి పంటలు పోయాయనీ, అప్పు దొరకలేదనీ, యెక్కడలేని యిబ్బందులు వచ్చిపడతాయి.

వీర : వరలూ చట్టుబండలూనూ, 'తనదూరక కంతలేదు మెడకొక డోలం'ని పొలమంతా బెట్టదీసి గిద్దెడు గింజలు పండక యీ యేడు శిస్తుకట్టేది యెట్టారా అని మేమేడుస్తూవుంటే.

నాగేం : ఊఁ.... మొదలా ! మొండిచెయ్యి చూపటానికి.

వీర : మొండిచెయ్యేముంది బాబూ. అసలుండిసత్తేనా ? చెరువు మెరకేసిపోయె. అందులో దొరగారు లోతట్టున పొగాకే శారాయె.

నాగేం : ఏస్తే నీకొంపేం మునిగిందయ్యా ?

వీర : నా ఒక్కడికొంపే మునిగితే పరవాలేకపోను.

నాగేం : ఊరందరి కొంపలూ మునిగాయంటావు. ఏం ?

కోట : కాదుమరీ. పొగాకెయ్యటం మొలానవచ్చిన కానిన్నీళ్లు చెరువే పీల్చేసింది. అశ్లేస ఆఖరుపాదంలో ఏవో నాలుగు చినుకులడితే కింద తూము పారుదలతో కాస్తా కూస్తా యేమయినా పండితే యెబ్బేటువారి పొలం, అప్పయ్యగారి పొలమేగా.

వీర : మిగతావాళ్లకి యిత్తనమన్నా మల్లలా.

నాగేం : ఏమిటోయి నోది ? నీ మిడుకుడేదో నీవు మిడక్కు.

వీర : ఈపాడు పొట్టకోసం ఏద్దైనా మిడకాలి. కాస్త దరబలికితే అయిన పదిరాళ్ళ పొగాకూ అమ్మేసి సిత్తు కట్టుకుంటాను బాబూ. (దీనంగా) తరవాత మాగతి ఏమన్నాకాని.

నాగేం : నాకు తెలుసులేవయ్యా యీ భాగోతమంతా.

కోట : ఏ భాగోతమయినా నాలుగురోజులు ఎనకా ముందేకాని తప్పేదేముంది ? ఇదివరకల్లా వచ్చి గొంతుమీద కూచుంటే పెండ్లాం మెళ్లో పుస్తెలుకూడా తెగనమ్మి కడతల్లా.

నాగేం : ఏమిటయ్యా కడుతూవుంది ? గత పసలీది యింతవరకూ గతిలేదు. కట్టాడట కట్టడం ! కబుర్లు.

కోట : (తెల్లబోయి) ఇదేం అన్యాయమండో, నిరుడు కట్టకపోవడమేమిటి ? నేనూ మా పుల్లయ్యా మీ యింటికే తెచ్చి కట్టాంగా. గుర్తు తెచ్చుకోండి. మేమొచ్చినప్పుడు మీ పెద్దబ్బాయిగారు పరీచ్చకు డబ్బుగట్టాలని అడుగుతూంటే కడదాంలేరా అంటల్లా మీరు ?

నాగేం : (వికటంగా) భేష్, మాబాగా అల్లావోయ్. అబద్ధమాడినా అతుక్కుపోయింది మరి. తెలివితేటలు.

(అప్పయ్యగారి ప్రవేశం)

వెంకన్న : దణ్ణాలండీ అప్పయ్యగారూ !

కోట : అబద్ధం మాయింటావంటా లేదండీ. పెమాణపూర్తిగా కట్టానండీ.

అప్పయ్య : ఏమిటండో తానేదారుగారూ, ప్రమాణాలదాకా వచ్చింది వ్యవహారం

నాగేం : ఎందుకురాదూ ? ఏదో పిల్లలగలవాడు నెమ్మదిగా కడతాడులే అని దయదల్చి వూరుకుంటే ఏకంగా కట్టేశాడని బుకాయిస్తున్నాడు.

అప్ప : ఏమిటిరా కోటయ్యా యీ గొడవ ?

కోట : నిరుడిరోజుల్లో శిస్తుకట్టాలని నీ దగ్గర అప్పుతీసుకోలేదంటే ?

అప్ప : నిజమే తీసుకున్నావు.

కోట : అపూటనే నేనూ, పుల్లయ్యమామా యెళ్ళి సిస్తు కట్టేశామే. నామాట అబద్ధమయితే పుల్లయ్యమామనుకూడా అడుగు. (వీరయ్యవైపు చూచి) పరుగెత్తికెళ్ళి పుల్లయ్యమామను తీసుకురారా. (వీరయ్య పోతావుంటాడు) ఇక్కడుండట్టు రావాలి. (వీరయ్య తలవూపుకుంటూ వెళ్ళిపోతాడు)

నాగేం : ఏమండీ అప్పయ్యగారూ, శిస్తుకడితే చిఠ్ఠాలో జమ వుండదండీ ?

అప్ప : ఉండాలసిందే. (కోటయ్యతో) రసీదులేదంటరా కోటయ్యా ?

కోట : రసీదు లాకనాడు తిన్నగా యిచ్చారాయేమే ? దస్తుతీసుకొని రసీదు రేపిత్తాలే పొమ్మన్నాడు. తరవాత యీయన యింటిచుట్టూ తిరిగితిరిగి విసుగెత్తింది. చీటీముక్కమాత్రం చేతికి రాలా.

అప్ప : నాదగ్గర డబ్బుతీసుకున్నదిమాత్రం నిజం. తరవాత పాపం పుణ్యం పరమాత్ముడికి తెలియాలి.

నాగేం : డబ్బుతీసుకుంటే దేనికి ఖర్చుపెట్టుకున్నాడో ?

అప్ప : అ. శిస్తుకట్టడానికని తీసుకున్నాడండీ.

నాగేం : శిస్తు కట్టడానికని తీసుకొని యింట్లో అవసరానికి వాడుకోగూడదూ ?

(పుల్లయ్య, వీరయ్యలు ప్రవేశం)

పుల్ల : ఇంట్లో అవసరానికి వాడుకోబట్టే చిఠ్ఠాలో జమలేకుండాపోయింది.

నాగేం : చాల్లేవయ్యా చెప్పొచ్చావు పెద్ద న్యాయకర్తవు.

కోట : నేను కట్టానండి బాబూ, నా బిడ్డలతోడు. ఏ పెమాణం జెయ్యమన్నా చేత్తాను.

నాగేం : ఎగ్గూ సిగ్గూ విడిస్తే ఏదయినాచేయొచ్చు. ప్రమాణాలతో వదలిపెట్టానికి యిది యెవ్వేటుసొమ్ము. నావాళ్లో పదేదేంకాగు.

పుల్లి : ఎవళ్ళవాళ్లో వరెది వాళ్ళవాళ్లోనే వడింది. కూతురు పెండ్లొచ్చిందంటే ఊళ్లో వసూలుచేసిచ్చిన వెయ్యిరూపాయలుగాక కూరగాయల దగ్గర మంచీ తెచ్చి కొంపనిండేశాం. దొరగారితో చెప్పి చెరువు మరమ్మతు చేయిస్తాను. నామాట యేమిటంటే ఆసామివారీ పోగుచేసి అయిదువందలిచ్చాం. వట్టా మామూళ్ళ వరేగదా; పుడితే పురుళ్ళకి. చస్తే చావులకి జలగ పీల్చినట్లు పీల్చావు మా నెత్తురంతా.

నాగేం : ఓహో ! ధర్మాత్ముడివి బయల్దేరావు. చాల్లే అంతటితో కట్టిపెట్టు. (కోటయ్యతో) ఇంతకూ నీవు కట్టేదా లేందా ?

పుల్లి : గోచికి మించిన దరిద్రమేమిటి ? మూడూళ్ల ముష్టెత్తయినా కడతాం గాని. ఆ పరస్వతిని నెత్తినబెట్టుకొని దస్తు తీసుకోలేదని ప్రమాణంచెయ్యి.

నాగేం : (కోపంతో) నోరుముయ్. తల ఏమన్నా తిరుగుతూవుందా యేం ? నోటికొచ్చినట్లల్లా వాగుతున్నావు. జాగ్రత్త.

పుల్లి : కాకపోతే యేంజేస్తావయ్యా. తలగొట్టి మొలేస్తావా ?

కోట : చేసుకునేదేమిటో చేసుకో. కట్టినసొమ్ము మళ్ళా కట్టమంటే యెక్కడ తెత్తాం !

అచ్చు : ఆఘోరించారులే ఆగండోయ్ పెద్దమ్మారులారా ? మొదట తెలివితక్కువగా చేసుకునేదీ. తర్వాత యేడ్చేదీవి.

పుల్లి : ఇట్టా పొదుగు గోసుకొని పాలుదాగుతాడని యెవరికి తెలునేం.

అచ్చు : ఆ పెద్దమనిషిమాత్రం అంత అన్యాయానికి ఒడిగడతాడటగా ?

కోట : అంతేలెండి. మీరట్టా అనక యింకా యెట్టంటారు ? వెర్రాడిపెండ్లాం వాడకల్లా వదినవి అందరికీ లోకువ మేమేగా.

అచ్చు : మీరూ మీరూ కలిసి గంగలో దూకండి. దారేపొయ్యే పెద్దమ్మోరా నెత్తికెక్కమని నాకెందుకి పీడ. కరవమంటే కప్పకు కోపం. విడవమంటే పాముకు కోపం.

నాగేం : పోదాం పదరా వెంకన్నా. మనకెప్పుడన్నా మర్యాదగా కట్టే మామూలుంటేగా ? జరగాలసిన కర్మకాండకాస్త జరిగితేనేకాని..........

(నారాయణరావు. కాసింలు ప్రవేశిస్తారు)

నారా : ఏమిటండి నాగేంద్రంగారు. కోప్పడుతున్నారు ?

నాగేం : ముద్దిగిల్లి జోల బాడటానికి వచ్చావ్ ; నిన్నుజూచి అయినా నేర్చుకోలేకపోతామటలే. (చరచరా వెళ్ళిపోవును)

సిం : మీకి హంతా తెల్వీహౌంది.

రా : ఏమిటి పుల్లయ్యమామా. మళ్ళీ యేంపేచీ పెట్టాడేం ?

ల్లి : నిరుడు నేనూ, కోటయ్యా ఒక్కసారే శిస్తుకట్టాం. ఇప్పుడు నేకట్టాలిసింది ఎంతండీ అని కోటయ్య అడిగితే ఏరుటి దెవరు కడతారోయ్ అన్నాడు.

టి : మంచితనంగా జెప్పాం. వింటేనా ? దానిమీద మాటామాటా వచ్చింది.

ర : నోటికొచ్చిందల్లా వాగాడు గుడ్లుమురుతూ

ల్లి : వెనకతాళం వెయ్యడానికి అచ్చయ్యగారు తయార్.

కాసిం : అచ్చా. హోయన్ కూడా వుండాడ్. చల్లన్ వేగా తల్కావ్ మారాణ్కే.

నారా : ఇదే మనలోవున్న తెలివితక్కువ. వాళ్ళను గుడ్డిగా నమ్ముతాం. వాళ్లేమో మన నెత్తినెక్కి తొక్కుతారు. రసీదు తీసుకోకుండా మాటలునమ్మి శిస్తుగట్టిన ఫలితం యిది.

పుల్లి : అయిపోయిన దానికి యిప్పుడు చేసేదేమిటి ? ముందు జరగాల్సిందేమిటో చూడాలిగాని.

నారా : అవును పుల్లయ్యమామా. మనమీకష్టాల్నుంచి గట్టెక్కాలంటే వీళ్ళ దురాగతాల్ని యెదుర్కోవాలి. దీనికి సంఘబలం ఎంతో అవసరం. ప్రతి రైతూ సంఘంలో చేరాలి. అవేళగాని కొండమీదికోతి దిగిరాదు. ఈలాటి పిచ్చిపిచ్చి వేషాలేమీ సాగవు. రైతుసంఘం జెండానీడనే మనకు మోక్షం. స్వాతంత్ర్యమూ, వుంది.

కాసిం : ఠీక్‌హై. హిట్టా దారీదొంకా లేకుండా హూండబట్టే వాళ్ళకు కండ్లు నెత్తికొచ్చాయి.

వీర : సంగం బెట్టుకుంటే మళ్ళా యేం మిడిమేళం తెచ్చిపెడతాడో.

కాసిం : హేమ్టీ తెచ్చిపెడతాడ్ హాడీ తల్కాయ. పేరూ జూడబోతే మొన్గాడి పేరూ బెట్టుకున్నావ్. హీరయ్యా. హీరయ్య. పిర్కి చూడబోతే జెర్రిబోత్తూ హున్నంతా హుందేమిటయ్యా నీకు ?

నారా : ఇంతకంటే యింకా యేంజేస్తాడు వీరయ్యన్నా. మూడు సంవత్సరాలునుంచీ చెరువు మరమ్మతు చేయించమని అర్జీలూ మహజర్లూ ఇచ్చి యెంతో మొత్తుకున్నాం. ఇప్పటికి అతీగతీ లేదు. కాడీ మేడికయినా కర్రకొట్టి తెచ్చుకోడానికి వీలులేదు గదా ! పంటలు పోయినై ; శిస్తురిమిషన్ ఇప్పించమని గోలబెట్టాం. వదలిపెట్టాడా ? కొంపా గోడీ అమ్మించి మరీ పుచ్చుకున్నారు. పైపెచ్చు కట్టిన కిస్తీకి రశీదు యివ్వకుండా మళ్ళీకట్టమని పేచీపెడుతున్నాడా ? ఇంతకంటె తెచ్చిపెట్టే మిడిమేళం యింకా యేముంటుంది ?

ము ం ద డు గు-

కోట : నిజమేరా. యింతకంటె యీ దేశ్బేదేమిటి ? మనమందరం సంఘంలో చేరాలిసిందేరా.

కాసిం :
వల్లి :
వీర :
} అఁ. తప్పకుండా చేరాలిసిందే.

నారా : బోలో రైతు సంఘాలకీ జై.

(అందరూ అంటారు)

మోహన్ రాగం — ఆదితాళం

భారత వీరకుమారా । రాగ కర్షక వీరా ॥భార॥
కలిసిమెలసి నీహక్కుల కొరకై । కదనము వేయుమురా ॥భార॥
ఎదురులేని నీశక్తిని చాటగ । నెగురవేయరా జెండా ॥ఎగుర॥
జయగీతిన్ పాడుమురా । జైజైజై యనరా ॥భార॥

2

[గచ్చునేలమీద తివాచీపరచి వుంటుంది. రెండు బల్లలు, మూడు కుర్చీలు, ఒక కుషన్ చెయిర్, ముందు ఒక టేబులూ. టేబులుమీద అగరువత్తులు మొదలయిన సుగంధద్రవ్యాలూ, బ్రాందీసీసా, మూడు గ్లాసులూ వుంటాయి. గోపికావస్త్రాపహరణం, రాధాకృష్ణుల రాసక్రీడలూ, అర్ధనగ్న యూరోపియన్ స్త్రీల చిత్రాలూ, జార్జి చక్రవర్తి చిత్రం, మొదలైనవి వుంటాయి. జమీందారు చక్రధరరావు కాఫీతాగి చెయ్యి తుడుచుకుంటూ ప్రవేశం]

చక్ర : ఒరేయ్.

వెంకన్న : సిత్తం, సిత్తం.

చక్ర : మనదేగమీద రావుగారి కాకిని పందెంవేస్తా మంటున్నారు. జోదేనట్రా.

వెంక : (గ్లాసులో బ్రాందీపోసి అందించబోతాడు)

చక్ర : ఛీ ఛీ. వెధవ, నేనన్నదేమిటి ? నీవు చేసేదేమిటి ?

వెంక : (గ్లాసు బల్లమీదబెట్టి చేతులు గట్టుకొని) సిత్తం. సిత్తం.

చక్ర : చిత్తగాదు నీబొంద. అదిగాదురా మనదేగ మిగులా ? రావుగారి కాకి మిగులా ?

వెంక : (నవ్వుతూ) రావుగారి కాకా ! ఎదవకాకి. మనదేగ బర్రెమీదనుంచోని కూతేస్తే రావుగారి కాకిబోయి ఊకకింద దూరాలిసిందే. దేగదేగే, కాకికాకే. (చక్రధరరావు వికటంగా నవ్వుతూ గ్లాసు పైకెత్తి ఒక గుటకేసి మరల సిగరెట్టు పీలుస్తూ వుంటాడు. రామ్, మోహనుల ప్రవేశం)

రామ్ : మన దేగమీద పందెంవేసే మొనగాడున్నాడుగా ? మొన్న పంగిడిగూడెం పందాలలో అంతలావు నెమలిని యీక యెరుపుగాకుండా తొలిసీళ్ళలోనే ఖూనీచేసింది. అదిరిపొయ్యారు జనమంతా. (మోహన్ వంకజూచి) ఏరా మోహన్ !

మోహన్ : కాలికి అందేసి నూటికి వెలగంటే కోటిమంది జనంలో ఒకయిక్క మన్నాడు లేడు.

రామ్ : పోరా వెంకన్నా, దేగను సర్దాచెయ్యి.

చక్ర : అరే రామ్, కానేవు ప్లేయింగ్ కార్డ్సు వేయవోయ్ సర్దాగ

రామ్ : (పేకముక్కలు తీసి కలుపుతూ) ఏం వేద్దామంటారు ?

మోహన్ : బ్రిడ్జి వేయరా బ్రిడ్జి. బాగుంటుంది.

చక్ర : వట్. నాన్సెన్స్. వెధవబ్రిడ్జి. వలాస్ వేయవోయ్.

రామ్ : (ముక్కలుతగ్గిస్తూ) థంకాపలాస్. వారెవ్వా (ముక్కలు కలిపివేస్తాడు ముగ్గురూ గూటుతారు)

మోహన్ : (ఎత్తి చూసుకొని) నీ చెయ్యితగలెయ్య. వేళావు ముక్కలు. అసు గొప్పన్నాలేదు. (పారేస్తాడు)

రామ్ : దరిద్రుడా నన్నంటావేమిరా, కోతగోసి యేడ్చింది నీవేగా ?

చక్ర : ఏయ్ గొడవ, ఆట జూడండిరా.

రామ్ : (ముక్కలుజూచుకొని) వరసేళా. (డబ్బులు బరిలో వేస్తాడు)

చక్ర : (ముక్కలు చూచుకొని) రెండు రూపాయలు. (గిరిలోవేస్తాడు)

రాం : (ఈలవేస్తూ) జమీందారు వంకజూస్తూ (రెండురూపాయలు బరెలోవేసి) గోఅన్. కమాన్,

చక్ర : (నవ్వుతూ) నీదేమిటిరా ?

రామ్ : (ముసి ముసి నవ్వులతో) సాది రాణీలజంట.

చక్ర : ఓ, అలాగా, నావి రాజులు. (ముక్కలుతిప్పి బల్లమీదవేసి చూపెడతాడు. డబ్బు తీసుకుంటాడు)

మోహన్ : రాణిమీద రాజు పైచెయ్యే. కాని ఈరాణిమీదగాదు మీ చెయ్యిపడాలసింది; (రాంవైపుచూచి కన్నుగిడుతూ) ఏమిరా రాం ?

రామ్ : ఓ. (వికటంగా నవ్వుతూ) అదా. అది బాబుగారిపక్కన కూర్చుంటే యేం మజా. అరరే చూడటానికి యీ కండ్లేం చాల్తాయిరా,

మోహన్ : ఎలావుంటుంది దేవేంద్రుడి పక్కన రంభ.

రామ్ : రంభ ? డామిట్, పాత చింతకాయపచ్చడి. అలాంటి పది రంభలయినా దాని కాలిగోటి ఖరీదు చెయ్యరు. స్వీట్ నైటింగేల్. ఇహిహిహి. పేరు బెడితే నోరు ఊరేలా ఉండాలి. రంభట రంభ.

పంచవన్నెల చిలుక - పంచదారా అద్దు
చందురుణ్ణి మించు - చక్కనీ చుక్కరా ॥పంచ॥
వారగంటా జూచి - వారెవా కనుగొత్తె
కను చెదరిపోవాలి - గుండె అదరాలి. ॥పంచ॥

రంగుచీరా గట్టి - చెంగునా దూకి
బ్రాందిసీసా నోటి - కందించెటప్పు
చూడాల ఆ సోకు - ఆ టీకు టాకు ॥పంచ॥

చక్రి : అరే, ఎక్కడుందో యేమో చెప్పకుండా పిచ్చిగంతులేస్తావేరా ఫూల్.

రామ్ : ఉంది. ఎక్కడోవుంది.

చక్రి : అరే.

రామ్ : అరేలేదు గిరేలేదు. ఉందంటే వుంది. అంతే.

మోహన్ : (వెకిలిగానవ్వుతూ) ఇంకెక్కడ మదరాసుకోనే. బంగారు పిచ్చుక.

చక్రి : అయితే చూస్తారేమి ? బయలుదేరండి. ఊపూచే. ఊ. ఎట్‌వన్స్.

రామ్ : రేపెల్లాగూ ప్రయాణముందిగా, గిండీరేసెస్‌కి.

మోహన్ : అలా అయితే రేపే వెళదాం. ఇంతలో మునిగిపోయిందేమిటి ?
(నాగేంద్రం ప్రవేశించి జమీందారుకు నమస్కారంజేసి నిలబడతాడు)

చక్ర : ఏమాత్రం వసూలయింది.

నాగేం : (తలవంచుకుని ఆలోచిస్తూన్నట్లు నటిస్తాడు)

రామ్ : ఏమిటండి నేలచూపులు చూస్తారు ?

చక్ర : అసలు జ్ఞాపకముందా రేపు మద్రాసు ప్రయాణమున్నదన్న సంగతి ?

నాగేం : ఏం జ్ఞాపకముంటే ఏం లాభంలేదండి. ఏం వసూలు చెయ్యను ? నాపిండాకూడు.

మోహన్ : ఏమిటండీ యీ గొడవ.

చక్ర : మిడికేదేమిటో సరిగ్గా మిడుకు.

నాగేం : గిద్దెడు గింజలు పండందే కట్టుకట్టు అంటే యెక్కడతెచ్చి కట్టమంటావయ్యా శిస్తు అని దబాయించాడు.

చక్ర : ఎవడా పొగరుమోతు.

నాగేం : ఎవరున్నాడు. ఆ సెంకెముండాకొడుకు పుల్లయ్య.

రామ్ : మీరేమో యేమి మాట్లాడితే యే ప్రమాదమో అని చడీచప్పుడు లేకుండా తంకన దస్తుంపెట్టుకొని చల్లగా జారారన్నమాట.

నాగేం : (తీవ్రంగా) ఈ నాగేంద్రం నాజమ్మగాదు. "నీవాకలెక్కా. నీతల దన్నినవాడిదగ్గర వసూలుచేశాం. మీతాత యెవరు కడతారు. దొరగారు కట్టాల్సిన పేష్కస్. పిచ్చిపిచ్చి వేషాలుమాని వెంటనే కట్టేయండన్నాను.

మోహన్ : అమాత్రం మాటుగా తగలకపోతే వాళ్ళు మాటంటారా!

చక్ర : ఊ. అంతే!

నాగేం : ఇక వాగాడండీ యెంచెప్పను!

చక్ర : ఇంకా ఏం వాగాడేం?

నాగేం : వాళ్ళేమో వస్తులుండి కిస్తులుకడుతున్నారట. చెరువు మరమ్మతన్నా చేయించకుండా అదబ్బాతో తాగి తందనాలాడతారట. వేశ్యల యిండ్ల చుట్టూ పిచ్చికుక్కల్లాగ తిరుగుతారట. గుర్రెపుపందాలట! కోడిపందాలట!! వెనకా ముందులేకుండా వాగేశాడు వాడిష్టం వచ్చినట్లు.

రామ్ : అయిందీ.

చక్ర : (లేచి చేతిలో గ్లాసు బల్లమీదకొట్టి) వీడికి త్తె వలిపించకపోతే నాపేరు చక్రధర్రావే కాదు. చూడు నా తడాకా.

నాగేం : దొరగారి సెలవయితే వీడిబ్రతుకెంతగాని వీడిగురువున్నాడింకొకడు. మూలవిరాట్టు.

రామ్ : ఆ మొనగాడెవడండో.

నాగేం : ఉన్నాడులే ఒక వెధవ. విరుగబడ్డిన రామయ్య కొడుకు నారాయణ రావు.

రామ్, మోహన్ } ఆఁ నవ్వాపా! (యిద్దరూ వెకిలిగా నవ్వుతారు.)

చక్ర : ఆఁ ఏమిటీ! రావా! రావు.

నాగేం : మిడికాడుగా బస్తీకెళ్ళి నాలుగింగ్లీషుముక్కలు. ఇవ్వాళ రావయ్యాడు. రేపు రాజౌతాడు. ప్లీడరు నవాళ్లేస్తూ 'లా' అంతా తనకే తెలిసినట్లు మాట్లాడతాడు. 'గోవులేని ఊళ్లో గొడ్డుగేదె శ్రీమహాలక్ష్మి' అని యెంతపొగరు!

రామ్ : ఆ. విన్నటిదాకా వారాలు చేసుకొని చదివాడు వెధవ. అంత మొనగాడయ్యాడూ?

చక్ర : అవుతావుతాడు. ఎముక విరగనన్ని లేవరి!

నాగేం : అదెంతపని. వాళ్లసంగతి నీకు తెలుసుగా. మోహన్ (రూపాయి మోగించి వట్టుగా చూపెడతాడు.)

మోహన్ : దొరగారికి మాత్రం తెలియదూ వాళ్ళసంగతి.

రామ్ : వాడా వట్టిపిచ్చోడు. వాడయితే మన్నుంలోకి యెముక దొరకనివ్వడు.

చక్ర : ఛేఛ్ బలె యెత్తువేశావోయ్. కానియ్యి. వదలిపోవాలి ఆ బలుపునీళ్లకానివి. (జేబులోనుండి వందరూపాయలనోటు తీసియిచ్చి) చెయ్యి. ఇక నీపని వేసెయ్యి. (రామ్, మోహనులపై పుజాలి) వదండిరాపోదాం. (రామ్, మోహనులు ముందు, వెనక జమీందారు వెళ్ళుతూ వుంటారు. నాలుగడుగులేసి వెనక్కితిరిగి) నాగేంద్రం జాగ్రత్త. ఒక్క యెముక గూడా మిగులగూడదు. చూర్ణంగావాలి (వెళ్ళిపోతారు).

నాగేం : (వందరూపాయలనోటు చూచుకుంటూ మునిమునినవ్వులు నవ్వుతూ రెండోవైపుగా వెళ్ళిపోతాడు)

3

(స్ట్రీటు సీను)

(పుల్లయ్య తల వెనుకభాగాన రక్తం కారుతూ ఉంటుంది. నారాయణరావు పట్టుకొని నడిపించుకు వస్తూ వుంటారు)

నారా : పర్వాలేదు. నెమ్మదిగా నడువుమామా, దుర్మార్గులెంతపని చేశారు.

పుల్ల : (మూల్గుతూ) అబ్బా! నారాయణా! కండ్లు తిరుగుతున్నాయి. నడువలేనురా బాబూ.

నారా : కాసేపు కండ్లుమూసుకు కూర్చోమామా. (నెమ్మదిగా కూర్చోబెట్టి పుల్లయ్య తలను తనతొడమీద ఉంచుకొని నిమురుతూ) ఇంతలో కాసిం కూడా వస్తారు. కలిసిపోదాం.

పుల్ల : ఇంటికాడ గాయం పెద్దగా తగిలిందని చెప్పకేం నాయనా! మీ అత్తయ్య గల్లంతుఅవుతుంది.

నారా : అలాగే. మాట్లాడకు. ముందు మాయింటికి పోదాం. (పక్కకుచూచి) అదుగో, కాసింకూడా వస్తున్నాడు.

కాసిం : (బొంతపువ్వు తీసుకొని వడిగా ప్రవేశించి) పిరికి పందల్లాగా దౌడ్ తీశారు ఎధ్వల్. లేకపోతే ఖూనీచేశేవాణ్ణి నాకొడుకుల్ని. (పుల్లయ్య కండ్లుతెరచి చూస్తాడు) హిద్గో బొంతాపువ్వు. జర్రా కట్టు కట్టు.

నారా : (గాయంలో బొంతపువ్వుబెట్టి కట్టుగడుతూ) వాళ్ళెవళ్ళో గుర్తుబట్టావా కాసిం.

కాసిం : హింకా యెవడూ నచ్చాడ్. వాడే పిర్లీ భీముడి ముఠా. (పుల్లయ్యవంక జూస్తూ) హెట్టా వుంది. భాయి?

పుల్లి : మరేం పరవాలేదు. నాకనుమానంగానే వుంది. ఏదో మిడిమేళం జరుగుతుందని. మంచీచెడ్డా లేదు, కసాయి ముండాకొడుకులు.

నారా : వీళ్ళకు వినాశకాలం దాపురించింది.

కాసిం : కాలం గీలం జాన్తానై. దెబ్బకి దెబ్బ తీయాలిసిందే.

పుల్లి : తొందరెందుకు కాసిం.

కాసిం : తొందరనైతో క్యాభాయి?

నారా : ఇంటికివెళ్ళి ఆలోచిద్దాం పదండి.

(నారాయణరావు . కాసింలు పుల్లయ్యను పట్టుకు తీసుకెళ్తారు. తెర లేస్తుంది; శాంతమ్మ పాడుతూ ఏకులు వడుకుతూ వుంటుంది. గదిలో నాయకుల ఫొటోలు తగిలించి వుంటాయి.)

శాంత :
నూలు తీదాము రారే,
అలసాలీదూకన్నా బహుసన్నానైనా నూలు
నూలూ తీదాము రారే ॥నూలూ॥
రాదూ రాదని నీవు వాదాము సేయకే
రానీదేమున్నాదే రమణీరో నేర్పిన ॥నూలూ॥

(విమల ప్రవేశించి నవ్వుతూ పాటవింటూ వుంటుంది.)

విమల : అమ్మమ్మా, పాటలుకూడా పాడుతున్నావే?

శాంత : (చిరునవ్వుతో) రా అమ్మా, కూచో, నాపాటల కేమొచ్చిందిలే, పిచ్చి పాటలు. ఏదీ నీవొక్కపాట పాడమ్మా.

విమల : గొంతు బాగుండలేదమ్మమ్మా.

శాంత : పరవాలేదులే. ఒక్కపాట పాడమ్మా.

తిలకామోద్ - దాద్రా

విమల :
స్వాతంత్ర్యము స్వేచ్ఛయు శాంతి
ఈజగతి లేదా ప్రీలకు?
లేదా సుఖము జీవితంబున ఈ జీవితంబున
ఈ జగతి లేదా స్త్రీలకు?
సంఘ దురాచారాల్ క్రుంగదీసె మనలన్
లేదా యిక తరించుమార్గమూ ॥ఈజగతి॥
యూన్సీ లక్ష్మీ రుద్రమజాతిని జన్మించి
భీతియేల హక్కులడుగగా
నీ హక్కులడుగగా ॥ఈజగతి॥

అమ్మమ్మా కానేపు నన్ను వడకనివ్వవూ.

శాంత : నీ కెందుకమ్మా, హాయిగా కాలుమీద కాలేసుక్కూచోక. అచ్చయ్యగారు కావాలిసినంత సంపాయించారు. రేపు నువ్వూ నీ మొగుడూ మహరాజుల్లాగే తులతుతూ కూచోని తినొచ్చు.

విమల : చాలులే అమ్మమ్మా. నీవు మరీని.

శాంత : పోనీయి, అవునులే అమ్మా. నాయన యింటికాడున్నాడా అమ్మా?

విమల : లేరు. జమీందారు కబురంపించారని వెళ్లారు.

శాంత : అమ్మాయీ, యిమలా, మనాళ్లు ఇంకా రాలేదేం? సందచీకటి కూడాను.

విమల : ఏమో రావాలిసిందే యీపాటికి. ఒకవేళ రాత్రికి అక్కడే తిష్ఠవేస్తారేమో, అయినా యిప్పుడేమంత ప్రొద్దుపోయిందిలే అమ్మమ్మా. ఎనిమిదవుతుంది.

శాంత : ఉండరమ్మా ఉండరు. ఎంత పొద్దోయినా తప్పకుండా వస్తారు. పుల్లయ్యా కాసింలు సావాసం కూడా వుండారుగా. తప్పకుండా వస్తారు.

విమల : నేనిక యింటికి వెళ్ళతా నమ్మమ్మా. నాన్నగారు కూడా వచ్చే వేళయింది.

శాంత : అట్టాగే వెళ్ళిరామ్మా

(విమల వెళ్ళబోతుంది. అంతలో నారాయణరావు, పుల్లయ్య, కాసింలు కనపడతారు.)

విమల : అమ్మమ్మా, అమ్మమ్మా. అదుగో మాటలో మూ వేసుకొస్తున్నారు.

శాంత : నూరేండ్లాయుస్సు.

(నారాయణరావు, పుల్లయ్య, కాసిం ప్రవేశం. పుల్లయ్య తలమీద కట్టు, రక్తపుమరకలుచూచి కాంతమ్మ, విమల కంగారుపడతారు.)

కాంత : ఏం పుల్లయ్యబాబాయీ, తలకాకట్టేమిటి? ఆ రక్తపుమరకలేమిటి? ఏం అఘాయిత్యం జరిగిందిరా నాయనా?

విమల : (మంచం వాలుస్తూ) ముందు కూర్చోనివ్వండి. (పుల్లయ్య కూర్చుంటాడు) దాహంకావాలా బాబాయి.

(జవాబు కెదురుచూడకుండానే మంచినీళ్లు తెచ్చియిస్తుంది)

నారా : మీటింగు అయ్యేసరికి కనుచీకటి పడుతూవుంది. ప్రొద్దుపోతుందని తొందరగా బయలుదేరామమ్మా.

కాసిం : సిరిపురం దాటి హొక్కి మైలు వచ్చామో లేదో, బడా లుచ్చా మన జమీందారుండాడూ లేదూ హోడ్కి మనుసుల్ గడ్డీ తిన్నార్.

కాంత : ఓరాళ్ళ చేతులిరగ.

పుల్ల : ఎదుళ్ళవాగుకాడి కొచ్చాం. వాగులో అట్టా దిగామో లేదో ఒక రాయొచ్చి నా కిక్కడ తగిలింది.

నారా : పుల్లయ్య మామను నేను పట్టుకున్నాను. కాసిం రాయివచ్చిన వైపు ఉరికాడు.

కాసిం : హేమ్టీ పాయిదా ధౌడ్‌తీసీ దొర్కలా గాడ్దికొదుకుల్. హెప్పటికయినా పిల్లీభీముడ్కి నాదీ తడాఖా చూపిస్తేనే ముసల్మాన్‌బిడ్డా బోలో అమ్మా!

కాంత : అళ్ళకేం పొయ్యేకాలమొచ్చిందిరా నాయనా నిమ్మ కొట్టానికి.

విమల : ఎంత దుర్మార్గం?

నారా : ఇందులో పెద్ద ఆశ్చర్యంలేదు. ఇలాంటి పనులుచేయడం యీ జమీందారులకు పరిపాటే విమలా,

విమల : పుల్లయ్య బాబాయిలాంటి పెద్దమనిషిని యింత నీచంగా కొట్టించాడంటే వేరే రాక్షను లెక్కడో వున్నారనుకోవడం పొరపాటు.

నారా : రాక్షసుడు తన ఆకలి తీర్చుకోడానికి ఒక్కసారిగా మనిషిని చంపి భక్షిస్తాడంటారు; కాని, బ్రతికున్నవాళ్ళ రక్తమాంసాలు యీవిధంగా రోజురోజూ పీలుస్తూ హింసించడు.

కాంత : ఒకళ్ళను ఒకమాట అనిగాని, ఒకళ్ళతో ఒకమాట పడిగాని ఎరగడు. చాతేపోయి, దారే వచ్చేవాణ్ణి కొట్టించడానికి ఆ పాపిష్టి ముండాకొడుకు చేతులెట్లా ఆడినయ్యో.

విమల : కొట్టించాడని విచారపడితే యేం లాభమమ్మమ్మా. తగిన ప్రాయశ్చిత్తం చేయాలిగాని.

కాసిం : నిజం చెప్పావు నూరేండ్లు బత్కు తల్లీ.

నారా : అవును. ఈ దుర్మార్గాన్ని అరికట్టాలంటే అందరూ కార్యరంగంలో ఉరికి పనిచెయ్యాలి. అప్పుడుగాని, యీ విషవృక్షం కుంగచెళ్లతో పెల్లగిల్లదు.

విమల : అవును. తప్పకుండా జేయాలి (కాంతమ్మతో) వెళ్ళొస్తానమ్మమ్మా. (పుల్లయ్యవైపు తిరిగి) వెళతా బాబాయి, ప్రొద్దుపోయింది.

పుల్ల : సరే వెళ్లమ్మా.

విమల : (అక్కడున్న పుస్తకమొకటి చేతితో పుచ్చుకొని నారాయణరావుతో) ఈ పుస్తకం పట్టుకెళ్ళుతున్నాను, చదివిస్తాను.

నారా : అలాగే.

(విమల వెళ్ళిపోతుంది)

నారా : కాసింభాయీ! నీవుకూడా వెళ్లు. ఇప్పటికే పొద్దుపోయింది. పుల్లయ్య మామ ఈరాత్రి కిక్కడే వుంటాడులే.

కాసిం : అచ్చా, అచ్చా (వెళుతూవుంటాడు)

నారా : కాసింభాయీ ప్రొద్దున్నే కనబడతావా?

కాసిం : కనపడ్తావా? తెల్లవారేసర్కి వూడీపడను.

నారా : సరేవెళ్లు (కాసింవెళ్లిపోవును)

కాంత : లెండినాయనా అన్నం తిందురుగాని,

పుల్ల : ఆకలిగాలేదు, అక్కయ్యా.

కాంత : అయ్యో. కొద్దిగా యెంగిలిపడు నాయనా. ఏడిజేస్తుంది. సందేయిత్తన్నావా?

పుల్ల : సందేహమేమిటక్కయ్యా మనలో మాటకి - జాస్తి మందం జేసింది.

నారా : అయితే కాసిని పాలుదాగు మామా- తీసుకురా అమ్మా.

కాంత : అట్టాగే. (నాలుగడుగులేసి వెనక్కి తిరిగి) కాస్తబెల్లపుముక్క వేయమంటావు నాయనా.

నారా : వెయ్యి.

(కాంతమ్మ లోపలికిపోయి ఒక గ్లాసులో పాలు మరో ఖాళీగ్లాసు తీసుకొని ప్రవేశించి పాలు తిరగబోస్తూ)

కాంత : తాతల్దకోతి వనమెల్లా కరిగిందని నీవు చెడేవాడివి చెడగా పుల్లయ్య వాళ్ళనుకూడా బజారుకీడ్చి పాడుచేస్తున్నావని వాడెందుకురా. కలిగిన మాత్రం కలో గంజో తాగి కొంపలో పడివుండక.

పుల్ల : మాకోసం పడరాని బాధలు పడుతున్నాడుగాని వాడు మమ్మల్ని పాడు చేసిందేముందక్కయ్యా.

కాంత : అదిగాదు నాయనా, ఒక గానొకబిడ్డ. నా అనే దిక్కులేదు. ఈగొడవ లన్నీ యీడికెందుకయ్యా. (పాలగ్లాసు పుల్లయ్య కందిస్తుంది.)

నారా : గొడవేముందమ్మా. నాన్నా, నీవూ కష్టపడి నాలుగుముక్కలు చెప్పించారు. నాకు తెలిసిందేదో మనవాళ్ల నలుగురికీ చెప్పడం తప్పా.

కాంత : తప్పా ఒప్పా యెవరికిగావాలి నాయనా. యెవళ్ళమంచి వాళ్ళు చూసుకుంటారుగాని. ఇన్నిటికీ మీనాయనేవుంటే నిన్నిట్టా తిరగనిచ్చేవారేనా? అబ్బాయి బెజవాడనుంచి రాగానే జమీందారు గారుద్యోగమిస్తానన్నారని యెంత మురిపెంగా జెప్పుకునేవారు. (కళ్ళనీళ్ల బెడుతుంది)

పుల్ల : (పాలుత్రాగి గ్లాసు కిందబెడుతూ) మేమంతా కలో గంజో తాగుతూ వాణ్ణి తిండిలేక చచ్చిపోనిస్తామా అక్కయ్యా. మాఅండ వాడికి, వాడి అండ మాకు.

నారా : అమ్మా, జమీందారీ ఉద్యోగమా. పంటలు పండినా యెండినా దయా దాక్షిణ్యాలు లేకుండా శిస్తులు వసూలు జేయాలిగదా? పూటకు గంజికి గతిలేక అలో లక్ష్మణా అని అల్లాడే కూలీలచేత వెట్టిచాకిరీ చేయించాలి గదా........

పుల్ల : అంతేనా, ఆడు కోరిన దాన్నల్లా తెచ్చి తార్చద్దూ?

నారా : అవును. ఇదేగా జమీందారీ ఉద్యోగమంటే. చెయ్యక చెయ్యక యీ దిక్కుమాలిన ఉద్యోగమే చేయమంటావా అమ్మా, చెప్పు.

కాంత : అయ్యో, నా తిమ్మర. నేనెంత తెలివితక్కువదాన్నయినా ఆ దిక్కుమాలిన ఉద్దోగమెట్లా జేయమంటానురా? చదువుకున్నాడివి గనుక యెక్కడన్నా బతుకుతెరువు చూసుకోమన్నాగాని.

పుల్ల : బతుకుతెరువు కేమిటిలే అక్కయ్యా.

నారా : ఆ దారేదో మీరే చూపించారుగా. చూడు. మనవాళ్ళంతా యేలాటి దుస్థితిలో వున్నారో - రాత్రింబగళ్లు కష్టపడ్డా పొట్టకు పట్టెడన్నం, కట్టుకోడానికి గుడ్డా, లేక నానా బాధలూ పడుతున్నారు. అంతా కలిసి మెలిసి, మంచీ చెడూ ఆలోచించుకొని, ఒక బాటన నడుస్తూవుంటే

యీ జమీందారుల దుండగాలు, యీ తాబేదారుల లంచగొండితనాలు యిలా మితిమీరిపోతయ్యా. ఇదంతా యెందుకమ్మా. పుల్లయ్యమామ యేంజేశాడని కొట్టించినట్లు? అమ్మా, కాస్త ఉదారంగా ఆలోచించి, యీ స్థితిలో మేమేం చెయ్యాలో నీవే చెప్పు.

పుల్ల : రామయ్యబావ బతికుండగా తనచేలో యెదేసుకుంటూ యెట్టికి నాగలి రానియ్యలేదని ఆయన్ని నానా బాధలుబెట్టాడు యీ నాగేంద్రం. ఆమెకు మాత్రం తెలియదటరా పీక్లబెట్టే యిబ్బందులు.

కాంత : ఏమోలెండిరాబాబూ, మీకు నేనేం చెప్పగల్దును? మీరుమాత్రం పొద్దోయి పోకటోయి తిరిగిరాకండయ్యా. కాలం బాగుండలేదు.

నారా : అలాగేలే అమ్మా, భోంచేద్దాం పద. (లేచి) పుల్లయ్యమామా, లే. పక్కేస్తా.

పుల్ల : నే నేసుకుంటాలే బాబూ. మీ రన్నం తినండి. (మంచం మీదనుంచి లేస్తాడు. కాంతమ్మ లోపలికెళ్లతుంది. నారాయణరావు పక్కవేస్తూ వుంటాడు.) (తెరపడును)

4

[అచ్యుయ్యగారి ఆవరణలో పూలతోట. విమల తన చేతిలోవున్న పుస్తకం బల్లమీదపెట్టి యేదో ఆలోచిస్తూ వుంటుంది. ఇంతలో కోయిల కూత వినపడుతుంది]

శివరంజని - ఝంపె

విమల : పల్లవంబులుమేసి చల్లగా గూర్చుండి
ఏలపాడెదె కోయిలా - నీపాట
కెవ్వరానందించవే కోయిలా
యెవ్వరానందించనే -
నీ చెణుకు బెణుకులు నీ తేనెపలుకులు
ఆనందమిచ్చునటనే - ఈనాడు
అన్నార్తులకు కోయిలా - కోయిలా
అన్నార్తులకు కోయిలా
దానిపలమై మేము పరితపించుచుమండ
ప్రణయగీతలు పాడెదే - నీవిట్లు
పరిహసించుచు నుండెదే - కోయిలా
పరిహసించుచు నుండెదే ॥పల్లవం॥

(అచ్యుయ్య ప్రవేశించి పాటవింటూ వుంటాడు)

అచ్యు : అమ్మా.

విమల : నాన్నా.

అచ్యు : ఏంచేస్తున్నావమ్మా!

విమల : ఏమీలేదు నాన్నా. ఇంతసేపటిదాకా రాలేదేం?

అచ్యు : దాని స్తేగా జమీందారు. ఎంతమర్యాద చేశాడమ్మా. కాసిని మంచినీళ్ళు తెచ్చిపెట్టమ్మా (విమల మంచినీళ్లకోసం లోపలికి వెళ్తుంది. అచ్యుయ్యగారక్కడున్న బల్లమీద కూర్చుంటాడు. బల్లమీదవున్న పుస్తకం తీసి చూచి) శ్రీ స్వాతం..... త్ర్యం. స్వా....తం....త్ర్యం

ఎక్కడికి దిక్కుమాలిన పుస్తకం (లోపల పేరుచూచి) ఓహో నారాయణరావా. (పండ్లుగొరుకుతూ) నా....రా....య....ణ....రా....వు. హుం (ఆలోచిస్తూ పరధ్యానంగా వుంటాడు)

విమల : (మంచినీళ్ళ గ్లాసుతో ప్రవేశించి) ఏమిటి నాన్నా ఆలోచిస్తున్నారు.

అచ్యు : (గ్లాసందుకుంటూ) ఏముందితల్లీ. ఇవ్వాళ మీ అమ్మేవుంటే (కుంచి ఏడ్పురాగి) ఎంతగా సంతోషించేదో. బ్రతికివున్నాళ్లు 'అమ్మాయికి బాగా చదువూ సంగీతం చెప్పించాలండి' అంటూ వుండేది. అమ్మే పట్టుబట్టకపోతే నీకి చదువే వచ్చేదిగాదు. తీరా ఆమె కోరికతీరే ఘడియ వచ్చేసరికి చూచుకునే ప్రాప్తం లేకుండా పోయింది. (విమల కొంచెం విచారంగా వుంటుంది. అచ్యుయ్య బిడ్డను దగ్గరకు తీసికొని తలనిమురుతూ) ఆ జ్యోతిష్కుడెంత గట్టివాడమ్మా. అతను చెప్పినట్టే జరుగుతోంది.

విమల : ఏం చెప్పాడేం?

అచ్యు : (నవ్వుతూ) నీ వొక రాణివవుతావని. (విమల ముఖం చిట్లించుతుంది.) నీవు నాపేరు నిలబెట్టటానికి పుట్టావమ్మా. కాకపోతే జమీందారంతటి వాడు నన్ను పిలిపించి సహపంక్తిని భోంచేసేటప్పుడు ఈ ప్రస్తావన తెచ్చాడంటే. నిజంగా నీవదృష్టవంతురాలివమ్మా.

విమల : (విసుగ్గా) ఎంత అదృష్టం?

అచ్యు : ఇంకా చిన్నతనం. నీకేంతెలుసు. ఆయనకేం వంకుందమ్మా. చక్కని వర్చస్సు. కావలసినంత ఐశ్వర్యం. నౌకర్లు. చాకర్లు. దేవేంద్రవైభవం. కలెక్టరులాంటివాడు కూడా ఆయనమాట కాదనలేడు. ఆయనకేమమ్మా మహారాజు.

విమల : అవును. మహారాజు. ఎంతమందిని పొట్టపెట్టుకుంటే మహారాజయ్యాడో.

అచ్యు : పొట్టన బెట్టుకుంటున్నాడా?

విమల : కాకమరేమిటి? కొంపలు జప్తుచేసి ఇంటిల్లిపాదీ పిల్లా జెల్లా గొల్లున గోలపెడుతూండగా బైటకీడ్చించడం. అదేం పాపమంటే దొంగచాటుగా తలకాయలు పగులగొట్టించడం. ఇరవైనాలుగు ఘంటలు తప్పతాగి గంతులువేయడం. చేసుకున్న పెండ్లాన్ని సైతం నానా చెరలుబెట్టి హింసించడం.....

అచ్యు : అన్నీ యిలానే వుంటాయి. మొదట్లోనే తనకాసంబంధం వద్దని ఆయన గట్టిగానే చెప్పాడు. అయినా పెద్దదొరగారు మేనరికం యొక్కడ

పోతుందో నని పట్టుబట్టి చేశారు. ఎన్నాళ్ళుజూచినా ఆయనకూ ఆమెకూ పొసగలేదు. ఏంజేస్తాడు పాపం! కావలసిన డబ్బు దస్కం యిచ్చి క్షేత్రంగా ఒక బంగాళా కట్టించి హాయిగా బతకమన్నాడు. ఇందులో ఆయన జేసిన తప్పేముంది?

విమల : (వ్యంగ్యంగా) ఏముంది పాపం. ఇవ్వాళ యింకొకర్ని జేసుకుంటాడు. రేపింకో బంగాళా వేయిస్తాడు. ఎల్లుండి మూడో పెండ్లికి తయార్.

అచ్చు : అబ్బే. ఈసారి అట్లా యెందుకు జరుగుతుంది. ఆయనే కావాలని కోరి చేసుకుంటూవుండె.

విమల : ఆయన కావాలంటేసరి అయినట్లే. ఎదటివారి యిష్టమయితే నేం కాకపోతే నేం?

అచ్చు : (విచారంగా కూతుర్ని బుజ్జగిస్తూ) అమ్మాయీ, అదికాదమ్మా, ఒక్కటాలోచించు. నాకంటె నీక్షేమంకోరే వారెవరున్నారు? చిన్నప్పటినుంచి యెంతో అల్లారు ముద్దుగా పెంచాను. పెద్దదాన్ని చేశాను. అమ్మా, నిన్ను చూచుకొని మీ అమ్మనుకూడా మరచిపొయ్యాను. ఎంతమంది నన్ను పెండ్లి జేసుకోమని హెచ్చరించినా, నీసౌఖ్యం కోరి నీకెంతో పెద్ద సంబంధం తేవాలని, చివరకు నాపెండ్లికూడా మానుకున్నాను. నీమేలు కోరి మాట యిచ్చాను. ఇంతవరకు నామాటెక్కడా వీరుపోలేదు. పెద్దవాణ్ణి. నాపరువు కాస్త నిలబెట్టవూ? అమ్మవుకాదూ? నిలబెట్టవు తల్లీ?

విమల : నిజమే నాన్నా. యిన్నాళ్లూ పెంచి పెద్దదాన్నిచేసి చివరకో కసాయి చేతిలో పెడతామంటున్నారు. ఇన్నిటికీ మాఅమ్మే వుంటే నన్నదగతుండా యిలా చేస్తుందా? అందుకనే తల్లిలేకపోతే తనువే లేదన్నారు.

(విమల విచారంగా వెళ్ళిపోతుంది. అచ్చయ్యగారు దీనంగా కూతురివైపు చూస్తుంటాడు. ఇంతలో తెరవెనుక పాట వినపడుతుంది. నారాయణరావు, వలంటీర్లు పాడుకుంటూ పోతూవుంటారు.)

మోహన - ఆదితాళం

ఓ కర్షక వీరకుమారా లేరా ॥ఓ కర్షక॥
క్రూర జమీందారీ బాధలతో, మారణమై పోనేలా లేరా
అనయము శ్రమపడుచుందెదు నీకూ అన్నమేలేదా,
అన్నమేలేదా ఈవేళా లేరా
రారా కర్షక తనయా రారా లేరా రారా
లేరా కర్షక తనయా రారా లేరా రారా

భారత భాగ్యవిధాతవు నీవో రైతా
బానిసత్వమున పడి యిటు చావగనేలా
కూడదీపికొని నీ సోదరులను
పీడన పద్ధతి నిపుడెదిరింపన్
వేగరారా ముందుకిపుడే రారా ॥రారా కర్షక॥

చావుదప్ప దెప్పుడైన సాగిరమ్మురా
పోరునల్పరా పేరువిల్పరా
అన్ని మూలల కిదే నినాదం
బందజేయరా కర్షకవీరా లేరా, ॥రారా కర్షక॥

అచ్చు : (కోపంతో) నేటి కీగ్రామానికి ముసలం బుట్టింది. పనీ పాటా లేక అడ్డగాడిదల్లాగా తిరిగే పోకిరీ రకమంతాచేరి గ్రామాన్ని నాశనం జేస్తున్నారు. (పోవును)

5

దివాణం:

[చక్రధర్రావు, రామ్, సిగరెట్లు కాలుస్తూవుంటారు.]

చక్ర: ఏరా రామ్, మోహన్ ఉత్తరమన్నా రాయలేదేరా.

రామ్: ఉత్తరమెందుకు? అసలు బొమ్మనే దించుకాడు. వెళ్ళి నాలుగు రోజులేగా?

చక్ర: ఏమో వాడు వట్టి లేజీఫెలో. నీవెళ్ళినా బాగుండేది.

రామ్: అక్కరలా. వాడేం సామాన్యుడా? దాన్ని మద్రాసు దాటించడమంటే మాటలా; చెత్తాకానీరకం కాదుగా? అంత తేలిగ్గా బైటపడ్డానికి. అసలు మనం వెళ్ళితేనే బాగుండేది. ఈ వెధవ తగాదామూలాన ఆగాలిసి వచ్చింది.

చక్ర: ఏది యెలావున్నా. ఈ రైతుల్ని ఒక్కంట కనిపెట్టివుండాలి. లేకపోతే ఏకు మే కవుతుంది. వీళ్ళను కాస్త తలెత్తనిస్తే మన ఆటలు సాగవు.

రామ్: గుడ్డికన్ను తెరిస్తే యెంత? మూస్తే యెంత? ఈ పీనుగలు చేసి చచ్చేదేమిటి?

చక్ర: అమ్మా! అలా అనకు. కన్ను మూయడానికి వీల్లేదు వీళ్ల సంగతి తేలేవరకు. చీల్చి ఎండెయ్యాలి. గాడ్దెలు.

(నాగేంద్రం ప్రవేశించినమస్కారం చేస్తాడు)

చక్ర: ఓహో. కూర్చో. అనుకున్నపని జరిగిందా?

నాగేం: మనం ప్లాను వెయ్యడం, జరక్కపోవడం కూడానా.

రామ్: శెబాష్. దొరకుతగ్గ బానిసేదొరువయ్యా.

చక్ర: ఎక్కడ దొరికాడోయ్?

నాగేం: సిరిపురంలో మీటింగుపెట్టి తిరిగి వస్తున్నారు. ఏవేవో లేక లేక సొంతకాయలు గోస్తూ కబుర్లుచెప్పుకున్నారా కుర్రకుం. పుల్లయ్య

గాడేమో, ఊ. గొడుతున్నాడు. వెదుళ్లవాగులో దిగిదిగడంతోనే (చిటికేస్తూ) యిట్లా అన్నా. మన పిల్లిభీముడు వెయ్యవే వేశాడు. దెబ్బకు గింగిరాలు తిరిగి అవతలబడ్డాడు చిత్రబిళ్ళలాగా - ఎంత మందుంటే యేం?

చక్రి: దెబ్బకు ఖూనీ అయిపోయాడన్నమాట.

నాగేం: కాకపోతే-ఒకవేళ బ్రతికి బయపడ్డా అవిటిబ్రతుకేలెండి.

రామ్: అదీ యెత్తంటే, సూత్రాలు తిరిగిపోవాలి.

చక్ర: భేష్ నాగేంద్రం, మొనగాడివంటే నీవేనోయ్.

నాగేం: (ముసిముసి నవ్వులు నవ్వుతూ, చేతులు నలుపుకుంటూ) ఇంతకూ తమ దయే వుండాలిగాని, ఈలాంటి వెధవలొక లెఖ్ఖా. రోజుకొకణ్ణి తన్ని బైటికీడ్పించనూ.

(వెంకన్న ప్రవేశించి చివరవాక్యం విని)

వెంక: మీ పాదాలకు మొక్తా బాబూ, పిల్లలుగలాణ్ణి. ఈడ్పిస్తే చచ్చిపోతా. (అందరూ నవ్వుతారు) అచ్చయ్యగారిని కేకేసి, గుక్కెడు నద్దిదాగి వత్తుండ బాబూ.

చక్రి: ఏడిరా అచ్చయ్యగారూ?

వెంక: అస్లీకోళ్ళ బాబూ, బాగానేవుండాయి. ఇప్పుడే సీళ్ళదాసి వత్తుండా బాబూ.

రామ్: (నవ్వుతూ) నీపిండాకూడు. పిచ్చిముండాకొడకా.

నాగేం: కాదురా, నీ తలకాయ. అచ్చయ్యగారేంరా.

వెంక: అచ్చయ్యగారా, వత్తున్నారండి. రాములోరిగుడికాడ పుల్లయ్య ఎదురై ఏదో గొడవపెప్తుంటే యింటా నుంచున్నారు.

చక్ర: (నాగేంద్రంవైపు గుర్రురిమిచూస్తూ) ఏడ్చావు వెధవేడ్పు. నీయేడ్పు తగలెయ్య.

(నాగేంద్రం తలవంచుకుంటాడు)

రామ్: వెళ్తానండి. మోహన్ ఏమయినా వుత్తరం రాశాడేమో పోస్టాపీసుకెళ్ళి చూస్తా (జమీందారువైపు జూస్తూ పక్కకు నడుస్తూవుంటాడు. ఇంతలో అచ్చయ్యగారి ప్రవేశం. అచ్చయ్యగారిని తీరా ముఖందగ్గర కొచ్చే టప్పటికి చూచి) గుడ్‌మార్నింగ్ అంకుల్ అచ్చయ్యగారూ.
(అచ్చయ్యగారు మోహన్‌వంక అసహ్యంగా జూస్తారు. మోహన్ ఎడంగా తొలగి వెళ్ళిపోతాడు)

చక్ర : ఓహో అచ్చయ్యగారా దయచేయండి (కుర్చీ చూపెడతాడు. అచ్చయ్య గారు నమస్కారంచేసి కూర్చుంటారు వెంకన్న బైటికి వెళ్ళి పోతాడు.)

అచ్చ : తమరు రమ్మన్నారని వెంకన్న చెప్పగానే బయలుదేరి వస్తున్నాను. రామమందిరం దగ్గర కొచ్చేసరికి పుల్లయ్య యెదురయ్యాడు తలకొక కట్టుగట్టుకొని. వీడి సరుకెంతవరకుందో చూద్దామని 'తలకాకట్టేమిట్రా పుల్లయ్యా' అన్నా. "నా నోటితో చెప్పించాలనిగాని మీకుమాత్రం తెలియకుండా ఉన్నదటలేవే" అంటున్నాడు. ఇంతలో ఎక్కడనుంచో వూడిపడ్డాడు అలీదరుగాడు నారాయణ. రావడంతోనే యిక యెత్తుకున్నాడు నాయనా. ఎవరో రౌడీలట, తామేమో వూరినుంచి వస్తూవుంటే దారిగాచి దొంగదెబ్బ కొట్టారట. ఇదంతా జమీందారుగారి చలవేనట. ఇంకా యేమేమో వాగాడు.

చక్ర : వాగుతాడు వాగుతాడు. ఒక తడిబడితేగాని

అచ్చ : అనపగుగ్గిళ్ళు గాదండో తేలికగా నమలడానికి, యినపగుగ్గిళ్ళు.

చక్ర : ఇనపగుగ్గిళ్ళు.........హుం....మూవలోబోసి కరిగితేనరి ముద్దయి వూరకుంటాయి.

అచ్చ : నిజమే అనుకోండి. తరవాత మాట యెలావున్నా ప్రస్తుతం నలుగురూ నారాయణా నారాయణా అంటూ వుంటే ముందుగతి గానక రొమ్ము విరుచుకు తిరుగుతున్నాడు వెధవ !

నాగేం : తిరక్క వాడికేం ? మనిషికో వంపుం బెట్టాడు; ఆకాశానికి చుక్కలు నేనే తగిలించా నంటున్నాడు.

అచ్చ : మనిషికో సంఘమంటే జ్ఞాపకమొచ్చింది. మహిళా సంఘాలట మహిళాసంఘాలు ! ఇదివరకున్నవి చాలక ఊళ్లో యేమూల కెళ్ళినా ఆ పిచ్చి పాటలే.

చక్ర : అందాకా వచ్చిందీ వ్యవహారం.

నాగేం : ఏముంది ? అమాయకుల్ని మాయజేయడానికి ఇదొక దారి

అచ్చ : ఏడ్చాడు వెధవ.

నాగేం : అంతగాక యింకేంతలెండి. బుద్ధులు భూములేల్తావుంటే రాత గాడ్దెలు గాస్తూవుంది. వెధవకు తగిన ప్రాయశ్చిత్తం జరిగితేనేగాని తలదిమ్ము వదలదు.

చక్ర : ఈలాంటి పీడలు నావూళ్లోవున్నా దరిద్రం.

అచ్చ : ఈ దౌర్భాగ్యుడు వూళ్లో కాలుబెట్టినప్పటినుంచీ వూరంతా నాశనమై పోయింది. కడుపులో చల్ల కదలకుండా హాయిగా కాలక్షేపం జేసే గ్రామంలో అన్నీ కలతలే. తండ్రికీ బిడ్డకూ రైతుకీ రాజుకూ చివరకు మొగుడూ పెండ్లాలమధ్య కూడా తగాదాలు పెడుతున్నాడు. ఈ శని గ్రహంవదిలితేనే మళ్ళీ గ్రామానికేమయినా మోక్షం.

చక్ర: శనివదిలితే, యెప్పుడోనా? ఒక ఘడియకూడా వీడు నాగ్రామంలోవుండటానికి వీల్లేదు. నాగేంద్రం, తక్షణం మెడబట్టి బైటికి గెంటించేశెయ్ దరిద్రుణ్ణి.

నాగేం : అదెంతపనిగాని..........

అచ్చ : ఏముంది గొర్రెలమంద.సైగా కాటిగా అంటే కాడి బుజానేసుకునేమచ్చు. వాడు వేయమన్న గంతల్లా వేస్తారు. పనిపాటల్లేక బేవార్సుగా తిరిగే పోకిరీరకం ఊళ్ళో కొంతుందిగా. ఏది యెట్లావున్నా చేసే పనికాస్త జాగ్రత్తగా చేయడం మంచిది.

నాగేం : (చిటికవేస్తూ) దాని కిటుకు మన చేతిలో వుందిగా !

చక్ర : (ఆలోచిస్తూ) ఏమిటంటావు ?

నాగేం : (అచ్చయ్యగారివైపు జూస్తూ) ఏమండీ, అచ్చయ్యగారూ వీడుండేఇంటి పెరడు క్రితం యెన్నేటువారి సొంతం కాదండీ.

అచ్చ : ఎన్నేటుదేకాని, రామయ్య బ్రతికివుండగా దానిక్రింద నజరానా వగైరా కొంత కట్టినట్లుందే.

నాగేం : ఏదికడితేయేం ? దానికేమయినా పట్టా, రిజిష్టరా?

అచ్చ : ఆఁ ఆఁ నిజమే.

చక్ర : సెబాష్ నాగేంద్రం. రేపిపాటికి వాణ్ణి ఆ కొంపలోనుంచి వెళ్ళగొట్టేశెయ్. దానితో పీడా వదులుతుంది.

నాగేం : చిత్తం, (లేచి నాలుగడుగులు వేస్తాడు)

చక్ర : రేపిపాటికల్లా వాణ్ణి వెళ్ళగొట్టి మరీ నాకు కనపడాలిసుమా. వెనుకటి మాదిరిగా జేశేవు. జాగ్రత్త.

నాగేం : చూస్తారుగా (వెళ్ళిపోవును)

అచ్చ : పిట్టకొంచెం కూత ఘనమన్నట్లు కాస్తంతలేడు, ఊళ్ళో యెంత విష ప్రచారం చేశాడండీ. మీమీద.

చక్ర : ఇంతటితో వదలిపెట్టాను. (మీసం మెలివేస్తూ) వీణ్ని గోదావరి నీళ్ళు తాగించకపోతే నాపేరు చక్రధర్రావా ?

అచ్చ : (ముసిముసి నవ్వులు నవ్వుతూ) తమరు తల్చుకుంటే అదెంతపనిలెండి. సెలవిప్పిస్తారా ?

చక్ర : వెళ్ళొచ్చుతేగాండి. (ఇద్దరూ లోపలికెళ్ళిపోతారు)

6

నారాయణరావు ఇల్లు.

[శాంతమ్మ కూరగాయలుగోస్తూ వుంటుంది. నాగేంద్రం, పిల్లిభీముడు వగైరాలు లాఠీలతో ప్రవేశిస్తారు]

నాగేం : చూస్తారేమిట్రా ? సామానంతాలాగి అవతల పారేయక (పిల్లిభీముడు వగైరాలు సామాను బైట పారేస్తూవుంటారు.)

శాంత : (అడ్డం వెళుతూ) అయ్యో, అయ్యో, ఇదేం పాపం, ఇదేం అన్యాయం, ఎవళ్ళురా మీరు మాయింట్లో జొరబట్టానికి.

పిల్లిభీముడు : పోఅమ్మా, పో - అరవమాకు. అన్యాయమంట అన్యాయం. (పుస్తకాలుతీసి బైటికి గిరాటేస్తూ వుంటాడు.)

నాగేం : ఏయ్ ముసలమ్మా, ఇల్లు పీటాబుగాడి సొమ్మనుకున్నావా ? నడువ్ బైటికి.

శాంత : మీకేం బిడ్డాపాపా లేరంటరా ? రాళ్ళుగన్నారా ?

నాగేం : నోరుముయ్, నీవు కన్నావుగా దేశాన్ని వుద్ధరించే కొడుకుని, చాలమా ?

పిల్లిభీ : ఏయ్ ముసలమ్మా, జాగ్రత్తగా రానియ్యి మాటలు.

రౌడి : (నాయకుల ఫొటోలు తీసి బైట పారేస్తూ) మింగడానికి మెతుకులేదు. యీడి కొంపకుతోడు ఫొటోలట. ఫొటోలు.

శాంత : నీకేం పొయ్యేకాలం వచ్చిందిరా ? మెతుకు లేకపోతే మీరు తెచ్చిపెడతన్నారంటరా ? మీజిమ్మడీయ.

రౌడీ : ఆఁ అట్టాగే మొరగుతూ వుండు. అంతపని జరిగేదాక. (ఏకులబుట్ట కాలితోతన్ని రాట్నం బైటకు తెస్తూవుంటాడు.)

శాంత : ఏంజేత్తార్రా. చంపుతార్రా. చంపండిరా చచ్చినోళ్ళల్లారా. (రాట్నానికి అడ్డం వెళ్లతుంది)

నాగేం : (కోపంతో) మూడు దమ్మిడీలు చేయని యీ ముసలిముండ అపడం. మేం ఆగడమా ? (శాంతమ్మని రెక్కబట్టి బైటికి నెడతాడు)

శాంత : (క్రిందబడిలేస్తూ) ఎన్నాళ్ళు సాగుతుందిరా మీ అగడం. పాపం పండింది. మా వుసురు తగలకపోతుందటరా ? పైన దేవుడు లేడూ ?

(శాంతమ్మ ఏడుస్తూవుంటుంది. సామానంతా బైటపడేయించి నాగేంద్రం యింటికి తాళంవేసి గబగబా వెళ్ళిపోతాడు. ఇంతలో పుల్లయ్య వచ్చి నివ్వెరపోయి చూస్తూవుంటాడు.)

శాంత : అయ్యో, చూడరానాయనా పుల్లయ్యా, ఎంత దుండగంచేశారో, నీడి వుద్యోగం ఊడ్చిపెట్టుకపోను. అడకూతురని అయినా అనుమానించకుండా అడ్డమయిన మాటలన్నారురా ? (అవురుమంటుంది)

పుల్లి : ఊరుకో అక్కయ్యా, వూరుకో. వాడికీ రోజులు దగ్గిరకొచ్చాయి. వూళ్లో ఎవళ్లూ లేకుండాజూచి ఎంతపని చేశార్రా దొంగ గాడ్దెకొడుకులు.

వీరయ్య : (ప్రవేశించి) సమయాని కుండకపోతిమి. సావో బతుకో తేలుసుకునేవాళ్ళం.

పుల్లి : ఆ వరదాకా యింటికాడే వుండా. ఆ నాలుగు వంగపాదులూ ఎక్కడ గొడ్లుపాడుజేస్తయ్యో నని అన్నంతిని అప్పుడే అట్టా బైటికెళ్లా. ఇంతలో కుర్రాడు రొప్పుతూ రానేవచ్చాడు. "బాబూ, బాబూ, ఎవళ్లో జమీందారు మనుసులంట, శాంతమ్మత్తయింట్లో సామానంతా బైట పారేస్తున్నారంటూ" ఆదరాబాదర వచ్చేటప్పటికి తాళంవేసి పోనే పొయ్యారు. ఎదవనాయాళ్లు. నన్నుజూచి శాంతమ్మక్కయ్య అవురుమందిరా. కడుపు తరుక్కుపోయింది.

కాసిం : (ముచ్చెమటలతో హడావుడిగా పరుగెత్తుకొచ్చి) అరే హెక్దా వచ్చార్ మస్జీద్ జనం అంతా. మీకి ఖలేజా నై. నాకివుంటే బిస్మిల్లా సేయక పోయానా వాడ్కి.

పుల్లి : సమయానికంతా పొలంలోనే సస్తిమి. తీరా వచ్చేటప్పటికి తాళం వేయనూ వేశారు, పోనూ పోయారు.

కాసిం : బద్మాష్....అరె యిద్దూ ముస్కిపోయిందీ క్యా. తాళం గీళం తుఖ్డా తుఖ్డా కావాలి. చలో భాయి చలో.

వీర : కాసిం. మళ్లా వాడేమంటాడో కాస్త ఆగండి. ఆడూ వచ్చేయాళయిందిగా.

కాసిం : ఏ క్యారే, థూత్. (నిరాశతో పంచ నేలకేసికొట్టి చదికిలబడతాడు)

(కోటయ్యతోపహా నారాయణరావు ప్రవేశం, నారాయణరావుచేతిలో ఒక సంచిమాత్రం వుంటుంది.)

వీర : అరుగోరా, మన నారాయణ కోటయ్యలు రానేవచ్చారు.

శాంత : వచ్చావురా నాయనా, ఎంతగతి పట్టిందిరా ! (ఎదురుగావెళ్ళి కౌగిలించుకొని యేడుస్తుంది, తల్లిమీద చేయివేసి నారాయణరావు గంభీరంగా నుంచుంటాడు, రైతులందరూ విచారంగా వుంటారు.)

నారా : ఇంతమాత్రానికే అధైర్యపడితే యెలాఅమ్మా (నారాయణరావు కొంచెం వెనక్కు తప్పుకొని సంచి ఒకవక్కన బెడుతూ) దుర్మార్గుడు ఎంత అవినీతికయినా పాలుపడతాడు. మనం బలపడితే వాడిష్టంవచ్చినట్లు నాటకమాడటం కుదరదని మొక్కలోనే మన సంఘాన్ని తుంచివేయాలని చూస్తున్నాడు. ఎన్ని పిచ్చికళలు జేస్తే అంతత్వరగా నాశనమవుతాడు. ఇంకెన్నాళ్లు వీడి ఆటలు

శాంత : అదికేం నాశనమవ్వను ?

కాసిం : అరే,వేదాంతం బోత్తేక్యా బాబా, తాళం గీళం హిప్డూ పగలగొట్టావాలి.

కోట : ఏమయినాసరే తాళం పగలగొట్టాలిసిందే.

నారా : మనమలా తొందరపడటం మంచిదికాదు.

కాసిం : అరే ! ఎవడీ యింట్లో వాడూ దూరేదీ కూడా తప్పే !

నారా : దానికి చాలా చిక్కులున్నాయి కాసింభాయి. ఇల్లు వాడి స్వాధీనమై తాళం వేసుకున్నతర్వాత మళ్ళీ మనం వెళ్ళి తాళం పగలగొట్టడమంటే అదొకపెద్ద కేసవుతుంది.

కాసిం : (తెల్లపోవును)

వీర : కేసా ? ఎందుకు కేసు ?

నారా : ఎందుకా ? అమాయకుడు మానాన్న ముందు డబ్బు గట్టాడు. చచ్చిందాకా వాడిచుట్టూ తిరిగినా పట్టా యివ్వలా రిజిష్టరూ చేయలా

పుల్లి : అయితే యిక యిల్లు వదలిపెట్టి వూరుకోవాలిసిందే ?

నారా : ఆ విషయంలో ముందు ప్లీడరుతో సంప్రదించి తర్వాత వ్యవహారానికి దిగడం మంచిది. అయినా యేపని చేయాలన్నా ముందు గ్రామంలో మనకు తగినంత బలముండాలి. ఇంకా కొందరు అమాయక ప్రజలు వాడిమోసం గ్రహించలేకుండా వున్నారు. వూరంతా ఒక తాటిమీద నడిచినప్పుడే యీ రాక్షసకృత్యాలన్నిటినీ యెదుర్కోగలం అప్పుడు గాని వీడిఆట కట్టదు.

కోట : అంతా ఒక కట్టైనే కాత్తే ఖింకా అడిగేదేముంది ?

నారా : ఓపికబట్టాలి. అచ్చయ్యగారిలాంటి స్వార్ధపరులింకా కొందరు జమీందారు వెనుక తాళం వేయబట్టే వాడివ్వాళ మనింటికి తాళం వేయగలిగాడు.

పుల్లి : తాళంమాట కేమొచ్చెలే. ముందు నీవు పోయి ప్లీడర్ని సరిగ్గా కనుక్కో. నీకేం, ఉంటానికి ఊళ్ళో కొంప తక్కువవుతుందా ?

నారా : వాడి ఉద్దేశమయితే అదే.

పుల్లి : నీకా యిల్లు దొరకంది ! నీయిష్టమొచ్చినన్నాళ్ళుందు మాయింటో. చేసే తల్లకిందులేమిటో చూస్తా.

కాసిం : మాకీ మస్జీహుండాం - జాన్వర్ హుండాం. మాదీ బొందిలో పాణం హుండ్గా మీకీ హెల్లాగొడతాద్.

కోట : ముష్టెత్తుకోనయినా బతికించుకుంటాం గాని నిన్ను పోనియ్యంకేం ?

శాంత : ఏమోనాయనా అదికి తల్లీతండ్రీ అంతా మీరే.

పుల్లి : నారాయణ నీబిడ్డగాదక్కయ్యా, మాబిడ్డ

శాంత : మీరంతా అట్టావుండాలిగాని నాయనా, నాకింతకంటే ఏం గావాలి. ఆకొంపవుంటేం పూడితేం?

పుల్లి : బలేమాటన్నావక్కయ్యా (చేతితోరాట్నం బట్టుకుంటూ) అరే కోటయ్యా తలాఒకటి పట్టుకోండిరా అబ్బాయి. అక్కయ్యా ! పోదాం పదా.

(తలా ఒక సామాను తీసుకొని నడుస్తూవుంటారు)

నారా : (సంతోషంతో)

అమితోల్లాస విలాసముట్టిపడ నిట్లాబాలగోపాలమ్మున్
తమ సర్వస్వము ధారవోసి కటిబద్ధంబై యెదుర్కొన్న, రా
జ్యము లెల్లన్ తలక్రిందులై చనవె ? కష్టంబుల్ పటాపంచలై
సమతాసూత్రావిధాన కల్పిత మహాసౌఖ్యాబ్ధి నోలాడమే ?

7

అచ్చయ్యగారిల్లు

[విమల తన గదిలో కూర్చొని "స్త్రీస్వాతంత్ర్యం" అనే పుస్తకం తీసి చదువుతూ వుంటుంది. గదిలో టేబులు, కుర్చీలు, బీరువా, అద్దం వగైరా]

ధనముప కాశించి తనయను గొంపోయి
            ముదివగ్గుకిచ్చెడు మూర్ఖుడొకడు
మంచిసంబంధంబు మించిపోవునటంచు
            చిన్నపిల్లకె పెండ్లిజేయునొకడు
మేనరికానికి మించినదేమంచు,
            కురుజోడైన యోచింపడొకడు
చెడురోగముల బాధపడు జారునకునైన
            గుణవతి పుత్రికన్ గూర్చునొకడు
        బిడ్డలకు విద్యలన్ని నేర్పించి తుదకు
        ఓనమాల్ రాని కుంతల కొసగునొకడు
        ఆడుబిడ్డల నిటు కడుపార గాంచి
        పెంచి కటికి కసాయి కర్పించనగునె ?

        ఝాన్సీలక్ష్మినాటి స్త్రీ శక్తియేది ?
        విపుర గప్పెనె ! నివ్వుపై నేటికహహ !
        జగతివెరగంద మీశక్తి చాటుడమ్మ
        మరల నొకమారు భారత తరుణులార.

(అచ్చయ్యగారి ప్రవేశం)

విమల : (తండ్రిని చూడగానే లోపలున్న నౌకరును కేకవేస్తూ) అప్పన్నా. నాన్నగారు వచ్చారు. నీళ్ళు తీసుకరా !

అచ్చ : పీళ్ళెందుకమ్మా.

విమల : భోజనం చెయ్యరూ.

అచ్చ : దివాణంలో భోంచేసి వచ్చాగా.

విమల : (ముఖం చిట్లిస్తూ) ఊహుఁ.

అచ్చ : ఆయన ఎంత మర్యాదస్తుడమ్మా. నౌకర్లన్నం వడ్డించారు. ఏదో పిచ్చాపాటి మాట్లాడుతూ ఇద్దరం సహపంక్తిన భోంచేస్తున్నాం. మాటల సందట్లో గిన్నెడు నెయ్యి ఒక్కసారి వెండిపళ్ళెంలో గుమ్మరించారు తనచేత్తో.

విమల : (విసుగ్గా) ఇంకేం ?

అచ్చ : అదిగాదమ్మా. మర్యాదకి జెప్పుతున్నా. మర్యాదకి. జమీందారంతటి వాడు మనల్నిపిల్చి అంత గౌరవిస్తే ఏదో ఉడతాభక్తి మనంకూడా ఒకసారి ఆయన్నిపిల్చి విందుజేస్తే బాగుంటుందని.

విమల : ఎవరు వద్దన్నారు ?

అచ్చ : వద్దంటావని కాదమ్మా. వెనకటి కాలపు మనిషి మీఅమ్మ. దానికే వంటలూ చేతయ్యేవిగావు. నీవు చక్కగా కొత్తకొత్తపదార్థాలు కమ్మగా జేసి వడ్డిస్తావనికాదూ నేను పిలవడానికి సాహసంచింది.

విమల : ఏమిటీ, నేను వంటజేసి నాచేతుల్తో ఆనీచుడికి వడ్డించాలా ? శాంతమ్మగారిలాంటి మానవతినిబట్టి బజారుకీడ్పించిన ఆపశువుకి.

అచ్చ : (కోపమాపుకొని) అవును. శాంతమ్మగారు మహా యిల్లాలే. అయితే నేం ? ఆతల్లికడుపు చెడబుట్టాడుగా యీదౌర్భాగ్యుడు జమీందారుగారు కూడా నాయెదుట "అచ్చయ్యగారూ శాంతమ్మగారిలాంటి మహా యిల్లాల్నికూడా యీదౌర్భాగ్యుడి మూలాన బైటికీడ్పించాలసివచ్చిందే" అంటూ నిజంగా కండ్లనీళ్ళ పర్యంతమయ్యాడు

విమల : కిరాతుడు ఎందుకు కార్చడు మొసలికన్నీళ్ళు.

అచ్చ : కిరాతుడా ?

విమల : సందేహమా, కుయ్యోమొర్రో అంటూ వుండగా దిక్కులేని అనాథ స్త్రీలను బైటికీడ్పించేవాడు: పదిమందీ నోట్లో పూస్తారని యెగ్గూసిగ్గూ లేకుండా కొంపలు తగులబెట్టించేవాడు........

అచ్చ : ఎవడా కొంపలు తగలబెట్టించింది ?

విమల : ఎవడా ? మీకు మెచ్చి మేకతోలుగప్పే జమీందారు. అతడాన్నాయి పుట్టిన పాపాన చూట్టానికి కండ్లులేకపోయినా వింటానికి నాకూ చెవులున్నాయి రాక్షసుల్లాగా కొంపలు తగల బెట్టించింది చాలక 'మొగుణ్ణి గొట్టి మొర్రో' అని యేడ్చినట్లు సిగ్గులేక నారాయణరావు వాళ్ళమీద కేసులుకూడా బనాయించాడు.

అచ్చు: ఆగాడిదపేరు నాయెదుట తేవద్దని యెన్నిసార్లుచెప్పినా తెస్తూనేవుంటావు మాటకు ముందు నారాయణ నారాయణ. అన్నిటికి దొరికాడొక పోకిరీ వెధవ నాలుగు తియ్యతియ్యని మాటలూ పాటలునేర్చికూలీలూ రైతులు అని గొంతు చించుకుని అరుస్తూవుంటే నీబోటి తలకాయలేని రకమంతా ఉబ్బి తబ్బిబ్బై అదిరిపడి చస్తున్నారు. తనకొంప మున్నిన చేసుకుంది చాలక పుల్లయ్య కొంపగీయటానికి కూడా సిద్ధమయ్యాడు. రేపిక నాకొంపదీస్తాడు.

విమల: ఎవడి కొంపదీసినా మీ నాగేంద్రం దీయాలి. మీ జమీందారు తీయాలి. అతను ఎవరి కొంపా తీయడు.

అచ్చు: ఛీ ఇదిమొదలు ఆ ఛండాలుడిపేరు నాదగ్గిర తెచ్చావంటే జాగ్రత్త! మాట దక్కదు

విమ: ఎవరికంటె ఛండాలుడు? కొంపలార్పే మీ జమీందారుకంటేనా? నిరుపేదలై తిండిలేక మలమలమాడే కూలీ రైతులకోసం తన జీవితం ధారబోసే ప్రజాసేవకుడు ఛండాలుడట! ప్రజల రక్తమాంసాలు పీల్చి పిప్పిచేసి, మజాకోసం మానవహింసజేసే రాక్షసుడు బుద్ధిమంతుడట! నాన్నా, మీకు కోపంవచ్చినాసరే, కష్టమయినాసరే, యీ విషయంలో మాత్రం మీ మాట కాదనకతప్పదు. నేనెంత చిన్నదాన్నయినా, నాకెంత లోకానుభవం లేకపోయినా, నాకూ తెలుసు; వాడెందుకి వుచ్చులు పన్నుతున్నాడో. నాకూ పదహారేండ్లు వచ్చినై. వాడ్ని గడపతొక్కాడా నే నీ యింట్లో వుండను. ఇన్నాళ్లూ పెంచి పెద్దదాన్నిచేసి చివరికేనూతికో, గోతికో ఒప్పగించదలచుకుంటే వాణ్ని గడప తొక్కించు. ఇదే నా ఆఖరుమాట. (విమల వెళ్ళిపోతుంది; అచ్చయ్యగారు నిర్విణ్ణుడై దిగాలుపడి బిడ్డవైపు చూస్తూ వుంటారు.)

8

పుల్లయ్యగారి యిల్లు

[నారాయణరావు బల్లమీద కూర్చొని 'భారత స్వాతంత్ర్యం' అనే పుస్తకం చదువుకుంటూ వుంటాడు]

చదువునేర్పగ పాఠశాల లున్నవిగావి,
చదువుకొనంగ విశ్రాంతి యేది?
సకల రోగముల కౌషధము లున్నవిగావి,
కొనితెచ్చి సేవించ ధనమదేది?
నవనవానేక యంత్రంబు లున్నవిగావి,
కార్యసాధన కధికారమేది?
ముక్కారునుం బండు భూములున్నవిగాని,
సాగుచేయగ సంఘ శక్తియేది?
అన్ని యుండియుగూడ లేవయ్యె సకట!
రైతు లొనరించినట్టి దౌర్భాగ్యమేమొ?
రమ్య సురభిళ పుష్పితారామసీమ
శ్రామికులకయ్యె భయద శ్మశానవాటి.

రెండు జాముల యెర్రని మండుటెండ
బండ చాకిరి జేయుచు కండ గరుగ
తిండి దొరకక వస్తుండి యెండిపోవు
కృషకబృందమ, లెమ్ము, నీవే పునాది

కాంత: (ఏకులబుట్ట తీసికొని రాటంవద్ద కూర్చుంటూ) ఎవర్రా అబ్బాయీ, మీమీద సాచ్చం చెప్పింది.

నారా: తాగుబోతు కొండయ్యొకడు. ఎవడు పావలా డబ్బులిచ్చి యే కూత కూయమంటే ఆ కూతగూనే పీతవాణ్ణొకడు; ఇలాంటి రకమేగా వాళ్ళకి దొరికేది.

కాంత: ఏమని చెప్పారేమిటా అక్కు.

నారా : అవ్వాళ పొద్దున విత్తనాలు గావాలని తాగుబోతుకొండయ్య పుల్లయ్య మామ దగ్గర ఉన్నయ్యేమో కనుక్కుందామని వచ్చాడట ! అప్పుడు నేనూ పుల్లయ్యమామా తలుపు బిగించుకొని, యీయింట్లోనే గుసగుస లాడుతున్నామట. "ఏమయినాసరే తప్పకుండా జమీందారుమీద కసి తీర్చుకోవలసిందే" అన్నానట నేను. "అదెంతపనిరా, మాపిటి కగ్గిపుల్ల గీసి బుగ్రుమనిపిస్తేసరి" అని పుల్లయ్యమామ అన్నాడట. ఇదంతా వాడు తలుపుచాటున వుండి విన్నాడట. ఆరాత్రే యిల్లు తగులబడిందట.

శాంత : అయ్యో, వాడమ్మకడుపుగాల; ఎక్కడన్నా మనింటికి మనమే నిప్పెట్టు కుంటామట్రా ! అదెట్టా నమ్ముతార్రా అబ్బాయీ, ఇంతిద్దూరమా ?

నారా : 'ఆ తగలబడింది యెవరిల్లురా' అని కోర్టువారతన్ని అడిగితే "అది జమీందారుగారి యిల్లండీ; ఇదివరకు వారి నౌకరుంటూ ఉండేవాడు. ఇప్పుడు ఖాళీగానే వుంటూం"దని చెప్పాడు. అది జమీందారిల్లనికాక వాళ్ళు మన యిల్లని ఒప్పుకుంటారా అమ్మా. ఈలాగే మేము నిప్పెడు తూంటే చూశాడట సీతన్న. ఏముందీ వాళ్ళు వాగమన్నట్లల్లా వాగారు.

శాంత : అళ్ల మనస్సెట్టా ఒప్పిందో యింత పచ్చి అబద్దాలాట్టానికి.

నారా : (చిరునవ్వుతో) అబద్ధసబద్ధం నీబోటి వాళ్ళకుగాని తాగుబోతులకు లంచగొండులకు అబద్దాలు సబద్దాలేమిటమ్మా, గొంతులుగోయడాని క్కూడా సిద్ధమౌతారు.

శాంత : నిజమేనయ్యా వచ్చినాళ్ళు. దేనికన్నాతయారౌతారు, మీరు మాత్రం ఒంటరిగా తిరగబాకండయ్యా.

నారా : (పుస్తకాలు వెదుకుతూ) సరేగాని అమ్మా, నాపుస్తకం ఒకటి వుండాలి కనబడదేం ? ఎర్రట్టది. లావుగా ఉంటుందే. అది

శాంత : ఆఁ మరిచిపొయ్యా. ఏదోగాని ఒక పుస్తకం యిమలమ్మ పట్టుకెళ్లిం దిరా ? వచ్చినకాడినుంచీ ఆపిల్ల కండ్లన్నీ పుస్తకాలమీదే వుంటాయి.

నారా : (నవ్వుతూ) నీకు రాట్నంమీద ఉన్నట్లు.

శాంత : నాబతుకేచెప్పు. కాకపోతే తల్లిలేదన్నమాటేగాని. ఆ అమ్మాయికేం ? మహారాజబిడ్డ.

నారా : మహారాజాబిడ్డలకేం చాలమంది ఉన్నారు. కాని యీ తెలివితేటలు యీ మంచితనం వుండటంమాత్రం అరుదు.

శాంత : మంచితనమేమిట్రా ? ఈ రోజుల్లో నాలుగుడబ్బులుంటే అంత అదిరిపడి చస్తారా ? నాకింతుందని ఒక మిడిసిపాటా ? ఎచ్చా ? ఎంతవిదానం ! ఎంత కలుపుగోలుతనం ! ఎప్పుడూ అమ్మమ్మా, అమ్మమ్మా అంటూ నోరు కాయగాయనివ్వదురా తల్లి.

నారా : సామాన్యంగా డబ్బుంటే హృదయముండదు. హృదయముంటే డబ్బుం డదు. ఆ అమ్మాయిలో మంచిలక్షణాలన్నీ వున్నాయి. అదేవిశేషం.

శాంత : మంచి లచ్చనాలంటే గేపకంవచ్చింది. మొన్న ఒకమ్మాయి మూడ్రెళ్ల గుడ్డనెత్తుకొని జానెడుగుడ్డ మొలకు చుట్టుకొని అడుక్కోడాని కొచ్చిందిరా మనింటికి. ఆ బిచ్చపుదాన్నిచూచి ఉసూరుమని యింటికి తీసికెళ్ళి కడుపునిండా అన్నంబెట్టి, చీరెయిచ్చి ఒక రూపాయిడబ్బులు కూడా యిచ్చి పంపిందిరా.

నారా : నీకివ్వాళ తెలుసుగాని నాకు మొదటినుంచీ తెలుసు, మేం చదువుకునే రోజుల్లో గూడా పేదాసాదా అంటే యెంతో జాలిపడేది.

శాంత : పాపిట్టిదేవుడేదో వక కొరత పెడతాడు.

నారా : దానికేం జేస్తాంలే ? వాళ్ళ నాన్నగారయినా చాలా ప్రేమగానే చూస్తా వుంటాడు తల్లిలేనిలోటు కనపడకుండా.

శాంత : ఆ పాపం నేనెక్కడ ఒడిగట్టుకునేది. ఏమాటకామాటే సెప్పాలి. ఆయనగారుకూడా బైట ఎన్నిగంతులేసినా ఆ పిల్లంటే పంచప్రాణాలూ యిడుస్తాడు. (వింగ్‌లో విమలనుజూచి) యిమలమ్మా, రా, అమ్మా, రా, కూచో, నాలుగురోజుల్నుంచి యెక్కడా అజా పజా లేవు.

విమల : ఏదో కొంచెం పనివుండి రాలేకపొయ్యాను. ఇవ్వాళ అప్పుడేరాట్నం బెట్టావే ! భోజనాలయినాయా ?

శాంత : ఇయ్యాళ వాయిదాగా అమ్మా. అబ్బాయి పూరికెల్తాడని పెందలాడే వంటచేశా ? అప్పుడే నాన్నగారి భోజనమయిందీ ?

విమ : అ, భోంచేసి బండిమీద గోవిందపురం వెళ్ళారు.

నారా : (పుస్తకం జూస్తూనే) ఎందుకో ఎండలో వెళ్ళారు ?

విమ : ఎందుకా ? రావాలిసిన అప్పులూ పప్పులూ ఉంటాయిగా మరి

నారా : ఓహో !

శాంత : ఏమమ్మా, ఆరోజుకారోజు అట్టా అవుతున్నావేం ?

విమ : ఏం ? ఎలావున్నాను ? బాగానే వున్నాగా ?

శాంత : బాగానే వుండాగా అంటావేంది ? అట్టా తెల్లగా పాలిపోతా.

నారా : మనస్సుకేమి పాలుపోక పాలిపోతుందేమో ?

శాంత : సరేగాని యిమలా, పెండ్లటగా, ఎప్పుడమ్మా.

విమ : (విసుగ్గా) ఏమిటమ్మమ్మా, ఎప్పుడూ పెండ్లి పెండ్లి. పెండ్లి పెటాకులూ.

శాంత : ఏమోనమ్మా, జమీందారు గారడిగారట. మీనాయన ఒప్పుకున్నాడట ? లోకులనుకుంటున్నారు.

విమ : అడగడానికి యివ్వడానికి యిదేమీ గొడ్లబేరం గాదు. (కష్టంగా) వాడి పేరు నాదగ్గర యెత్తకమ్మమ్మా.

శాంత : పోనీలే, అపూనివ్వడెందుకులే.

నారా : ఆపుస్తకం చదవడం పూర్తిఅయిందా ?

విమ : అయింది. కాని....

నారా : కాని .... ఏదో ధర్మసందేహం కలిగినట్లుందే.

విమ : ధర్మమో, అధర్మమో, సందేహంమాత్రం కలిగింది.

నారా : ఏమిటది ?

విమ : "జమీందారీ విధానాన్ని సంస్కరించి తేవాలు". అంటాడు గ్రంధకర్త ఇందులో మీ అభిప్రాయమేమిటి ?

నారా : అది కేవలం భ్రమ.

విమ : అయితే యేం జెయ్యాలని.

నారా : దేశం సుఖిశంగా వుండాలంటే ఆవిధానమే రద్దుకావాలి.

విమ : సంస్కరిస్తే దేశం సుఖిశంగా వుండదా ?

నారా : అసలు సంస్కరిచడమే అసంభవం.

శాంత : ఏమిటమ్మా అది.

విమ : ఈ జమీందారుపద్ధతే వుండగూడ దంటారమ్మమ్మా

శాంత : పోతేబాగానేవుండుగాని, అనాది నుంచీ వచ్చేది యియ్యాల పొమ్మంటే పోతందా ?

నారా : మొదటినుంచివచ్చే ఆచారాలన్నీ తల్లకిందు లవుతున్నాయని నీవే అంటావుగా. అలాగే యిదీ (విమలవైపు తిరిగి). ఈ విధానం అనాదినుంచీ ఉన్నదంటావా విమలా !

విమ : ఈ ప్రభుత్వమే దీన్ని తెచ్చిపెట్టిందని చిన్నప్పుడే చదివాను.

నారా : ఆ తెచ్చిపెట్టిన ప్రభుత్వంతోపాటు ఈ విధానం కూడా సెలవు తీసుకుంటుంది.

శాంత : అయితే మరి అల్లెట్టా బతకాలిరా అబ్బాయీ ?

నారా : మిగతా అందరిలాగే. చిరిగిన పాతపంచను కుడితే ఆ కుట్టుపక్కనే మళ్ళీ పిగులుతుంది. ఎన్నిసార్లు గుట్టినా అలాగే పిగులుతూ ఉంటుంది. (విమలవైపు తిరిగి) ఈ కుళ్ళిపోయిన విధానాన్ని బాగుజేయడం

అసంభవం. సంస్కరించి అతుకులుబెట్టి యెంత సరిజేసినా కొత్త చిసుగులుంటూనే ఉంటాయి. గొంగళిలో అన్నందింటూ వెంట్రుక లెందాకా యేరతాం ?

విమల : అంతేనంటావా ?

(పుల్లయ్య ప్రవేశం)

పుల్ల : నారాయణా, మనకు బయలుదేరే వేళయింది. ఇంకా కూర్చున్నావేం ?

నారా : లేదు పుల్లయ్యమామా నీకోసమే యెదురు జూస్తున్నా. వెళ్ళదాం కూర్చో.

(పుల్లయ్యగారు బల్లమీద కూర్చుంటాడు)

నారా : (లేచి, తన చేతిలోవున్న పుస్తకం సంచిలో పెడుతూ) అమ్మా నాబట్ట లేవే ?

శాంత : ఇవిగో తెస్తన్నా
(లోపలికెళ్ళి ఉతికినబట్టలుతెచ్చి సంచిలో పెడుతూవుంటుంది)

విమ : అలాగాదమ్మమ్మా. (శాంతమ్మ చేతిలో బట్టలుతీసికొని సరిగ్గా మడత పెడుతుంది. సంచిలోవున్న పుస్తకాలు బైటికితీసి ముందు బట్టలూ తర్వాత పుస్తకాలూ బెట్టి శాంతమ్మ కిస్తుంది)

శాంత : ఏరా నాయనా యివ్వాళేగా తీర్పు. ఏమవుతుందో ?

నారా : ఏమో ? ఏమి చెప్పగలం?

శాంత : పాపమని మనల్ని దగ్గిరకు దీసినందుకు మనపుల్లయ్యకు కూడా కష్టాలు వచ్చినై.

పుల్ల : ఆడికంటే నే సుఖంగాపెరిగానా యేం అక్కయ్యా ? ఆడితోపాటు నేనూ మునగానాం తేలానాం. వస్తే యిద్దరం వస్తాం, పోతే యిద్దరం పోతాం.

శాంత : ఏమోనాయనా, మీ యిద్దరూవుంటే యెప్పుడూ యేదోవకటి చదువుతూ పాడుతూ సందడిగా వుండేవారు. (సంచి నారాయణరావు చేతికిస్తూ) మళ్ళీ మీరు వచ్చిందాకా బిక్కుబిక్కుమంటూ ఒక్కదాన్నే పడి వుండాలి.

విమల : నేమలేనా అమ్మమ్మా, నీకు జత. బిక్కుబిక్కుమంటూ యెందుకు పడుండాలి.

నారా : ఔను. విమల ఉందిగా అమ్మా, నీకుతోడు.

(పుల్లయ్య, నారాయణరావులు లేచి రెండడుగులేస్తారు.)

శాంత : అగండయ్యా, (లోపలికెళ్లకుంది. పుల్లయ్యా, నారాయణరావాగుతారు. ఒక చిన్న మూటదీసికొని బైటికొచ్చి) ఇదిగోరా నాయనా (అని చేయి జాచుతుంది)

నారా : (అందుకుంటూ) ఏమిటమ్మా యిది ?

(విమల తల్లీ కొడుకులవంక దీనంగా జూస్తూవుంటుంది)

శాంత : ఏమీలేదు నాయనా, నాలుగు బూరెముక్కలు. దారిలో యేటిదగ్గిర చేరి రెండూ తిని, కాసిని నీళ్లుతాగి పోండి.

నారా : (సంచిలో బెట్టుకుంటూ) రామయ్యా వాళ్ళేరీ పుల్లయ్య మామా !

పుల్ల : చెరువు గట్టుమీద ఉంటాం రమ్మన్నారు.

నారా : సరే. నడవండి. (ఇద్దరూ నాలుగడుగులు ముందుకేస్తారు. విమలా శాంతమ్మలు కూడా రెండడుగులు ముందుకేసి ద్వారంబట్టుకొని దీనంగా చూస్తూ నుంచుంటారు.)

నారా : (వెనక్కు తిరిగి) ఉండండి వస్తాం.

శాంత : నాయనా పుల్లయ్యా, ఇంకా చిన్నతనం. ఆడసరే మొండి ధైర్యం జేస్తాడు, పొద్దుగూకిన తరవాత రావాకండయ్యా.

పుల్ల : అల్లాగే అక్కయ్యా. మేమంతా లేమూ, (ఇద్దరూ వెళ్ళిపోతారు)

(విమలా శాంతమ్మలు అలాగే నుంచొని వుంటారు.)

— తెర —

9

దివాణం :

[చక్రధర్రావు - రామ్ విస్కీ తాగుతూ వుంటారు]

చక్ర : తాగి తందనాలాడతానట. ఎదవ; నాసొమ్ము నేను తాగుతాను. తలకు బోసుకుంటాను. వీడమ్మా మొగుడిసొమ్మా. నన్ను దేవుడిలా పుట్టించాడు.

రామ్ : (మరల త్రాగును) ఎద్దుముద్దీ పొడుచుకునే అగచ్చిగాలకేం తెలుసు దొర గారి దర్జా. అసలు మనిషైపుట్టి మచ్చుకు మరచెంబయినా తాగలేని నన్నాసివి అచ్చంగా చచ్చు వెధవల్లో జమ కట్టాలిసిందే ? (తాగుతూ వుంటాడు.)

చక్ర : బలేమాట జెప్పావు. బుర్రఅంటే నీది బుర్ర. బృహస్పతికి కూడా లేదు.

రామ్ : సుర తాగితే దొరఅవుతాడు. దేవతలదొర దేవేంద్రుడు. ఎట్టాఅయ్యాడు అందరికంటె అదనంగా తాగితేనే. తియ్యమనండి శాస్త్రాలు.

"సురతాగెను దేవేంద్రుడు
సురతాగియె కాళిదాసు కూరుండయ్యెన్
సురయే సాక్షాదమృతము
సురతాగనివాడు భువిని సూకరమేరా"—

మోహన్ : (ప్రవేశిస్తూ) సందుదొరికితే అందలమెక్కుతావురా సన్నాసి. ఏముందిరా శాస్త్రాల్లో పెద్ద తెలిసినట్టుగా. రంభలేనిదే రాజెట్టా అయ్యాడురా ?

చక్ర : హలో. బ్రదర్. మోహన్. వచ్చావంటరా, వచ్చావా ? తెచ్చావా ?

మోహన్ : ఓ. యస్.

రామ్ : అచ్చారేబచ్చా. ఎక్కడ దించావురా రంభని (విస్కీగ్లాసు మోహన్‌కి అందిస్తాడు ?)

మోహన్ : ఎక్కడేమిట్రా ? రాజాగారి రంగుల మేడలో.

చక్ర : మోహన్, బలేవాడవురా. గుండెలు దీసిన బంటువి. నీకు మన యెస్టేటులో దివాన్‌గిరీ యేస్తాము.

మోహన్ : హి హి హీ, బతికుండగా అనుభవించాలి రంభని. చచ్చాక ఏముందిరా శ్రాద్ధం.

చక్ర : పరస్త్రీని అంటుకుంటే పాపమంట. వేదాంతం! చేతగాని వేదాంతం!

రామ్ : అసలు వేదాంతం ఆ యెదవలకేం తెలుసు? (మోహన్ వైపు చేయి జూపి) ఈ యెదవకేంతెలుసు?

"దురితము సుకృతముగానీ
అరయగ జీవునకెగాని వ్యక్తులకగునే?
నరదేహము జడవస్తువు
గురుతెరిగిన వారికిదియె - తిరుమంత్రమగురా
గురుశిష్యులకూ యిదే - పరమార్ధమగురా"

చక్ర : ఓరీ నీ వేదాంతం మండ. నీకన్నిట్లోనూ అనుభవముందిరా. అరే మోహన్, నీకుగాదురా దివాన్‌గిరీ. రామ్ కిచ్చాము.

(ముగ్గురూ నవ్వుతారు)

రామ్ : (దివానులాగా ఠీకుగా నుంచొని) అరే మోహన్, నీ వెళ్ళి వంటవాణ్ణి పలావ్‌కు కావలసిన సామానుతోసహా వెంటనే రంగుల మేడకు పంపించు. ఊ, మంచి సిల్కుచీరెలు, ఫస్టులావ్ సెంట్లు వైట్‌హార్సు నాలుగు బాటిల్సు........అంతా సిద్ధంజేయించు పో. ఇది దివాన్‌గారి ఆర్డర్ - జాగ్రత్త

మోహన్ : (నౌకరులాగా భయభక్తుల నభినయిస్తూ దణ్ణంబెట్టి) చిత్తం చిత్తం. (నవ్వి వెళ్ళిపోతాడు.)

చక్ర : దివానంటే అలావుండాలి. నీ తలకాయలో తెలివి చెవులగుండా కొద్దిగా బైటికి పోతోందిగాని, లేకపోతేనా? తిమ్మరుసు నీకు బలాదూర్. (నవ్వుతూ యిద్దరు సిగరెట్లు వెలిగిస్తారు)

(వెంకన్న ప్రవేశించి దణ్ణంబెట్టి నుంచుంటాడు)

రాం : పర్లా బాగుందిరా?

వెంక : (చేతులు గట్టుకొని రెండడుగులు వెనక్కేసి భయంతో) పండగఘాదూ, కాత్తి ఆలెస్సమయిందండీ.

చక్ర : పండగయితే........

వెంక : పండగ పండక్కీ అచ్చయ్యగారింటికాడ ఒకపూట అన్నమెడతారండి. ఇవ్వాళ బుల్లెమ్మగారు కాత్తి ఆలెస్సంగా బెట్టిందండి.

రామ్ : ఎవర్రా బుల్లెమ్మగారు?

వెంక : వినపడక చెవియొగ్గి నుంచుంటాడు)

రామ్ : (బిగ్గరగా) అరే యెవర్రా బుల్లెమ్మగారు?

వెంక : (ముసిముసి నవ్వులతో) అచ్చయ్యగా రమ్మాయండీ. సిన్న దొరసాని గారు.

చక్ర : అప్పుడే చిన్నదొరసాన్ని జేశావు?

రామ్ : మోహన్ సాన్నిదెస్తే వెంకన్న దొరసాన్ని దెచ్చాడు. బాబుగారి పేరు చెప్పితే వొర్రు.

చక్ర : సరేగాని వెంకన్నా, ఆ అమ్మాయి అచ్చయ్యగారి లాగే వుంటుందా?

వెంక : (చేతులు నలుపుకుంటూ సంతోషంగా) మాపెద్ద చెయ్యండి

చక్ర : ఛీ, చెవిటి వెధవా.

(వెంకన్న వులిక్కి పడతాడు. ఇద్దరూ నవ్వుతారు. జమీందారు వెంకన్నను చేతితో దగ్గరకు బిల్చి)

చక్ర : అరే, ఆమెగారు అచ్చయ్యగారి లాగా వుంటుందా?

వెంక : హి హి హీ, అచ్చయ్యగారికి మల్లేనా? ఆయనకంటె నేనో కొన్నె మెరుగు గాదండి? ఆ దొరసానెక్కడండి? సబ్బు తల్లే. సుక్కల్లో తంద్రుడు. కన్నొంకా, కాలొంకా,? పచ్చగా దబ్బ పండులాంటి వన్నె, చారెడు చారెడు కళ్లు, నాగుబాములాంటి జడ యెట్టావుంటుంది! దేవగన్నిక.

రాం : ఆఁ ఆఁ

చక్ర : అంతబాగా వుంటుందా యేమిట్రా ఆమెగారు?

రాం : చెప్పడం మాత్రం చమత్కారంగావుంది.

వెంక : ఏమిటండీ అట్టా అంటారు? తప్పి పుట్టిందిగాని అప లేదొరలింట్లోనో పుట్టాలిసింది. బుద్దేమి బుద్ది వరాల బుద్ది. (చేయి జూపెడుతూ) చారెడు నేయి బోసింది తల్లి బుట్టెడు పూలెట్టుకోని వవలచ్మి

(ఇద్దరూ నవ్వుతారు)

చక్ర : ఇంతనేయి బోస్తే మొద్దులాగా, తినిరావడమేనా వెధవా, ఒకనాడిన్ని పూలు తీసికెళ్లి యివ్వరాదూ,

రాం : (ఠీవిగా) అరే మనతోటలో వున్నాయిగా తీసికెళ్లివ్వు.

వెంకన్న : (సంతోషంగా) చిత్తం చిత్తం. అట్టాగే పట్టుకెల్తానండి.

(వెళ్లిపోవును)

చక్ర : వెంకన్నగారుకూడా ఒక కవై పోయాడే?

రామ్ : అదికి చదువే రాదుగాని అదేవుంటే ఆస్థాన పండితుడుగా అప్పాయంటు చేయక పోయారూ ఈ దివాన్‌గారు సరేగాని అచ్చయ్య గారికి మొగపిల్లలు లేరా అండి?

నాగేం : (ప్రవేశిస్తూ) లేరు. ఒక్కతే ఆడపిల్ల.

రామ్ : చాలా బ్యూటిఫుల్‌గా వుంటుందటగా ఆమెగారు?

నాగేం : అందం సరే. పాట!

చక్ర : సంగీతజ్ఞానం కూడా వుందా యేమోయ్!

నాగేం : అంత చక్కనిపాట. నే నెప్పుడూ వినలేదు. మీరుకూడా విని ఉండ రనుకుంటాను.

రామ్ : అయితే రాగం ఆలాపిస్తే గాళ్ళుగరగాలిసిందే?

చక్ర : ఇంగ్లీషుకూడా చదువుకున్నదనుకుంటాను.

నాగేం : ఇంగ్లీషేనా? ఆమెగారితల్లి ప్రయివేటు మాష్టర్ని బెట్టి హిందీకూడా చెప్పించింది.

రామ్ : ఆయితే అన్నిట్లోనూ మన నాణానికాగిన ఆణిముత్యమన్నమాట.

చక్ర : అంత తెలివిగలాబిడ గాబట్టే తండ్రితో అవిధంగా మాట్లాడగలుగుతుంది.

నాగేం : ఏం మాట్లాడినా తమకెదిరించి ఎక్కడికి పోతుందిలెండి? అన్ని విధాల ఆ అమ్మాయే మీకు తగింది.

రామ్ : అచ్చా. కొద్దిరోజుల్లో మళ్ళీ మాకొక దిన్నరు తగిలిందన్నమాట.

నాగేం : ఇంకా "అన్నమాట" ఏమిటి? ఆమెగారిని మన దొరగారిపక్కన కూర్చోబెట్టకుండా యీ నాగేంద్రం నిద్రపోతాడా? (జమీందారువైపు జూచి) ఆస్తిమాత్రం? విలవరబ్బుతోనే ఒక వూరుకొనేయ్యొచ్చు.

చక్ర : అందుకేగాదటోయ్. యిన్ని తంటాలుపడేది? వెంకన్న చెప్పినట్లు ఒక్క వనలక్ష్మిగాదు. ధనలక్ష్మికూడా.

రామ్ : బలేప్లాన్. (చిటికేస్తూ) దెబ్బకి రెండు పిట్టలు.

నాగేం : కోర్టు టైముకందుకోవాలి. వెళ్ళతాను.

చక్ర : ఓహో! యివ్వాళేగా వాయిదా?

నాగేం : ఇవ్వాళతో మనకొవిరగడై పోతుంది.

రామ్ : దేవయ్యలిద్దరూ దేవతావులను రుచిచూస్తారన్నమాట.

చక్ర : (వికటంగా నవ్వుతూ) రెండోకంటికి తెలియకుండా ఎంత జాగ్రత్తగా చిచ్చుబెట్టాడోయ్ మన పిల్లిభీముడు.

నాగేం : అమ్మమా! ఇలాటి పనులుజేయడానికి వాడు అందెవేసిన చెయ్యండోయ్.

రామ్ : వాడికి తర్ఫీదెవరిదీ. దివాన్‌జీగారిది.

చక్ర : ఇంతకూ శిక్ష పడేనా?

నాగేం : నేను కేసు నడపడం. తమరు ఆఫీసర్ని కలుసుకోవడం.........

రామ్ : నేను సాక్ష్యం తయారుజేయడం. శిక్ష పడకపోవడమూనా?

చక్ర : ఎంత ఖర్చయినాసరే వాణ్ణి గోదావరి నీళ్ళు తాగించాలి.

నాగేం : పాపం! వాడొక్కడే తాగుతాడా? తన స్నేహితుడు పుల్లయ్యను వదలిపెట్టి.

చక్ర : నే నింట్లోనుంచి వెళ్ళగొట్టడం. మొనగాడులాగా వాణ్ని తన యింట్లో చేరనివ్వడమా!

రామ్ : తమ తడాఖా ఆ బ్రూట్‌కేం తెలుసులెండి.

చక్ర : ఇప్పుడేకుస్తూవుండాలి - ఎందుకు జేరనిచ్చానా వీణ్ణని.

రామ్ : ఏడవాలిసిందే. వెర్రిమొగాలందరూ యీ దెబ్బతో కాళ్ళబేరానికి రావాలిసిందే.

నాగేం : వాడి తిక్క బాగానే కుదిరిందిగాని, దున్నపోతుల్లాగా తెగ బలిసి వాళ్లెయ్యమన్న గంతల్లా వేసేరకం యింకా లేకపోలేదు.

రామ్ : చూస్తారేం? వన్నాసుల్ని సున్నపుగానుగ కట్టి తిప్పక?

నాగేం : వాళ్ళు మళ్ళీ తిరిగి వచ్చేలోపల వీళ్ళ భరతంకూడా పట్టాలి. అప్పుడుగాని కుక్కిన పేనుల్లాగా........

రామ్ : కిక్కురుమనకుండా పడివుండరు.

చక్ర : ఒక్కొక్కణ్ణి పరవదోలి వేటాడాలి.

నాగేం : తమరి సెలవే గావాలిగాని........

చక్ర : ఇంకా నా సెలవేమిటి? నీ యిష్టంవచ్చినట్లు చేసేయ్. నీకత్తి కెదురు లేదు పో.

రామ్ : ఇక జూపవయ్యా నీ తమాషా.

చక్ర : ఒకవేళ బ్రతికి బైటబడ్డా, వాడి వూరూ పేరూ తల్చేవా డుండగూడదు తెలిసిందా ?

నాగేం : చిత్తం. టైమయింది వెళ్ళివస్తాను.

చక్ర : (రిస్టువాచి చూచి) అరే ! టైమయిందే. పెద్ద గుఱ్ఱాన్నేసుకెళ్ళు.
(నాగేంద్రం దణ్ణంబెట్టి వెళ్ళిపోతాడు)

వెంకన్న : (ప్రవేశించి) అచ్చయ్యగారొత్తున్నారండి బాబు.
(వెంటనే రామ్ గ్లాసులు విస్కీబాటిల్సు బల్లకింద బెట్టేస్తాడు. జమీందారు ఠీవిగా గూర్చుంటాడు - వెంకన్న బైటికెళ్ళిపోతాడు.)
(అచ్చయ్యగారి ప్రవేశం)

రామ్ : ఓ, తాతగారా, గుడ్ మార్నింగ్, దయచేయండి.

చక్ర : రాండి, రాండి. కూర్చోండి (కుర్చీ జూపుతాడు)
(ఈవాలకమంతాజూచి చీదరించుకుంటూ అచ్చయ్యగారుకూర్చుంటాడు)

చక్ర : అచ్చయ్యగారూ, ఇవ్వాళతో మీపీడా, మాపీడా, అందరిపీడా వదిలినట్లే.

అచ్చ : తమరు తల్చుకుంటే కానిపని ఒకటుందా ?

రామ్ : మూతీ గడ్డం నెరసినా ముచ్చటగా సెలవిచ్చారు.

అచ్చ : (అసహ్యభావం బైటికి గన్పడకుండా అపుజేసుకొని) కాని పుల్లయ్యను కూడా కేసులో పెట్టడంవల్ల - ఎంత లేదన్నా వాళ్ళదీ పదిమంది గల కుటుంబమా ? అయినవాళ్లు గాబట్టి అంతా తెగబడ్డారు. ఇదివరకు అటూ యిటూ గాకుండా ఊగిసలాడుతున్న రకం అంతా అటే మొగ్గారు.

చక్ర : మొగ్గుతారు. మొగ్గుతారు, ఎందుకు మొగ్గరు ? చూస్తారుగా వాళ్ళగతి. ఒక్కొక్కడు చిన్నప్పుడు తాగిన దొండాకు పసరు కక్కాలి.

రామ్ : అంతగా గాకపోతే కొంచెం భేదిమందు తగిలిస్తేసరి (వెకిలిగా నవ్వుతాడు)

అచ్చ : (గంభీరంగా) కాని పరువుమర్యాదలు నిలబెట్టుకునే విషయంలోమాత్రం పరాకుగా వుండగూడదు. వస్తాను. (కుర్చీలోనుంచి లేస్తాడు)

చక్ర : అచ్చయ్యగారూ, మన వ్యవహారమెంత వరకు వచ్చిందండీ ?

అచ్చ : (వ్యంగ్యంగా) మన వ్యవహారం త్వరలోనే తేలిపొయ్యేటట్లు కనపడుతూంది. కాకపోతే పదిరోజులలో యిటో.

చక్ర : సరే, కానివ్వండి.

అచ్చ : వస్తాను, సెలవు. (వెళ్ళిపోవును)
(జమీందారు ఆలోచిస్తూ అచ్చయ్యగారివైపు తదేకదృష్టితో చూస్తూ వుంటాడు. రామ్ జమీందారువైపు ఎగాదిగా జూస్తూ వుంటాడు.)

10

బెజవాడ రైల్వేస్టేషను సమీపంలో

[నారాయణరావు పుల్లయ్యగార్ల యిరువురిచేతులు కలిపి సంకెళ్లువేసి యిరువైపులా పోలీసులు నడుస్తూవుంటారు. ఎదురుగా తల్లీ, కోటయ్య, వీరయ్య మరి కొందరు కలిసి ప్రవేశిస్తారు. పుల్లయ్యా నారాయణరావుల్ని చూడగానే తల్లి దుఃఖంతో అపురుమని నారాయణరావును కౌగిలించుకుంటుంది. మిగతా వారంతా విచారంగా నుంచుంటారు.]

పోలీసు : ముసలమ్మగారూ, ఎడంగా వుండండి. అలా మీద బడగూడదు.

కాంత : (ఏడుస్తూ) అయ్యో నాయినా !

నారా : అమ్మా, తెలిసినదానవు. నీవే యిలా విచారపడితే యెలా ? మూణ్ణెల్లూ ఒక త్రుటిలోగడిపిరామూ. ఏడవకమ్మా, ఇది విచారించవలసినసమయంకాదు.

కాంత : బాబూ, యీ మూడురోజులూ మూడు యుగాలుగా వుంది. మూణ్ణెల్లు ఎట్టా పొద్దుగూకనూ, ఎట్టా తెల్లారనూ. (పుల్లయ్యా నారాయణరావుల సంకెళ్ళచేతులు పైకెత్తి) నాయనలారా, మీచేతులకా యీ సంకెళ్ళు. ఎవరికొంపలు తీశారని, ఈచేతులతో యెవరి నోటికాడ కూడుపడదోశారని?

నారా : ఒకళ్ళ నోటికాడ కూడు పడదోసినందుకుగాదు ! ప్రజల రక్తమాంసాలు పీల్చి పిప్పిచేసి కట్టు గుడ్డలతో నిలబెడుతున్న జమీందార్లను, పెట్టుబడిదార్లను, యిది మీకు తగదయ్యా. అని చెప్పినందుకమ్మా యీ సంకెళ్ళు. ఇదే మహా అపరాధమయితే, ఇదేమహాఘోరకృత్యమయితే, యిందుకొరకు యీసంకెళ్ళనేకాదు ఉరికంబాలనైతం ఎంతో ఆనందంగా కౌగలించుకోవడానికి వెనుదీయం. మీ శ్రమఫలితమే వన్నిట్టి వీరునిగా తయారుచేసింది. వీకొడుకునని చెప్పుకోడానికి నేనెంతో గర్వపడుతున్నాను తల్లీ

పుల్లి : అక్కా, ఈపాడుపొట్ట పోషించుకోడానికి మేమెవడికొంపా తగలెట్టలేదు ! ఎవడికొంపకీ కన్నం వెయ్యలేదు. పదిమందికోసం జైలుకు పోతున్నాం. అందుకోసం యీసంకెళ్ళు వేయించుకొన్నాం. ఇందులో మాకొచ్చిన సిగ్గూ, నామర్దా యేమీలేదు, మనిషైపుట్టి అట్టాంటి పనులుజేసే సన్నాసి యెవడైనా సిగ్గుపడాలి. యీసంకెళ్ళన్నా జైలన్నా మాకేం భయంలేదు. మమ్మల్ని సంతోషంగా దీవించిపంపు. అదే మాకు అండ.

పోలీ : ఏమిటయ్యా సోది. పదండయ్యా పదండి (అని నెట్టబోవును)

కోట : ఏమిటయ్యా అట్టా నెట్టేత్తారు. కాత్తి ఆగండయ్యా.

నారా : అన్నా తొందరపడకు. వాళ్ళదేముంది పాపం. అదివాళ్ళ ద్యూటీ తప్పదు. కోటయ్యన్నా, మన కాసిం ఏడీ ?

వీర : అసలే జబ్బుగా వున్నాడురా. మీకు శిచ్చబడ్డదని విన్నాక బొత్తిగా మంచం బట్టిపోయాడు.

నారా : అయ్యో పాపం.

కోట : అయినవాళ్లు మీరిద్దరూ యెళ్లిపోతే యిక మాగతేంగావాలి ?

పోలీ : ఏమిటయ్యా, అంతూ పంతూ లేనిసోది. చాల్లే పదండి.

కాంత అయ్యో బాబూ, పోతున్నారా ! (అని యేడుస్తుంది)

నారా : అమ్మా ధైర్యంగా వుండాలిగాని నీవిలా గుండె వెడితే ఎలా ?

కాంత : ఎంతగుండె రాయిజేసుకొందా మనుకొన్నా బిడ్డలగన్నతల్లి మనసు ఎట్టా నిలుత్తుందిరా !

నారా : అమ్మా ఒక్కసారి పుల్లయ్య మామసంగతి చూడు. చదువు లేక పోయినా ఎంత త్యాగం చేశాడో ! జమీందారుని లెక్కచేయకుండా మన కాశ్రయమిచ్చి, నాతోపాటు జైలుకు కూడా సిద్ధమయ్యాడు. కోటయ్య, వీరయ్య, కాసిం గార్లంతా మనతోపాటు నానా కష్టాలు పడటల్లా ? వీరందరూ నీ బిడ్డలు కాదూ ? వీరందరి కష్టాలూ నీ కష్టాలు గావూ ? వారి కోసం మనం, మనకోసం వారూ ఆహూతి కాకపోతే, మరెవ్వరౌతారు ? అమ్మా నేనొక్కణ్ణి లేనని నీకు విచారమెందుకు ? ఈ ప్రజలంతా నీ బిడ్డలు. ప్రజల కష్టమే నీ కష్టం. ప్రజల సుఖమే నీ సుఖం. రేపోమాపో మీరు కూడా జైలుకు రావాలని వస్తుంది ? లాఠీదెబ్బలకు గురికావాలని వస్తుంది. ఎన్నికష్టాలు వచ్చినా, యిది మన దేశం. వీరు మన ప్రజలు అనే సత్యాన్ని మాత్రం మరచిపోవద్దు. ఈ అగ్నిపరీక్షకు మీరంతా నిలబడి రెట్టింపుత్సాహంతో పనిచెయ్యాలి. నేను లేని కొరత తల్లివై నీవు తీర్చాలి. ధైర్యంగా నిలవండి. దురాగతాల్ని యెదుర్కోండి.

గీ॥ రైతు కార్మికరాజ్య నిర్మాణమునకు
ప్రాణముల్ నైతమున్ సమర్పణము సేయు
అనమసాహస భరతయోధాగ్రనరుల
నిమపపంకెళ్ల చెరసాల లేమిసేయు ?

(పోలీసులు తోసుకెళ్లుతూ వుంటారు. పుల్లయ్యా, నారాయణరావులు శాల్యూట్ చేస్తూ వెళ్ళిపోతారు. అందరూ నిశ్చేష్టులై ప్రతిమల్లాగా నిలబడతారు.)

11

పుల్లయ్యగారిల్లు

[కాంతమ్మ విచారంగా కూర్చొనివుంటుంది. విమల ప్రవేశం.]

విమల : ఏమిటమ్మమ్మా, అలా గూర్చున్నావు ? పొయ్యి అయినా రాజెయ్య లేదేం ? ఇంతెందెక్కినా ?

కాంత : నా కూటికేం తొందరవచ్చిందిలే అమ్మా.

విమల : అదేమిటమ్మా, అలా అంటావు ?

కాంత : ఒక్కగానొకసన్నాని, అక్కడ జైల్లోబడి అఘోరిత్తావుంటే నాకేం కూడు నయిత్తుందమ్మా!

విమల : అదేమిటమ్మమ్మా, అలా అంటావు. అన్నీ తెలిసినదానివి యీ సంగతి తెలిస్తే జైల్లో ఆయన ఎంత బాధపడతాడో కాస్త ఆలోచించు.

కాంత : అదెక్కడెక్కడ తిరిగినా ఏదో ఒకయేల కింటికొచ్చి 'అమ్మా' అని నోటార పిలిస్తే అన్ని కష్టాలూ మరచిపొయ్యేదాన్ని. ఈ నాల్గురోజుల నుంచీ యేదో అడవిలో బడ్డట్టుంది.

విమల : నీవే యిలా గుండెచెదరి కూర్చుంటే యిక పుల్లయ్య బాబాయిగారింట్లో యెంత హడలిపోతారో చూడు.

కాంత : అవునమ్మా, ఆళ్ళ యింట్లో పిల్లా జల్లా అంతా చీకు రామాయణంగావుంది ! కూడూలేదు, కుమ్మూలేదు. ఆ కడసారోడెప్పుడూ బాబు పక్కలోనే పడివుండేవాడు. రెండురోజులనుంచి జ్వరం తగుల్తాంది. మనాది బెట్టుకొన్నాడో యేమో సన్నాని.

విమ : పాపం జ్వరం తగులుతుందా కుర్రాడికి ? ఇలాంటప్పుడు మనం చెయ్యా లిసిన పనేమిటి ? ఇలా విచారంగా కూర్చోవడమేనా ? ఆ పిల్లోడికి మందూ మాకూ చూడాల్సినపని మనదిగాదూ ? నారాయణరావు వెళ్ళేటప్పుడు మనం యేమనిచెప్పాం ? మన శక్తివంచనలేకుండా మనకు చేతైన పనేదో చేస్తామనలా ?

కాంత : అన్నామమ్మా అన్నాం. కన్నకడుపు కమక అట్టా అనిపిత్తాంది.

విమ : నిజమే అనుకో అమ్మమ్మా. ఎందరు తల్లులు తమ బిడ్డల్ని దేశాని కర్పించటంలేదూ ? నీవుకూడా అలాంటి వీరమాత వనిపించుకోవాలి గాని, యిలా పిరికిపారితే యెలా ? మనమెంత గట్టిగా పనిచేస్తే వాళ్ళ కంత సంతోషంగా వుంటుంది. అంత తొందరగా బయటికొస్తారు.

శాంత : (లేచి మంచం పైకెత్తుతూ) చేయాల్సిందేమరి.... నాలోటి ముసలిది యేమిచేత్తంది. ఊరు పొమ్మంటావుంది. కాడు రమ్మంటావుంది.

విమ : అదే పొరపాటు. మనం చెయ్యాలంటే సాధ్యంగాని పని అంటూ ఒకటుందా ? ఎవరికి తగిన పని వారికే వుంటుంది. నిజంగా నీవే నడుంగట్టి నిలిస్తే కానిపనేమిటి - నీకున్న మంచిపేరుకి ?

శాంత : సరే ఏంజెయ్యాలి చెప్పమ్మా చేత్తాను.

విమ : అది నీలాంటితల్లి అనవలసినమాట. (వీరయ్యా కోటయ్యల ప్రవేశం)

శాంత : ఏమినాయనా. ఏమిటి కబుర్లు ?

వీర : ఏముంది సిన్నీ దినగండం నూరేళ్లాయుస్సు.

కోట : అయినా వాళ్ళిద్దరూ జైల్లోవడ్డారు. వీళ్ళని పట్టపగ్గాలు లేకుండావున్నాయి.

విమ : ఆదిలో అలాగేవుంటుంది. కొంచెం ఓపికతో యెదుర్కొంటే యీ కారుమబ్బులన్నీ అవే విడిపోతాయి.

వీర : ఏం విడిపోతాయో, ముందు సచ్చేరోజొచ్చింది. ఉన్న కొంచెం కాస్తి వూడిపోయేట్టుంది.

శాంత : అదేమిటి నాయనా.

కోట : ఏముంది సిన్నీ, ఆయాళ తగాదే.

విమ : ఎప్పటితగాదా అండీ కోటయ్యగారూ

కోట : అదే. శిస్తుతగాదా. మొన్న శిస్తుగట్టానికెళ్ళితే నిరుడు కట్టింది మింగి, రెండేండ్లదీ మళ్ళీగట్టమన్నాడుతానేదారు. దానిమీద కీచులాడాం.

విమ : అవును. ఆసంగతి నాకూతెలుసు. నాన్నగారు జెప్పారు.

వీర : అవునమ్మా, అప్పుడు నాన్నగారుకూడా వున్నారు.

కోట : దానికే యిప్పుడు జప్తుపెట్టి వేలంవేత్తన్నారు.

శాంత : అయ్యో నాయనా, ఎన్నితిప్పలొచ్చాయిరా !

వీర : ఆ గడ్డకాస్తా పోతే ఎట్టాబతుకుతాడో ! నలుగురుపిల్లజా అదూ—

కోట : నా కాలూసెయ్యి వల్లగావుంటే నాకు కరువేమిట్రా ? బతకలేననే చింత నాకెప్పుడూలేదు. అళ్ళపొంగు జూస్తే తలకాయ నేలకేసి కొట్టినట్టుంది. అందుకు ఏడుత్తన్నాను.

శాంత : పొంగుకాదు పొంగుకాదు. పొంగినపాలు పొయ్యపాలే లేరా !.

విమ : కోటయ్యగారన్నట్లు కష్టజీవులకు రెక్కలే ఆధారం.

వీర : ఆ రెక్కలకష్టం మాత్రం యెక్కడదక్క నిత్తన్నాదమ్మా. అరుగాలం కష్టపడ్డా శమఅంతా అడవిపాలైంది. ఒక కుంట మిరపతోటనుకుంటే ఆనోవంగా వూతాపిందెమీదుండగా పీకించేశాడు.

కోట : (వండ్లు నూరుతూ) ఎన్నాళ్ళు పీకిస్తాడు ? నూరుగొడ్లు తిన్న రాబందు ఒక్కగాలివానకు పడదంటలేరా ?

వీర : అవి పిచ్చిరాతలు. ఏం పడుతుందిరా, పదిమంది కలిసివస్తేనా ? ఒక డేటికి ఒకడు కోటికి లాగుతావుంటే ఎట్టాతగలడ్తందిరా ? సంఘం సంఘం అంటా మనమిట్టామాడిచత్తావుంటిం. అదిచుట్టూ చేరినోళ్ళ పని మూడు పువ్వులూ ఆరు కాయలుగావుండె.

విమ : ఎందుకుండదు ? నీతీ జాతీ లేకుండా అభిమానాన్ని చంపుకొని అడ్డమైనగడ్డీ గరుస్తుంటే.

శాంత : దినం గడిచింది లెక్కగాదు. తనువుగడిచిందిలెక్క.

(ఉద్రేకంగా కాసిం ప్రవేశం)

కోట : ఏమిటి కాసిం హడావుడి ?

కాసిం : హేమ్మినచ్చింది హాక్కీదపా బడితాపూజాసేస్తేగాని బుద్ధిరాదు.

వీర : ఓరి నీపావం పాడుగాను ! జరిగినదేమిటో చెప్పుముందు.

కాసిం : హేమ్మీవుంది, కుల్లాబోతు హేమ్పు హేడ్బార్.

శాంత : ఏం జరిగింది నాయనా ?

కాసిం : నాదీ గొడ్డుల్ నీళ్ళు తాగేదాన్కి చెర్వుకిపోతే దొడ్కి తోలించార్

విమల : చెరువులో నీళ్ళు తాగడానికికూ నోచుకోలేదన్నమాట మనగొడ్లు

వీర : కొంపాగోడి పీక్కొని వలసబోయే రోజొచ్చింది.

కోట : పుట్టిపెరిగిన గడ్డ వదలిపెట్టి పెళ్లాం బిడ్డల్ని వేసుకొనిపోతాడట ఎక్కడకో. ఇక్కడ మిడకడం చేతకాక.

కాసిం : పోతాద్ హడ్వీలోకి.

విమ : ఎక్కడికిపోతారు ? ఈకష్టాలెక్కడికెళ్ళినా తప్పవు. వెంటాడితీరుతాయి. ఉన్న నలుగురూ ధైర్యంగా ఒక్కమాటమీద నిలబడి ఎదుర్కోవాలి. నారాయణ పుల్లయ్యగారెవరికోసం జైలుకెళ్ళారు ? పుల్లయ్యగారింట్లో పిల్లా జెల్లా యెన్ని అవస్థలు పడిపోతున్నారు ? నారాయణరావుగా న్నాళ్లా చేయగలిగారా యీ పిచ్చిపనులు.

వీర : అదుంటే యిన్ని తిప్పలెందుకొచ్చేయి ?

భీమ : ఇవ్వాళ నారాయణరావు లేదులేదనుకొంటే యేమిటి ప్రయోజనం? మీలో ఒక్కొక్కరు ఒక్కొక్క నారాయణరావై పోవాలి. అప్పుడే నారాయణరావు మావాడని చెప్పుకునే అర్హత కలిగివుంటాం.

వీర : మీమాట వింటావుంటే అదీ నిజమేరా అనిపిత్తంది. అవతలకు బోతే మళ్ళీ అంతా అయోమయం.

కాంత : ఏమిటా అయోమయం ? నాకంటె అయోమయమా ? ఉన్న ఒక్కడుకూ జైల్లో బడ్డాడు. తలదాచుకోడానికి కొంపకూడా లేకుండా జమీందారు లాక్కున్నాడు. గిద్దడుగింజలు కొంపకొచ్చేదారి అగపడదు. అరవై యేండ్ల ముసలముండను. నారెక్కలెట్టుకొని నేను బతకట్లా ? నామాత్రం ధైర్యంలేదూ ? మిరపతోటలు పీకెత్తేయేం? యేంజే త్తేయేం? దేవుడిచ్చిన రెక్కలు తీసుకపోతాడా ? మొగాళ్ళె ! ఒక అయ్యదగ్గర కూలి జేసుకోనైనా రోజుకు పావలాడబ్బులు తెచ్చుకొని పెళ్ళాంబిడ్డల్ని బతికించుకోవచ్చే ! మనూళ్ళో అందరికి భూములేవున్నయ్యా ? లేని వాళ్ళెంతమంది బతకటల్లేదూ ? ఎందుకీ పిరికితనం ? మీ నలుగురూ ఒక మాటమీద నిలవండి. నేను ముందు నుంచుంటాను. పత్తే ముందే పత్తాను.

వీర : (ఉద్రేకంతో) ఇంత బతుకి బతికి ఆడదాన్ని -ముసలిదాన్ని విన్నుముందు బెడతామా ? చూతాం ఏంచేత్తాడో.

కాసిం : అరే మీరే హట్టావుండాలిగాని మా కొంపల్లోవున్న పదిమందీ సావుకి బతుక్కి మీతోపాటు తయార్.

కోట : చావుకి రెండు చావులా, ఏంచెయ్యాలో చెప్పమ్మా. నేనూ ముందుండేది.

విమ : చేయాలిసిందిదే. అందరూ ఒక్కమాటమీద వుండాలి. వాళ్ళే పిచ్చిపనులు చేసినా అందరూ ఒక్కుమ్మడిగా ఎదుర్కోవాలి. మిగతా కార్యక్రమం తర్వాత చూచుకొందాం. ముందు కోటయ్యగారి పొలం వేలంగాకుండా చూడాలి. అదబ్బేదో రేపే కట్టివేదాం. సంఘబలాన్నెవరూ అడ్డగించలేరు. ఒక అభ్యుదయకవి జెప్పినట్లు

“గ్రామికావళి తమ సంఘశక్తి యెరిగి
నడుము బిగియించి నిల్చి ముందడుగువేయ
మృత్యుకోరలనేన్ పెకలించివైచు
సంఘబలమునకేది అసాధ్యమిలను ?”

కాసిం : బోలో రైతుసంఘానికి జై

(తెర పడును)

12

దివాణం

[జమీందారు కుర్చీలో కూర్చొని సిగరెట్టు కాలుస్తూ వుంటాడు. పక్క కుర్చీలో నాగేంద్రం కూర్చొనివుంటాడు]

చక్ర : నాతో వైరమంటే యేమో అనుకున్నారు ? రోగం వదిలింది.

నాగేం : అహా, మొనగాళ్ళమని తలకాయకొంచెం బైటికెళ్ళబెట్టిన వాళ్ళందరికీ తగిన ప్రాయశ్చిత్తం జరిగిందిలెండి. కాని కాసింగాడున్నాడే. వాడింకా కొంచెం కుయి కుయి మంటున్నాడు.

చక్ర : వాడిని కూడా ఒక వరుస దరువు బట్టిస్తే సరి.

నాగేం : (ఆలోచిస్తూ) అంతకంటె ముందు వాణ్ణి పిలిపించి ఒక పాచికవేస్తే బాగుంటుందేమో ?

చక్ర : ఏమిటా పాచిక ?

నాగేం : మీరు మహమ్మదీయులు. వాళ్లు హిందువులు అని చీలికబెట్టి చూడాలి. అంతగా కాకపోతే దబ్బాళ కూడా పెడదాం. లొంగుతాడా వాళ్ళ పదిమంది అండాదండగా వుంటారు. లేకపోతే అప్పుడేవుంది మీరన్న పిడుగురాళ్ళ సెక్షన్.

చక్ర : ఆల్‌రైట్ ఎత్తు బాగానేవుంది.

(వెంకన్న ప్రవేశం)

నాగేం : ఏర్రా రైతులు ?

వెంక : వచ్చారండి దేవుడీ ముందున్నారు.

నాగేం : (వెంకన్నను దగ్గిరకుబిల్చి) ముందుగా కాసిం నొక్కణ్ణే రమ్మని తీసుకురా !

వెంక : చిత్తం (వెళతాడు)

చక్ర : అయితే నేను లేకుండా వుంటేనే బాగుంటుందేమో ? కాఫీ తాగివస్తాను. కానియ్యి. (వెళ్ళిపోవును)

(కాసిం, వెంకన్నల ప్రవేశం; కాసిం దణ్ణంబెట్టి పక్కగా నుంచుంటాడు)

నాగేం : వెంకన్నా, దొరగారు కాఫీ తీసుకుంటున్నారు. కాసేపు ఆగండని రైతుల్ని అక్కడే కూర్చోబెట్టు. నీవుకూడా అక్కడేవుండు. పో. (కాసింతో) కాసిం, మంచున్నావేం ? కూర్చోవోయ్.

కాసిం : హొండుక్కలేండీ.

నాగేం : పాప మీమధ్య జబ్బు వడ్డావటగా. కులాసాయేనా ?

కాసిం : హాఁ. హిప్పూహిప్పు జర్రా తిర్గుతూవుండా బాబూ.

నాగేం : కాసిం, ఎందుకోయ్ నీకీ సంఘాల గొడవ ? వాళ్ళంటే పదిమంది గలాళ్లు. మీరో రెండు కొంపలాళ్లు.

కాసిం : హైతే ?

నాగేం : ఆఁ అయితేనా ? వాళ్ళంతా హిందువులు. మంచికి చెడ్డకి ఒకళ్ళకొకళ్లు అండాదండగా వుంటారు. అవసరం వచ్చి చంకనెక్కించుకుంటున్నారు గాని. లేకపోతే మీ మహమ్మదీయుల ముఖం చూచేదెవడోయ్.

కాసిం : హిప్పూ ఆ గొడ్వహేమీ లేదూహండి. కులం. మతం తగాదాల్ కొంచెం గూడా లేకుండా, మా రైతుల్ హంతా భాయీభాయీగా హుంటుండాం.

నాగేం : ఆ........ ఇలాటివెన్ని జూచాం. మాటల్లోగాని క్రియల్లో నిలచి చస్తయ్యటోయ్. అయినా పిల్లాజిల్లా గలాడివి. నీ బ్రతుకుతెరువు నీవు జూచుకోవాలి. దొరగారితో జెప్పి రెండెకరాల కొండ్ర పట్టా యిప్పించే యేర్పాటుజేస్తా.

కాసిం : హిండుక్కహండీ నాకీ పిల్పిస్తా. అచ్చా. అచ్చా. మీకీ పేదోళ్కమూస్తే నిండా దయాహండీ. హొండుక్కలెండీ. ఇట్టా బత్కనియ్యండి. హంతేసాల్. (వెళ్ళబోవును)

నాగేం : కాసిం. నీ మేలుగోరి చెప్తున్నా. జాగ్రత్తగా ఆలోచించుకో.

కాసిం : ఫర్వాలేదులెండీ.

నాగేం : జాగ్రత్తగా ఆలోచించుకో సుమా.

కాసిం : మరేం పర్వాలేదులెండి. (వెళ్ళబోవును)

చక్ర : (ప్రవేశించి) ఏమయిందోయ్?

నాగేం : వాడెక్కడ వింటాడండి. వట్టి మొరటు ముండాకొడుకు. ఎన్నివిధాల చెప్పినా వినడే! వాళ్ళంతా మంచి కట్టుగా వుంటున్నారు.

చక్ర : ఉంటారు. ఉంటారు ? ఎందుకుండరు ? ఇదంతా ఆ ముసలిముండ నారాయణతల్లి చేస్తూంది. ఆడదికాదూ, కాస్త జాలిగా అయ్యా బాబూ అంటూవుంటే అంతా దాని వల్లో వడుతున్నారు.

నాగేం : చేస్తుంది, చేస్తుంది! కూటికి గుడ్డకూ మొఖం వాచివచ్చేదే. అచ్చయ్యగా రమ్మాయి సహాయం జేయకపోతే.

చక్ర : (ఆశ్చర్యంగా) ఏమిటి ? నారాయణతల్లికి అచ్చయ్యగా రమ్మాయి సహాయమా ? ఈ సంగతి అచ్చయ్యకు తెలుసునా ?

నాగేం : ఏమో. తెలిసినా ఆ అమ్మాయినేతికి యీయనేం అడ్డం వెళ్తాడులెండి.

చక్ర : అయితే యితడు వట్టి మమ్మీ అన్నమాట. అందుకనే యెప్పుడు కదిలించినా నీళ్లు నములుతూ వుంటాడు.

నాగేం : తమదగ్గర నిక్కచ్చిగా జెప్పలేక నీళ్లు నములడమేకాని అసలామె గట్టిగా తెగేసి చెప్పిందటలెండి.

చక్ర : అంతకాడికొచ్చిందీ ? ఏం దీని పొగరు ?

నాగేం : నుయ్యో, గొయ్యో, చూచుకొంటానని బెదరించిందట. ఇంకేముంది అచ్చయ్య గుడ్లు తేలేశాడు.

చక్ర : అయితే యిక నిరాశ చేసుకోవాలిసిందే ? నాఅంతటివాణ్ణి నోరుతెరచి అడగడం, అపిల్ల నాకెదిరించడమూనా ? ఎంత అప్రతిష్ఠ.

నాగేం : కాస్త. పదిమందినోట్లో పడ్డాక.

చక్ర : (ఆవేశంతో) ఇంతమాత్రానికే వదలిపెడతానా ?(తలవూపుతూ) చూస్తా. నయాన గాకపోతే భయాన్నయినా సాధించి తీరతా.

నాగేం : మీరు నయాన సాధించాలని చూచారుగాబట్టే యిన్నాళ్లు బట్టింది. లేకపోతే యీపాటికి కొండమీదకోతి దిగివచ్చేది.

చక్ర : ఇకజూస్తా. ఎట్లాదిగిరాదో. (సిగరెట్టూ ముట్టిస్తాడు)

నాగేం : దానికి తగిన యెత్తు వేద్దాంలెండి. ముందీరైతుల సంగతి జూడండి. (బిగ్గరగా) వెంకన్నా. రైతుల్ని బిలువు!

(అచ్చయ్యగారు ప్రవేశించి నమస్కారం జేస్తాడు)

నాగేం : రండి అచ్చయ్యగారూ, కూర్చోండి.

(కాసిం, వీరయ్య. కోటయ్యలు ప్రవేశించి దణ్ణంబెట్టి ఒకపక్కగా నుంచుంటారు)

చక్ర : కాసిం. –

కాసిం : (వినయతగా) హయ్య.

చక్ర : ఏమోయ్. నీకేదయినా యిబ్బందుంటే నాకొచ్చి చెప్పకోక వాళ్ళో యేమిటి గోలచేస్తున్నావట ?

కాసిం: గోలా? గోలాయేమ్టిహాండి? హెవ్వర్ సెప్పార్?

వీర: తనవనేమో కానేమో కాని కాసింకు రెండో గొడవ లేనే లేదండి.

చక్ర: ఏదో సంఘం పెడుతున్నావటగా కాసిం?

కోట: అవునండి, అందరం గలసి పెట్టుకున్నాం.

కాసిం: కాస్తాదాన్కీ, కూస్తాదాన్కీ, మంచీచెడ్డా లేకుండా హందర్‌మన్సీ దొర గారి హెదట్కీ రావడం మంచీకాదూ తల్సి. షంగంవుంటే షంగం పెద్దా హెళ్ళిమాటానేస్తే మంచీ అని, హందరం గల్సి హిష్టూ హిష్టూ పెట్టూకున్నామండీ.

చక్ర: ఎందుకోయ్ ఈసంఘాలు? ఏనాడున్నాయి? పనిపాటల్లేని వెధవలు పెట్టుకొనే సంఘాలు మీకెందుకోయ్. ఎవడికిగల్గిన కష్టం వాడొచ్చి చెప్పుకునేదానికి సంఘం పేరుతో యే కుర్రకుంకనో పంపిస్తారు. మీకూ ఎప్పటుకూవున్న లావాదేవీలు వాడికేం తెలుస్తాయి?

నాగేం: దొరగారు చెప్పినట్లువింటే బతికిపోతారు. ఎందుకీ సంఘాలన్నీ? మొన్న కొండయ్యవచ్చి తన యింట్లో పెండ్లిఅని చెప్పుకుంటే రెండు బండ్ల కట్టెలకు చీటి యివ్వలా?

కాసిం: కోన్, మీకి సాచ్చం చెప్పినా కొండయ్యాహాండి?

చక్ర: మేం చెప్పాలిసిందేమో చెప్పాం. తర్వాత యెవడిఖర్మ వాడిది?

కోట: అరకలూడదీసి వచ్చామండీ, సెలవిప్పిస్తారా?

నాగేం: రేపు పెద్ద దొరగారు చనిపోయిన రోజు. ఆ విషయం చెప్పడానికే దొరగారు మిమ్మల్ని పిలిపించింది.

రైతులు: చిత్తం, చిత్తం.

నాగేం: ప్రొద్దున్నే గొల్లవాళ్ళొస్తారు. పాలూ పెరుగు సిద్ధంగా ఉంచండి. పోండి.

వీర: గొల్లాళ్ళెందుకు బాబూ, పాడివుంటే మేము తెచ్చియియ్యం?

కాసిం: హేమీతేవాలహాండీ. ఉన్నా గొడ్డుల్ సొబ్బీ మర్‌గయా. అక్డా హక్డా హొక్టి అరా వున్నా మేతా లేక పాలు యిచ్చేదిలేదు.

నాగేం: చాల్లేండయ్యా సంతోషించారు. ఎన్నడన్నా ఎరుగుదురా యీ మేత కరువు, ఈ జబ్బులు.

వీర: ఇంత పాపం ఎన్నడూ ఎరగమండి. మా మాట అబద్ధమైతే యింకా అచ్చయ్యగారి నడగండి.

అచ్చ: అమాట నిజమేలేండి. ఈ యేడు పశువు చాలా నష్టమయింది. మా దొడ్డి కూడా చాలా భాగం ఊడ్చేసింది. ఒకటో రెండో మిగిలితే అవే నాలుగుధార లిస్తూవుంటే అటట్లా కాలం వెళ్ళబుచ్చుకుంటున్నాం.

నాగేం: (నవ్వుతూ) చచ్చినవి చావగా మిగిలినవన్నా యిస్తున్నాయి మీకు. వాళ్ళకది కూడా లేదట పాపం.

అచ్చ: అవును, మనం పదిగొడ్లు కలవాళ్లం గనుక కొన్ని చచ్చినా మిగిలిన వన్నా యిస్తున్నాయి. అసలు వాళ్ళకుండేదే ఒకటీ అర. అది కాస్తా చస్తే వాళ్ళకింకా యెక్కడనుంచి వస్తాయి?

నాగేం: (వ్యంగ్యంగా) ఆఁ అలాగా పాపం, బీదవాళ్ళని దయదలచి పూరం దరికి మీరే తలాకాసిని మజ్జిగ సప్లయి చేస్తున్నారుగాబోలు.

అచ్చ: దయ అనేది పుట్టుకతో రావాలిగాని యివ్వాళ కొనితెచ్చుకోవాలంటే వస్తుందా?

కోట: పోనీ ఎక్కడన్నా ఒకటీ అరా మిగిలినా వాటి ముఖాన వేయడానికి నాలుగు గడ్డిపరక లుంటేనా? ఈ యేడేమన్నా పండిందా అంటే దివాణపుపొలం కాస్తాకూస్తా అచ్చయ్యగారి పొలమేగా. మేమేమన్నా కర్రమీద కొడవలేశామా?

నాగేం: చాల్లేవయ్యా, తెలివి కలావిని బయలుదేరావు

కాసిం: మాకి తెల్వివుండి ఫాయిదా క్యా.

చక్ర: ఏమిటిసోది నాగేంద్రం? ఇంతకూ పాలు వచ్చేదా రానిదా?

అచ్చ: లేవుమొర్రో అని వాళ్లేడుస్తుంటే 'పిచ్చుక మీద బ్రహ్మాస్త్ర' మని ఆ పేదముండా కొడుకులతో పంతమెందుకండీ? మీకు పాలు కావాలసివస్తే కరువైనయ్యా?

నాగేం: కరువవడం లేకపోవడం అసంగతివేరు. మామూలు ప్రకారం పంపించా లంటారా? లేదా?

అచ్చ: అయినదానికి కానిదానికి యింత పట్టుదల మంచిదిగాదు.

చక్ర: పిలవని పేరంటానికి బయలుదేరడమూ మంచిదికాదు.

అచ్చ: ఆ సంగతి యిప్పుడే తెలుసుకుంటున్నా.

నాగేం: దానివల్ల పెద్ద మునిగిపోయేది కూడా వుండదను కుంటాను.

(జమీందారు, నాగేంద్రం నవ్వుతారు)

నాగేం: (రైతులవైపు జూచి) ఇంతకూ మీరు పాలు పంపించేదా? లేనిదా?

కాసిం : అరే, అసల్ గొడ్లూ లేదూ. చెప్తావుంటే పాలు కావాలి చెప్తావ్ హేమిటండీ.

చక్ర : (కోపంతో బల్లగుద్దుతూ) గొడ్లులేకపోతే మనుషుల దగ్గర తీసుకరాండి మాకు కావాలసింది పాలు.

(అచ్చయ్య ఉగ్రుడౌతాడు - తమాయించుకుంటాడు)

కోట : (కోపంతో కండ్లెర్రజేసి) ఏమిటీ? మనుషులదగ్గిరా? నీయింట్లో తద్దినాలకీ దివాలకీ మనుషులపాలు కావాలా? నీవెంత జమీందారు వయినా, నీకెంత డబ్బున్నా. మేమూ మనుషులమే. మాకూ చీమూ నెత్తురుంది. కొంచెం జాగ్రత్తగా మాట్లాట్టం మంచిది.

నాగేం : ఏయ్ జాగ్రత్త! ఎవరితో మాట్లాడుతున్నావో తెలుసునా

కాసిం : క్యారే - హేంటీ-మాటానేస్తావు? అరే థూ నీదీ హౌక్దీ బత్కూ-దావర్ బత్కూ.

చక్ర : అరేవెంకన్నా. ఈ గాడిదను మెడమీదకర్రేసి గెంటు. (వెంకన్న తటపటాయిస్తాడు) దెయ్యంలాగా చూస్తావేం వెధవా? గెంటు. ఊ. (వెంకన్న మెల్లగా కాసిం దగ్గిరకొస్తూవుంటాడు.)

కాసిం : ఖబర్దార్. (వెంకన్న ఉలిక్కిపడతాడు)

కోట : గెంటిస్తావ్. గెంటిస్తావు. అదీ దగ్గిరకొచ్చింది. పాపంపండింది పదండిరా. రైతులందరూ మిర్రిమిర్రిచూపులు జూస్తూ వెళ్ళిపోతారు)

నాగేం : వీళ్ళతల క్రొవ్వు పెరిగిపోయింది. కత్తికొకకండ జేల్చాలి.

అచ్చ : (లేస్తూ నాగేంద్రంతో) చాలు. అంతటితో కట్టిపెట్టు. ఈనాటి మీచర్య మానవత్వమున్న యేవ్యక్తి సహించలేదు ఇందుకు ప్రతిఫలం త్వరలోనే అనుభవించాలిసి వుంటుంది. ఓర్పుకు కూడా ఒకహద్దుంటుంది. తెగేదాకా లాగడం మంచిదిగాదు, జాగ్రత్త. (వెళ్ళిపోవును)

చక్ర : ఇందుకు....ప్ర....తి....ఫ....లం....త్వర....లోనే అనుభవించాలిసి.... వుంటుంది. ఊఁ నీవో....నేనో?

13

అచ్చయ్యగారి

[విమల కుర్చీలో కూర్చొని పేపరు చూస్తూవుంటుంది. ఉత్తరం చేత్తోపట్టుకొని ఆదుర్దాగా శాంతమ్మ ప్రవేశిస్తూ]

శాంత : అమ్మాయీ! యిమళమ్మా.

విమల : (పైదులో) ఎవరు?

శాంత : నేనేనమ్మా.

విమ : ఒహో. అమ్మమ్మా. రా.

శాంత : అబ్బాయి వుత్తరం వేశాడమ్మా. (విమలచేతికిస్తూ) ఏం రాశాడో చదువమ్మా.

విమ : (ఉత్తరం విప్పిచూచి) మనం రాసిన వుత్తరం అందిందట.
(శాంతమ్మ ఊకొడుతూ శ్రద్ధగా వింటూవుంటుంది)

విమ : (ఉత్తరం చేత్తో వెనక్కుపట్టుకొని) కూర్చో అమ్మమ్మా.

శాంత : ఎందుకులే అమ్మా, ఎళతాను. ఇంకేం రాశాడు?

విమ : (సంతోషంగా) ఏముంటాయి? .... వాళ్ళిద్దరూ క్షేమంగా ఉన్నారట, మన క్షేమం అడిగారు.

శాంత : సరేలే అమ్మా, సరే. ఇంతేనా సంగతులు.

విమ : ముందు నీవుకూర్చుంటే తర్వాత నీకో మంచిమాట చెప్తాకా.

(శాంతమ్మను చేయిబట్టుకొని కుర్చీలో కూర్చోబెడుతుంది)

శాంత : (భద్రంగా కూర్చుంటూ) చెప్పమ్మా, అదేమిటో చెప్పు.

విమ : (మరోకుర్చీలో కూర్చుంటూ) అంత మంచిమాట వూరికే చెప్పతేం? చెప్పినందుకు నాకేమిస్తావు చెప్పు.

శాంత : నీకు నేనేమిస్తానమ్మా?

విమ : ఏమీ యివ్వకపోతే వూరికే చెప్పకానా యేమిటి?

శాంత : సరే, రాటం వడకనిస్తాలే చెప్పు. (ఇద్దరూ నవ్వుతారు)

విమ : (రాగాలుతీస్తూ) నారాయణరావూ, పుల్లయ్యగారూ యిద్దరూ........

శాంత : ఊఁ, యిద్దరూ ?

విమ : పట్టుతారీకున విడుదలౌతారట.

శాంత : ఇంకా పట్టుతారీ కెన్నాల్లుందమ్మా ?

విమ : ఎన్నాళ్లెక్క డమ్మమ్మా, రేపేగా ?

శాంత : రేపేనా ? నేవియ్యాలతో యింకాయెనిమిది రోజులకొస్తారనుకుంటన్నా. విజమేనా అమ్మా ? రేపేనా ?

విమ : నీతో నే నబద్ధం జెప్పుతానా అమ్మమ్మా, రేవక్కడ విడుదలయితే యెల్లుండి పది గంటలకిక్కడి కొస్తారన్నమాట.

శాంత : అట్టాగా! అట్టయితే మనవాళ్ళందరికీ చెప్పొత్తా. కోటయ్యావాళ్ళు మళ్లీ పొలమెల్లే యాలయిందిగా. ఎల్లొస్తానమ్మా.

విమల : ఊఁ.

శాంత : ఉండమ్మా, ఉండు.

విమ : (రెండడుగులు సాగనంపి) నేనుంటానమ్మమ్మా.

శాంత : అట్టాగే, ఉండమ్మా, (వెళ్ళిపోతుంది)

విమ : (తిరిగివస్తూ హుషారుగా)

పహిడ్ - జంపె

కోయిలా కోయిలా
పాడవే హాయిగా - కోయిలా
వానంత ఋతురాజు వచ్చె మా వీటికిక
మోడైన మాతోట మోసులెత్తగసాగె
కమలపండువుగాగ కాయవలె పూయవలె ॥కోయిలా॥
కమ్మకొని యున్నయీ కారుచీకటి చీల్చ
కూలిరైతులపాలి బాల భానుండడుగో ॥కోయిలా॥

(అచ్చయ్యగారి ప్రవేశం, విమలలోపలకెళ్ళి కాఫీబట్టుకొని వస్తుంది. అచ్చయ్య కాఫీ తాగుతూ వుంటాడు)

విమ : ఏమిటినాన్నా, మొన్న చాలా గొడవ జరిగిందట!

అచ్చ : ఏముంది ? ఏదో జరిగిందిలే. వీళ్ళుమాత్రమేం తక్కువ తిన్నారా ?

విమ : రైతులు మొదట చాలా వినయంగానే మాట్లాడారటగా ?

అచ్చ : మాట్లాడారు! ఎట్లయినా వాడు జమీందారు, వీళ్ళు రైతులు. వాడు పాలు కావాలని పిలిపించి కొంత మొండిపట్టే పట్టాడనుకో, వీళ్ళుకూడా వాడి

ముఖాన్నే సరేమిరా అనకపోతే నోటితో లేదనే దానికి బదులు యిప తలికివచ్చి చేత్తో లేదంటే పోదూ.

విమ : ఎంత పనేమిరా అన్నా, రైతుల్ని బట్టుకొని జమీందారంతమాటం టాడా నాన్న.

అచ్చ : వాడికి వచ్చింది పొయ్యేకాలం.

విమ : మీరున్నారని కూడా చూడలేదటగా.

అచ్చ : ఏముందీ వినాశకాలే విపరీతబుద్ధి.

(మునిముని నవ్వులు నవ్వుకుంటూ పూలబుట్ట తీసికొని వెంకన్నప్రవేశం)

అచ్చ : ఏరా, వెంకన్నా ఏం పనిమీద వచ్చావ్.

వెంక : (వినపడక) ఏమీలేదండి పూలు.

అచ్చ : ఎక్కడివిరా ?

వెంక : మనింటికాడ మొన్న పండగపూట అమ్మాయిగారూ బువ్వెట్టలా ? ఆయాళ మద్దినాలే సెప్పారండి.

అచ్చ : ఏమిటిరా నీబొంద, ఎవళ్లు చెప్పారు ? ఏమనిచెప్పారు ?

వెంక : (నవ్వుతూ) ఎంకన్నా, ఎంకన్నా మనతోటలో ఒక బుట్టెడు పూలట్టు కెల్లి అచ్చయ్యగారింట్లో యిచ్చిరారా అని ఆయాలే సెప్పారండి. ఈ గోల్లో నేనేమరచి పోయానండి,

విమల : (కోపంగా) ఎవర్రా చెప్పింది ?

వెంక : (వినపడక) మీకేనండి.

విమ : (గద్దించి) ఎవర్రా నీతో చెప్పింది ?

వెంక : మన దొరగారుండి, బుల్లెమ్మగారూ,

విమ : (కోపంతో) దొ....ర....గా....రు దొ....ర....గా....రు (అంటూ బుట్ట తీసికొని వెంకన్నను లాగి కొడుతుంది. వెంకన్న చేతు లడ్డంపెట్టి తప్పుకుంటాడు. బుట్ట కిందబడుతుంది) దొరగారట దొ....ర....గా....రు (అనుకుంటూ బుట్ట కాలితో తన్నుతుంది)

వెంక : (తూలిపడుతూ, వెనక్కెనక్కు తారుతూ) దణ్ణముండీ బుల్లెమ్మగారూ దణ్ణముండీ (పారిపోతాడు)

విమ : (కోపంతో) పుట్టాడు పుటక. వీడి పుటక తగలెయ్య, ఇంతకూ మీరే నాన్నా, వాడికింత అలుసిచ్చింది.

(అచ్చయ్య మాట్లాడకుండా లోపలికెళ్ళిపోతాడు.... విమల కోపంతో పూలను కాలితో రాస్తూవుంటుంది)

— తెర —

14

(పుల్లయ్యగారిల్లు)

[శాంతమ్మ మినప్పప్పు చేటలోకి పోసుకొని బాగుచేస్తూవుంటుంది. విమల కబుర్లుచెప్పుతూ కూర్చొనుంటుంది.]

శాంత : పదిగంటలకే రావాలిసింది. పొద్దు నెత్తిమీదికొచ్చినా యెవరూ అంతులేరే ?

విమ : వస్తూవుండాలి అమ్మమ్మా. బండేమయినా ఆలస్యమయిందేమో ?

శాంత : ఏమోనమ్మా కోడికినాకూ తెల్లారింది. కన్నుమూస్తే ముందువాడు, వెనక పుల్లయ్య వచ్చినట్టూ, అమ్మా అని పిల్చినట్టూ కనపడేది. ఎట్టా వుండారో పన్నానులు ఆ జైలు కూడుదిని ? ఎంత చిక్కిపొయ్యారో ?

విమ : మొన్ననే కాదమ్మా ఉత్తరం వచ్చింది ? అందులో ఆరోగ్యం బాగానే వుందని రాశారుగా ?

శాంత : వాడొకడ్డురు మాత్రం చిక్కిపోతే చిక్కిపొయ్యావని రాత్తాడా. నేను మనాది పెట్టుకుంటానని నిజం తెలియనియ్యడమ్మా.

(తెరలో రైతుసంఘాలకి జై అంటూ వినపడుతుంది)

మోహన - దాద్రా

పీడిత ప్రపంచమంత నేడు మేల్కొనెన్ నేడు మెల్కొనెన్
నిదురదేల వేగలెమ్ము నీవు కర్షకా, నీవు కర్షకా
ఈగతిన్ కృశించి క్రుంగిపోవవేలరా
బాగతేల నీదుహక్కు లడుగ రమ్మురా కర్షకా ॥పీడిత॥

ఇమ్మహా దరిద్రమింక యెన్నినాళ్ళుర ?
లెమ్మధర్మమున్ యెదిర్చి పోరుసల్పర
ఎదిర్చి పోరుసల్పరా, ఎదిర్చి పోరుసల్పరా
కామితార్థ సిద్ధికిపుడె కదలిరమ్మురా
ఇపుడె కదలిరమ్మురా, ఇపుడె కదలిరమ్మురా
కర్షకా ॥పీడిత॥

విమ : అదిగో నమ్మమ్మా పాట వినపడుతోంది.

శాంత : అయితే మనవాళ్ళొచ్చే వుంటారు.

విమ : నారాయణరావు పుల్లయ్యగార్ల గొంతులు కూడా వినపడుతుంటే. (శాంతమ్మ పరమ సంతోషంగా నాలుగడుగులు ముందుకేసి గడపదగ్గిర కొచ్చి నుంచుంటుంది. విమల రెండడుగులేసి అక్కడే ఆగిపోతుంది. నారాయణరావు పుల్లయ్య యితర రైతుల ప్రవేశం) వచ్చారా అయ్యా అంటూ శాంతమ్మ నారాయణరావు పుల్లయ్యగార్ల చేతులు బట్టుకొని ఊపుతుంది, అంతావచ్చి కూర్చుంటారు. శాంతమ్మ నుంచొనుంటుంది. విమల కూడా అలాగేచూస్తూ నిలబడివుంది)

శాంత : అట్టా చిక్కిపోయారేం నాయనా ?

పుల్ల : ఏంచిక్కా మక్కయ్యా. రాత్రి సరిగ్గా నిదరలేదాయె. ఎండలోబడి నడచి రావడం ప్రయాణ బడలికవల్ల అట్టా కనపడుతున్నామేమో ?

నారా : (విమలను జూచి) నాన్నవారు బాగున్నారా విమలా ?

విమ : (చిరునవ్వుతో) మేమంతా బాగానేవున్నాం. కాస్త అమ్మమ్మే చిక్కిపోయింది.

కాసిం : అరె బాబా, సిక్కిపోవడం క్యా. మీరూ హెళ్ళిందీ మొదల్ హొక్క పూటా సరిగ్గా హన్నం తిన్నదీ హుండి. హమేషా షంగం షంగం అంటూ హెప్పూ పనిసేస్తూ వుండేదీ. హొక్క నిమిషం కూడా మాకీ కూచోనిచ్చేదీ లేదు. హామె కూచున్నదీ లేదూ హేమ్టీ సెప్పవాలె.

శాంత : నాదేముందిరా ! అంతా యిమళమ్మే చేసింది. ఏదో పదిమందిని పిలవటమేకాని ఆళ్ళకు పాటలు నేరపటం. పద్దాలు నేరపటం అంతా యిమళమ్మే. ఇదంతా ఎందుకురా అబ్బాయీ నీవు జైలుకుపోయినప్పటి నుంచీ నన్ను కన్నతల్లిని చూసినట్టు చూసిందనుకో.

(విమల కొంచెం తల వంచుకుంటుంది.)

పుల్ల : మేం మాత్రం జైల్లో వూరికే కూచున్నామా ?

నారా : పుల్లయ్య మామకూడా జైల్లో చదువుకున్నారు కాసింభాయి.

కాసిం : ఐసాబోలో క్యా మామా ?

పుల్ల : నాచదువుకేం వచ్చెగాని కాసిం, అవ్వాళ కోర్టుకొచ్చిన వాళ్ళనేచూసి యెంతోమంది అనుకున్నాం. జైల్లోకి పోయిచూస్తే అంతా వీళ్ళేరా ? ఎప్పుడూ ఇంగిలీషు, హిందీ, యింతింతలావు పుస్తకాలు చదువుతూవుండే వాళ్ళురా. మన దేశపు సంగతులు సరేనా. రష్యా. జర్మనీ. చైనా.

జపాను, ఇంగ్లండు, అమెరికా - ఒకటేమిటిరా ? వీళ్ళకి ప్రపంచమంతా తెలుసు.

వీర : ఏమిట్రో పుల్లయ్యా, నోరుతిరగని పెద్దపెద్ద మాటలు నేర్చుకున్నావే ?

కాసిం : అరే చదువ్వు మూడోనేత్రం చెప్పారుగాదూ పెద్దల్.

విమ : అమ్మమ్మా, నాన్నగారు వచ్చేవేళయింది. వెళ్లతాను.

కాంత : పోయిరా అమ్మా. (విమల వెళ్లతుంది)

కోట : (ప్రవేశించి) అరే నారాయణా, పాలు వంపలేదనే కోపంతో మన పాడిగొడ్లన్నిటినీ చంపెయ్యాలని చూత్తన్నాడురా. రాత్రి మళ్ళీ మావాళ్ళ గేదకొకదానికి మందెట్టాడు.

వీర : ఓరినీపాపం పాడుగాను ! దీనితో ఆరోదన్నమాట ఊళ్లో.

కాసిం : మళ్ళీ వచ్చుతనాన్కి కన్పెట్టి జానవర్‌లా చూస్తుండాద్, హివ్వాళ్ హారూ అయింది. రేపు హెన్మిదీ అవుతుంది.

నారా : మనమంతా తగిన జాగ్రత్త తీసుకోవాలి. తగినకట్టుదిట్టాలతో వూరికి నాలుగువైపులా కాపలా గాయాలి. ఆదొంగ ఎవడో దొరికేదాకా మనం కనుమూయరాదు.

పుల్ల : కాపలాగాని ముందువాణ్ణి పట్టుకోవాలిసిందే.

నారా : వీరయ్యన్నా, మాపటికందరూ పెందలాడే భోంచేసిరాండి. సరియైన ప్లానేసుకొని వాడిపని పడదాం.

కాసిం : అచ్ఛా, అచ్ఛా.

(అందరూ లేచిపోతూ వుంటారు)

కాంత : అబ్బాయి పుల్లయ్యా, నీక్కూడా భోజనం యిక్కడే.

నారా : (కాసిం చేయిబట్టుకొని) అమ్మా మన కాసిం పొద్దుపోయి అంత దూరంవెళ్ళి యెక్కడొస్తాడులే. మాముగ్గురికి వడ్డించు.

కాంత : అట్టాగే రాండి నాయనా.

(కాంతమ్మ, నారాయణరావు, పుల్లయ్య, కాసింలు ఒకవైపు మిగతా వారొకవైపుకు వెళ్ళిపోతారు)

15

[నారాయణరావు, పుల్లయ్య, కాసిం, వీరయ్య, కోటయ్య, సుబ్బయ్యలు కర్రలతో ప్రవేశిస్తారు]

నారా : నలుగురూ నాలుగు పక్కలా జాగ్రత్తగా కాయండి. ఎవడయినా కనపడితే సాధ్యమయినంతవరకు పట్టుకోండి. పారిపోవడానికి ప్రయత్నిస్తే కాళ్లమీద కొట్టి పడగొట్టండి; కాని చావుదెబ్బలు కొట్టవద్దుసుమా ! నేనూ, కాసిం పైపక్కన కాస్తాం. ఎట్లా అయినాసరే యీరాత్రి దొంగను పట్టితీరాలి.

పుల్ల : లేకపోతే చావగా మిగిలిన నాలుగు గొడ్లను యిట్లా చంపుకొని మనం చేసేదేమిట్రా ? సుబ్బయ్యా, నీవు తూర్పు బజారుకెళ్లరా ?

వీర : నేను శ్మశానంవైపు కాస్తారా ?

కాసిం : హరె, మీ యిద్దర్ చెరొకపక్కకి హెళ్లండి.

నారా : రా కాసిం భాయీ, పోదాం. (అందరూ వెళ్ళిపోతారు)

(నలుగురు రౌడీలను వెంటబెట్టుకొని నాగేంద్రం ప్రవేశిస్తారు. అందరూ నల్లటి ముసుగులు కప్పుకొని వుంటారు. చేతిలో కర్రలూ కత్తులూ వుంటాయి. పొంచి పొంచి అటూ యిటూ చూస్తూ అడుగులేస్తూవుంటారు.)

నాగేం : (సైగచేస్తూ మెల్లగా) ఎక్కడ ?

1వ రౌడీ : (చేయిజాపుతూ) అటూ, అటు. ఆ వాకిలిగుండా.

(కొందరి నటురమ్మని, కొందరి నిటురమ్మని సైగచేస్తాడు. అందరూ రెండు వైపులనుంచి వెళ్ళిపోతారు. రౌడీలు అచ్చయ్యగారి దొడ్లో ప్రవేశించి ముందు విమల, అచ్చయ్యగార్ల నోర్లు బిగగడతారు. అచ్చయ్యగారిని, మంచానికేసి అంటగట్టి విమలను పిల్లిభీముడు మోసుకొస్తూవుంటాడు. తెరలోనుంచి కొద్దిగా మూలుగు వినపడుతుంది. నారాయణరావు పరుగెత్తుకుంటూ వచ్చి పిల్లిభీముణ్ణి కొడతాడు. దెబ్బకు గింగిరాలు తిరిగి పిల్లిభీముడు కింద పడతాడు. విమల ఒకపక్కకు పడిపోతుంది. తక్కిన రౌడీలు పారిపోతారు. నారాయణరావు విమల కట్లు ఊడదీస్తూవుంటాడు. కాసిం పారిపొయ్యే రౌడీల వెంటబడతాడు. నాగేంద్రం వెనకగావచ్చి నారాయణరావు బుజంపైన కత్తితో

పొడిచి పారిపోతాడు. నారాయణరావు "అబ్బా" అని పడిపోతాడు. ఇంతలో వీరయ్యా కోటయ్యలు వస్తారు. వీరయ్య నారాయణరావు దగ్గిరకూర్చొని నెత్తురద్దుతూవుంటాడు.)

కోట : నీ విక్కడేవుందు. అడిచే వెళ్లాడు (పరుగెత్తుతాడు)

(పుల్లయ్య కోటయ్యల ప్రవేశం - పుల్లయ్య అయ్యో అంటూ నారాయణరావు దగ్గిరకెళ్ళి దీనంగా చూస్తూవుండగా పక్కన విమల కనపడుతుంది. 'పాపం' అంటూ పుల్లయ్య విమలకట్లు విప్పుతూవుంటాడు. కోటయ్య పిల్లి భీముణ్ని చేతులుగట్టి ఒకమూల కూలేస్తాడు. ఇంతలో తెరలో మూలుగు విన పడుతుంది. కోటయ్య లోపలికెల్లి అచ్చయ్యగారి కట్లు విప్పుతాడు. అచ్చయ్య "విమలా, విమలా" అంటూ సగం ఊడీవూడని తాళ్ల చేతులకు వ్రేలాడుతూ వుండగా ఆదుర్దాగా వస్తాడు. విమల తండ్రినిజూచి "నాన్నా, నాన్నా" అని కౌగిలించుకుంటుంది. అచ్చయ్య విమలలు పడిపోయియున్న నారాయణ రావును జూచి నివ్వెరపోతారు.)

అచ్చ : ఎంత ఘోరం! ఎంత ఘోరం! (గబగబా లోపలికెళ్ళి మంచం దీసుకొచ్చి వాలుస్తాడు. నారాయణరావును మంచం మీద పండుకోబెడతారు. సుబ్బయ్యా కాసింలు నాగేంద్రాన్ని రెక్కలుగట్టి తీసుకొస్తారు.)

అచ్చ : ఆ ఛండాలణ్ణి, పిల్లిభీముడిగాణ్ని - ధాన్యపుకొట్టు ఖాళీగా వుంది. అందులోబడేసి తాళంబెట్టండి. (నాగేంద్రాన్ని పిల్లిభీముణ్ని సుబ్బయ్య కాసింలు తీసుకపోతారు. కాసిం వెంటనే తిరిగి వస్తాడు)

అచ్చ : నాయనా కాసిం ముందు డాక్టర్ని పిల్చుకురా నేరమ్మన్నానని చెప్పు.

పుల్ల : అరే కోటయ్యా కాసిం ఒక్కడే వెళ్లుతున్నాడు. నీవు కూడా వెళ్ళరా. (కోటయ్య కూడా వెళ్ళతాడు. విమల నారాయణరావు దగ్గిరకూర్చొని నెత్తురు కడిగి కట్టునర్దుతూ వుంటుంది. అచ్చయ్య లోపలినుంచి తలకడ దిండుదెచ్చి నారాయణరావు తలకింద బెడతాడు. రైతులంతా విచారంగా చుట్టూ మూగుతారు. ఇంతలో శాంతమ్మ పరుగెత్తుకుంటూ వస్తుంది)

శాంత : అయ్యో కొడుకా (అంటూ కొడుకుమీదబడి యేడుస్తుంది.)

పుల్ల : (శాంతమ్మ చేయిబట్టుకొని లేవదీస్తూ) ఏడవకక్కయ్యా ఏడవకు. నీ యేడుపు వింటే వాడికసలే గుండె చెడుతుంది.

శాంత : (ఏడుస్తూ) నాయనా నీకెంత గతి పట్టిందిరా. ఒకసారి కన్నెత్తి చూడవూ? ఒకణ్ణి వల్లెత్తుమాటని యెరుగన్నే! ఎవడికి చేతులాడి

నయిరా నిన్ను పొడవటానికి ఇన్నాళ్లూ పెంచి పెద్దవాణ్ణిచేసి యీ పాపిట్టి జమీందారు పొట్టను బెట్టాగదరా!

అచ్చ : ఏడవకమ్మా ఏడవకు, పరవాలేదు. (చుట్టూ ఉన్నవాళ్ళనుసర్దుతూ) కొంచెం గాలిరానివ్వండి. ఎంత పనిజేశాడురా గాడిదకొడుకు జమీందారు. ఇంత పనిజేస్తాడని కలలో కూడా అనుకోలేదు.

విమ : (ఆవేశంతో) ఎందు కనుకుంటావు. జమీందారేదో తప్పి తలకెత్తుతాడని తోటిరైతుల్ని వదలిపెట్టి వాడి చంకకిందదూరి యింతవరకు తెచ్చింది నీవు కాదూ? మొట్టమొదటినుంచీ నీవు వాడి వెనుకాల తాళం వేయకపోతే వాడింతపనికి సిద్ధమౌతాడా! ఊళ్లో రైతులంతే నీకో మనుషుల్లాగా అగపడ్డారా? నీ కంటికి గడ్డిపరకలాగా కనపడే నారాయణరావే లేకపోతే నా బ్రతుకూ నీబండారం కూడా బయటబడేదే. నిన్నూ నీ బిడ్డను కాపాడడం కోసం తన ప్రాణాన్ని బలిపెట్టాడు. చూడు ఆ నెత్తురు.

పుల్ల : అమ్మాయి! ఇదేనా సమయం వూరుకో.

అచ్చ : అవమ్మా అను నీ యిష్టంవచ్చినట్లను. ఆ దుర్మార్గునితో కలిసి నేను చేసిన బుద్ధితక్కువ పనులకు నాకీశాస్తి చాలదు.

పుల్ల : అసలా నాగేంద్రంగాడేరా మన నారాయణ్ణి పొట్టబెట్టుకుంది. (కాసిం మందుల సంచితో ప్రవేశం) డాక్టరుగారేరీ కాసిం?

కాసిం : వస్తూ వుండార్.

శాంత : (నిట్టూర్పు విడుస్తూ) అయ్యో నాయనా!

పుల్ల : ఊరుకో అక్కయ్యా, డాక్టరుగారొస్తావుండారు.

శాంత : ఏరి నాయనా?

అచ్చ : అబ్బాయ్ ఒకకుర్చీ పట్టుకురారా (డాక్టరు ప్రవేశం, అచ్చయ్యగారెదురుగావెళ్ళి నమస్కారంచేసి) దయచేయండి డాక్టరుగారూ.

(డాక్టరుగారు కోటువిప్పి కుర్చీకి తగిలించి స్టెతస్కోపుతో హార్టు పరీక్షచేసి గాయం చూస్తాడు.)

అచ్చ : ఎట్లావుందండీ డాక్టరుగారూ?

డాక్ట : దెబ్బమాత్రం ప్రమాదమైనదే. అయినా ప్రాణభయం వుండగూడదు. (ఇంజక్షన్ యివ్వబోతూ వుంటాడు)

కాంత : (పిచ్చిదానివలె డాక్టరుదగ్గర కెళ్లి) నాబిడ్డ బ్రతుకుతాడా ! బతుకుతాడా నాబిడ్డను బతికించు నాయనా నిన్నే దేవుడనుకుంటాం.

డాక్టరు : ఆగమ్మా! ఆగు మరేమీ భయంలేదు.

పుల్లి : (కాంతమ్మ చేయిపట్టుకొని) నువ్వు యివతలకురా అక్కయ్యా. అంటూ అవతలకు తీసుకపోతాడు.

డాక్టరు : రోగిదగ్గర గల్లంతు చేయకూడదు. గల్లంతుచేస్తే మరీ ప్రమాదం.

కాంత : చేయనులే నాయనా. నీచేతుల్లో పెట్టాను నాబిడ్డను. బతికించు నాయనా.

అచ్చ : ఊరుకోండి కాంతమ్మగారు. భయ్యాలేదులే.

(డాక్టరు ఇంజక్షను ఇచ్చి కట్టుగడతాడు. పుల్లయ్య నారాయణరావు పక్కన కూర్చొని విసరుతూ వుంటాడు. డాక్టరు కుర్చీలో కూర్చుంటాడు. అచ్చయ్యగారు డాక్టరు పక్కన మంచాని)

అచ్చ : డాక్టరుగారూ ! ఎంతఖరీదు గల మందైనా సరే, ఎంతఖర్చయినాసరే, మీరేమీ సందేహించకండి.

డాక్టరు : దానికేమొచ్చి లెండి.

అచ్చ : మీరు కష్టమనుకోకుండా దయయుంచి యివ్వాళా రేపూ యిక్కడే వుండాలి.

డాక్టరు : మీమాట తీసేస్తానా? గాని. కొన్ని అర్జెంటు కేసులున్నాయ్. పరవాలేదు. రెండుపూటలూ తప్పకుండా వచ్చి చూచిపోతాగా.

పుల్లి : (సంతోషంగా) ఒక పక్కకొత్తిగిల్లాడండీ డాక్టరుగారూ.

డాక్టరు : స్పృహవస్తావుంది. (కాంతమ్మ, విమల మిగతా రైతులందరూ చుట్టూ మూగుతారు)

కాంత : అయ్యా! నారాయణా! (నారాయణరావు కొంచెం కళ్ళుతెరచి మళ్ళీ మూస్తాడు)

విమ : నీవు పిలవగానే కండ్లు తెరచాడమ్మయ్యా.

కాంత : ఎంతకష్టం వచ్చిందిరా నీకు.

డాక్టరు : ఏమిటాగల్లంతు. ఎందుకలా మూగారు. ఇవతలకురండి. (అందరూ వెనక్కి వస్తారు. డాక్టరూ, అచ్చయ్య మంచం దగ్గరికి వెళ్ళుతారు. డాక్టరు ఒక దోసమందు తాగిస్తా: మరేం పరవాలేదు. నాలుగు రోజుల్లో తగ్గిపోతుంది.

నారా : అబ్బా (మూలుగుతూ మరొక ప్రక్కకు తిరుగుతాడు)

డాక్టరు : (మందుసీసా యిస్తూ) అచ్చయ్యగారూ, ఒక గొన్ను నీళ్ళల్లో నాలుగు బొట్లువేసి రెండుసార్లు ఈమందు తాగించండి.

అచ్చ : ఆ బొమ్మలగొడవ నాకు తెలియదు. అమ్మాయిచేతి కివ్వండి.

డాక్టరు : (విమలచేతికి సీసా యిస్తూ) నాలుగింటి కొకసారి. ఆరింటి కొకసారి యివ్వమ్మా!

విమ : సరేలెండి.

డాక్టరు : వెళ్లొస్తా అచ్చయ్యగారు. (అచ్చయ్యగారు, పుల్లయ్య మొదలైనవారు డాక్టరును సాగనంపి వస్తారు)

నారా : (కండ్లుతెరచి మెల్లగా) వాడేడీ!

కాంత : (కళ్ళు తుడుచుకుంటూ సంతోషంగా) ఎవడు నాయనా!

నారా : వాడే ఆ దొంగ

అచ్చ : దొంగలందరూ దొరికారు. నీ ప్రాణం అడ్డమేసి మమ్మల్ని కాపాడడానికి దేవుడులాగ వచ్చావు.

పుల్లి : తర్వాత మాట్లాడుకుందాంలెండి అచ్చయ్యగారూ. (నారాయణనుచూస్తూ) డాక్టరుగారు మాట్లాడొద్దన్నారు. కాసేపు కళ్లుమూసుకు పడుకో నాయనా.

అచ్చ : అబ్బాయి పుల్లయ్యా, యిక్కడ చలిగాలేస్తుంది. మంచం అవతలకు పడదాం పట్టూ.

(మంచం లోపలకు పట్టుతూ వుంటారు)

16

అచ్చయ్యగారిల్లు

[విమల చక్కగా అలంకరించుకొని సంతోషంగా పాడుకొంటూవుంటుంది.]

మధ్యమావతి - తీన్‌తాల్

దేశ సేవకుల హృదయం నవనీత తుల్య మా హృదయం ॥దేశ॥
సంఘంబున గల చెడుగు లన్నిటిని
సరిజేయగ కంకణము ధరించిన ॥దేశ॥

నిస్సహాయులౌ పరులపీడ గని
నీరై ప్రాణము లొసగెడి వీరులు
ప్రజా సేవయే పరమావధిగా
పగలు రాత్రి పలు బాములుబడు యీ ॥దేశ॥
నిరాడంబరులు నీతిశీలురు
కరుణారస సంభరితులు ఘనులీ ॥దేశ॥

(పేపరు చదువుకొంటూ నారాయణరావు ప్రవేశం)

నారా : (పాట చివర చరణం అందుకుంటాడు. విమల వెనక్కి తిరిగిచూస్తుంది నారాయణరావు పేపరుకేసి చూస్తూవుంటాడు)

విమ : ఎంతపనున్నా వేళ కాహారం తీసుకోవాలనిగూడా తెలియదా ? నీ కెదురు చూస్తూ యెంతసేపని కూర్చోవాలి? (అని నవ్వుతూ లోపలికెళ్ళి కాఫీ తీసుకొస్తుంది నారాయణరావు కుర్చీలోకూర్చొని టేబులుమీద పుస్తకం తీసి చదువుతూ వుంటాడు.)

విమ : (కాఫీ అందించుతూ) ఏమిటి చదువుతున్నావు ?

నారా : ఆఁ వీదే - ఏదో పుస్తకం డ్రాయరుమీదుంటే చదువుతున్నా

విమ : ఈపుస్తకానికేకాదు. యిక్కడవున్న సర్వానికి నేనే అధికారిని.

నారా : కాదని నేననలేదే!

విమ : ఆ....మరి.... "యీ పుస్తకం నీదే" అంటే మిగతా కొన్నిటిమీద నాలుగురోజులున్నంత మాత్రాన ఏదో నీకూ కొంత అధికారం సంక్ర మించినట్లుగా ధ్వని స్ఫురింప జేస్తున్నావులే.

నారా : అయితే పొరపాటే. క్షమించు.

విమ : ఇంతకూ ఆ పుస్తకం యేమిటో చెప్పనేలేదు.

నారా : కాఫీ తాగుతున్నావుగా నీవు చూసుకోరాదూ ?

(విమల పుస్తకం తీసుకొని పేరు చదువుతున్నట్లుగా నటించి. కాఫీ త్రాగుతూవున్న నారాయణరావువంక చూచీ చూడనట్లు చూస్తూ)

విమ : ఓహో .... ఇదా .... నా .... నారాయణరావు (నవ్వుతూ) అడవివారు వ్రాసిందిలెండి

(ఈ సంభాషణంతా అచ్చయ్యగారు చాటుగావుండి వింటూ వుంటాడు)

అచ్చ : (ప్రవేశించి) అవునమ్మా. నీనారాయణరావే. ఎవరుకాదన్నారు.

(విమల సిగ్గుపడుతుంది. నారాయణరావు లేవబోతాడు)

కూర్చోనాయనా లేవడమెందుకు. వయస్సులో చిన్నవాడవైనా గుణంలో మా అందరికంటె పెద్దవు. (పక్కకుర్చీలో కూర్చుంటాడు. విమల తండ్రి కూర్చున్న కుర్చీపట్టుకుని నుంచుంటుంది) ఇన్నాళ్ళూ నిన్ను అపార్థం జేసుకొన్నాను. నిజంగా నీవు జేసిన వుపకారం మరువ దగిందికాదు.

నారా : ఇందులో నేజేసిన ఘనకార్యమేముందిలెండి. నా కర్తవ్యాన్ని నే నెర వేర్చాను.

అచ్చ : నిజమే నీకర్తవ్యం నీవు నెరవేర్చావు యిక నాకర్తవ్యముంది.

నారా : మీరుమాత్రం తక్కువ చేశారా. ఈపదిరోజులూ ఎంతో ఆప్యాయంగా జూశారు. కృతజ్ఞుణ్ణి. ఇవ్వాళ సాయంకాలం సెలవిప్పిస్తారా ?

అచ్చ : (నవ్వుతూ) ఎక్కడికి ?

(శాంతమ్మ ప్రవేశిస్తుంది)

శాంత : ఎల్లాం నాయనా ఇప్పటికే పదిరోజులయింది. కన్నబిడ్డకు చేయించి నట్టు ఎంతో శ్రద్ధగా వైద్యం చేయించారు.

అచ్చ : ఏమక్కయ్యా! రావడం మీవంతే మళ్ళీ పోవడం మీవంతే.

విమ : అవునమ్మమ్మా! మీరుంటే ఎంతో సందడిగావుంది.

కాంత : చిన్నపిల్లవు. నీకు తెలియదులే అమ్మా! బాగుండదు.

(అచ్చయ్య నవ్వుతాడు. పుల్లయ్య. కాసిం యితర రైతులు ప్రవేశించుతారు)

కాసిం : ఏం భాయీ. అచ్ఛావుండావ్.

నారా : ఆ కులాసాగానే వుంది భాయి. పుల్లయ్య మామా. జమీందారు సంగతేమన్నా తెలిసిందా?

పుల్ల : పట్నం పారిపోయాడంట.

అచ్చ : ఇకనేం. ఆ రాత్రి అక్కడే వున్నట్లు బుజావు చేయడానికి ఏ తప్పుడు సర్టిఫికెట్టో పుట్టిస్తాడు.

కాసిం : అచ్చయ్యగార్కి జమీందార్కి మతలబ్ అచ్ఛా మాలూమ్.

నారా : తక్కిన యిద్దరు రౌడీలెవరో తేలారా ?

పుల్ల : ఆ తేలక యెక్కడికి పోతారు. నాగేంద్రాన్ని, పిల్లి భీముణ్ణి పట్టుకొని మెత్తగా తంతే మిగతావాళ్లిద్దరి పేర్లు కూడా బయటపెట్టారు. నలుగురూ యిప్పుడు సబ్‌జైల్లో వున్నారు.

కాసిం : హిక మనసైతాన్ వట్టిపోయింది. హిప్పువాడ్కి తలిసేవాడు వక్డూభినై.

కోట : మన వక్కవూళ్లోనేకాదు. చుట్టు పట్టూళ్ళల్లో జనం అంతా సంఘంలో చేరారు.

వీర : మొన్న గోవిందపురం వెళ్ళితే అంతా మన నారాయణరావును తలిచే వాళ్లే.

అచ్చ : నాయనలారా! మనందరం రైతులం. ఒకొళ్ళకొకళ్ళం అండాదండగా వుండాలని గుర్తించక జమీందారుకు బాసటగానిల్చి పొరపాటు చేశాను. అందుకిప్పుడు విచారపడుతున్నా. నేటికి సంఘశక్తిని గుర్తించాను. నారాయణా! ఈవిజయ చిహ్నంగా నా యింటిముందు నీచేత్తోనే జెండా ప్రతిష్ఠాపన చేయమని కోరుతున్నాను.

నారా : నిజంగా మనమొక గొప్ప విజయం సాధించాం. ఇందులో యేమీ సందేహం లేదు. అయినా యింతమాత్రానికే మనం గర్వపడగూడదు. మనం చేయాల్సినపని యింకా చాలా వుంది. ఎన్ని కష్టాలొచ్చినా, అవసరమైతే ప్రాణాలర్పించైనాసరే. యీ జెండాను కాపాడుకోవాలి. ఈ జండా నీడనే నిల్చి మనం మన లక్ష్యాన్ని సాధించగలం. (జెండా నెగురవేస్తూ) బోలో రైతుసంఘాలకి జై (అందరూ అంటారు.)

కాసిం : జీహాఁ గొప్పవిజయం షాధించాం. ఇందుక్ హోక్రోజ్ పులావ్ సేయాలా ఖుసపావుంది. మాదీబీబీ బిల్ హుషారుగా వుంది పులావ్ సేసేదాన్కి. (దీనంగా) కావి, చావల్ నై.

అచ్చ : కాసిం మీకీసమయంలో బియ్యం లేవనే విచారమెందుకు? బియ్యమే కాదు. కావలసిన సామగ్రంతా పంపిస్తాను. నీ యిష్టం వచ్చినట్లు జలాసా చేయించు.

కాసిం : అచ్ఛా సలాం.

పుల్ల : అయితే రేపు కాసిం యింటికాడ మాఅందరికి పప్పు భోజనమన్నమాట

కాసిం : ఏకోన్‌రే! నాకీపులావ్ చెప్తావుంటే పప్పుపప్పొటోత్రైక్యా. (అందరూ నవ్వుతారు)

అచ్చ : సరే. రేపు కాసిం యింటివద్ద. యివ్వాళ మా యింటిదగ్గర విందు. యీ సంతోష సమయంలో మీ అందరికీ ఒక శుభవార్త వినిపించదలచుకొన్నాను. ఊళ్లోవున్న రత్నాన్ని గాజుపెంకనుకొని యెక్కడెక్కడో తిరిగాను. ఇన్నాళ్ళనుంచి విమల అంతర్యం తెలుసుకోలేక పోయాను పెండ్లికి ప్రేమ ప్రధానంగాని, డబ్బు ప్రధానంగాదని నేటికి గుర్తించాను నారాయణా! నీ ప్రాణాన్ని కూడా లక్ష్యంచేయకుండా యీ విమలను నీవే కాపాడావు. నీకే అర్పిస్తున్నాను. స్వీకరించు. (ఇద్దరి చేతులు కలుపుతాడు.)

కాసిం : నారాయణ భయ్యా! రేపు మా యింట్కి మీద బీబీతోకూడా పులావ్‌కు రావాలి. మాదీ బీబీ, మీదీ బీబీఁ షలామత్ షేయవాలి.

నారా : బోలో. స్వతంత్ర భారత్‌కు జై. రైతు సంఘాలకు జై.

(అందరూ అంటారు)

యమన్ - దాద్రా

కదలి రండోయీ వేగముగా కర్షకులారా
అదేనోయ్; అదేనోయ్; అదే అరుణ పతాకం
కరువు కాటకాల నణచి కాపాడును యీ జెండా
పరుల పీడబాపి మనల దరికిజేర్చు నీ జెండా.
ప్రజల కండదండ యీ పతాక మిదేనోయ్ ॥కదలి॥

నారా : మూఢ భావముల వదలి ముందడుగు వేయుడోయీ

అందరు : మూఢభావముల వదలి ముందడుగు వేయుడోయీ

...న కదలుడోయీ, కాలహరణ మేలనోయీ,
...ని కదలుడోయీ కాలహరణ మేలనోయీ:
మాని యిపుడె దీక్ష బూనుడోయ్;
ఇపుడె దీక్ష బూనుడోయ్; ఇపుడే దీక్ష బూనుడోయ్

అంతఃకలహము లంతరింపగా, ఐక్యముగండోయీ,
అంత్య విజయమును సాధింపంగా అందరు రండోయీ:
ముందుకు రండోయీ: ముందుకు రండోయీ:

సమాప్తం

ప్రజాశక్తి ప్రెస్, బెజవాడ.
83/44: 3000 — కాపీలు ది 5—7—45

END OF
TITLE